# చీకటి కోణాలు

## కె. బాలగోపాల్

### 1

నక్సలైట్ ఉద్యమం వల్ల జరిగిన మేలు గురించి చెప్పేవాళ్ళూ రాసేవాళ్ళూ చాలా మంది ఉన్నారు. కాబట్టి నేను ఆ ఉద్యమం చీకటి కోణాల గురించే చెప్తాను. ఆ ఉద్యమం వల్ల చాలా మేలు జరిగిన మాట వాస్తవమే. ఎం-ఎల్ పార్టీల సామాజిక పునాది అయిన తెలంగాణ గ్రామ పేదలకూ ఏజన్సీ ఆదివాసులకూ మాత్రమే కాదు, మొత్తంగా మన సమాజానికి మేలు జరిగింది. (మరికొన్ని వర్గాలకు కూడ మేలు జరిగింది అనే బదులు *'మొత్తంగా సమాజానికి మేలు జరిగింది' అనడంలో ఎక్కడో కొంచెం భావవాద బలహీనత దాగి ఉందని వారు అనుకుంటే అనుకోవచ్చుగాక.*) కానీ కీడు కూడ జరిగింది. జరుగుతూ ఉంది. ఇది కాకతాళీయంగా దొర్లిన పొరబాట్లవల్ల జరుగుతున్న కీడు కాదు. ఆ ఉద్యమం అనుసరిస్తున్న పద్ధతులనుండి వచ్చిన కీడు. దాని గురించి నిర్మొహమాటంగా మాట్లాడుకోవాలి. విమర్శను పొగడ్తల మధ్య బ్రాకెట్లలో ఇరికించనక్కరలేదు. వారిని ప్రశంసించవలసి వచ్చినప్పుడు ప్రశంసించవచ్చును. కానీ విమర్శను విమర్శగానే, విడిగానే చర్చకు పెట్టాలి. అభ్యుదయం కోసం ప్రాణాలు తీసే హక్కు తమకుందనీ, ఏది అభ్యుదయమో నిర్ణయించుకొనే విజ్ఞత సహితం తమకుందనీ ప్రకటించుకునే వారిని బహిరంగంగానే బోనులో నిలబెట్టి ప్రశ్నించాలి. ఇతరుల హక్కులను (జీవించే హక్కుతో సహా) విప్లవం కోసం హరించడానికి ఎంతమాత్రం వెనకాడని వారిని విమర్శించడానికి మనం వెనకాడనక్కరలేదు. వెనకాడినట్టయితే శాస్త్రీయ విజ్ఞతను తమకు తాము ఆపాదించుకొని ఆ పార్టీలు తీస్తున్న ప్రాణాలకూ హరిస్తున్న హక్కులకూ ప్రజలకు కలిగిస్తున్న కష్టాలకూ మనమందరం కూడ బాధ్యులం అవుతాము. ఈ విషయం గుర్తించడానికి, గుర్తించిన తరువాత కూడ మాట్లాడడానికి ఈ రాష్ట్రంలోని ప్రజాతంత్రవాదులు చాలామంది-నాతో సహా-చాలా కాలం అన్నీ తెలిసీ తటపటాయించటం వల్ల చాలా నష్టం జరిగిందనుకుంటాను. ఈ విమర్శను పోలీసులు ఉపయోగించుకుంటారనీ, నిర్బంధానికి అనుకూల ప్రచారంగా వాడుకుంటారనీ అనే వారున్నారు. నిజానికి ఆ భయంతోనే చాలా కాలం ఊరుకున్నాం. అయితే ఈ విమర్శవల్ల పోలీసులకూ ప్రభుత్వ నిర్బంధానికీ వచ్చే ప్రయోజనం కన్నా ప్రజలకూ ఉద్యమాలకూ సమాజానికీ ఎక్కువ ప్రయోజనం ఉంది. అంతేకాదు, ప్రభుత్వానికి ప్రయోజనం మాత్రమే ఉండవచ్చు. సమాజానికి అవసరం కూడ ఉంది.

తెలంగాణను పట్టి పీడించిన దొరతనాన్ని అంతం చేసింది నక్సలైట్లేననేది వాస్తవం. ఆ పని బల ప్రయోగంతోనే చేసారు. ఇంకొక విధంగా కూడ జరిగి ఉండేదేమోగానీ ఈ విధంగా జరిగిందన్న సత్యాన్ని కాదనలేము. ఇది తెలంగాణ ఎం-ఎల్ ఉద్యమం వల్ల పొందిన ప్రయోజనం. దొరల దోపిడీ పీడనల కింద నలిగిన పీడిత కులాల, వర్గాల ప్రజలు మరీ

ముఖ్యంగా పొందిన ప్రయోజనం. అయితే నక్సలైట్ల కృషి అక్కడితో ఆగిపోలేదు. తమ సాయుధ ఆధిపత్యం కిందనే విప్లవం వస్తుందనీ, శ్రామిక ప్రజలకు దోపిడీనుండి శాశ్వత విముక్తి లభిస్తుందనీ ఆ పార్టీలు నమ్ముతాయి. దొరతనం మీద చేసిన పోరాటం వల్ల, కూలి పోరాటాల వల్ల, భూమి పోరాటాల వల్ల తమకు లభించిన సామాజిక పునాదిని ప్రాతిపదిక చేసుకొని అవి సమాజం మీద సాయుధ ఆధిపత్యం నెలకొల్పే దిశగా వ్యూహరచన చేసుకొని అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలో కూడ పేద, పీడిత ప్రజలకు వారు కొంత మేలు చేస్తూనే ఉన్నారు. ఆ ప్రజల సాంఘిక ఆర్థిక సమస్యలు కొంత తీరుస్తున్నారు, లేదా తీర్చే ప్రయత్నం చేస్తున్నారు. దానినుండే ఈ పార్టీలు తమ చర్యలకూ తమ రాజ్యాధికార వ్యూహానికీ సాధికారత, ప్రజామోదం కోరుకుంటాయి. మందు పాతరలు పేల్చి మూకుమ్మడి హత్యలకు పాల్పడినా, డైనమైట్లతో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు పేల్చేసినా, బస్సులు కాల్చేసినా, ఇన్‌ఫార్మర్ల పేరిట స్పష్టమైన ఆధారం ఉన్నా లేకున్నా హత్యలు చేసినా, అందులోనూ పేదలనే ఎక్కువగా హత్యచేసినా, తమ రాజకీయ ప్రత్యర్థులతోనూ తమకు అడ్డంవచ్చిన వారందరితోనూ నిరంకుశంగా వ్యవహరించినా, ప్రజాకోర్టులలోనూ పంచాయతులలోనూ ఏకపక్షంగా వ్యవహరించినా, చిన్న తప్పులకు పెద్దశిక్ష వేసినా, భూమిపోరాటం పేరిట పెద్ద భూస్వాములతో పాటు సాధారణ రైతుల భూములు సైతం బీడు పెట్టించినా, ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజాపోరాటం పేరిట ఏం చేసినా, ప్రజల సాంఘిక ఆర్థిక సమస్యలకు తాము అందిస్తున్న పరిష్కారం పేరిట దానినంతటినీ సమర్థించుకోవాలనీ ఆ చర్యలన్నిటికీ ఆమోదం పొందాలనీ ఈ పార్టీలు చూస్తాయి. 'ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం- లేదా తమ రాజ్యస్థాపనకోసం- చేస్తున్న పోరాటంలో భాగంగా, తమకు అడ్డంవచ్చిన వారిపైన తీసుకుంటున్న న్యాయమైన చర్యలు'గా వీటిని సమాజం చూడాలనీ ఆమోదించాలనీ ఈ పార్టీలు కోరుకుంటాయి. ఈ ప్రచారం చేసిపెట్టడమే తమ డ్యూటీగా భావించే మేధావులు, అదే ఈనాటి ప్రధాన ప్రజాతంత్ర కర్తవ్యం అని భావించే మేధావులు ఈ రాష్ట్రంలో చాలామందే ఉన్నారు.

దీనిని గుడ్డిగా దిగమింగవలసిన అవసరం ఏమీ లేదు. ప్రతి రాజకీయంలోనూ నిజమైన అంశం కొంత, సాధికారతకు సంబంధించిన అంశం కొంత (వాస్తవం కొంత, భావజాలం కొంత) ఉన్నట్టే నక్సలైట్ రాజకీయాల్లోనూ ఉంది. (*ఇతర రాజకీయాలలో ఉన్నదంతా భావజాలమే, తమది మాత్రం అంతా సత్యమేనని ఈ పార్టీలు భావించినప్పటికీ*) నక్సలైట్ పార్టీలు ప్రజల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే కృషి చేయడం లేదు. ప్రజల రాజ్యాధికారంగా చెప్పబడే తమ రాజ్యాధికారం కోసం ఒక పంథాను రూపొందించుకొని పనిచేస్తున్నాయి. ఆ పంథావల్ల నిజంగానే సమసమాజం వస్తుందా, అందులోని సమస్యల పట్ల ఈ పార్టీలకు సరయిన అవగాహన ఉందా, ఈ శతాబ్దపు కమ్యూనిస్టు ప్రయోగాల చరిత్రను పొగిడినన్నాళ్ళు పొగడడం ఆ తరువాత తెగడడం తప్ప ఈ కోణం నుండి ఎప్పుడైనా అధ్యయనం చేశారా, ఏ ప్రజల పేరిటనైతే తమ పంథాను ఈ పార్టీలు సమర్థించుకుంటున్నాయో ఆ ప్రజలకు ఆ పంథాపట్ల ఆమోదం ఉందా, అసలు అవగాహన ఉందా, తమ పంథాను అమలు చేసే క్రమంలో ఈ పార్టీలు చేస్తున్న హానీ తీస్తున్న ప్రాణాలూ తెస్తున్న నిర్బంధం విప్లవానికి

'అనివార్యమా', ఆ క్రమంలో సామాజిక జీవితంలోనూ సంస్కృతిలోనూ వస్తున్న నష్టకరమైన మార్పుల పట్ల ఈ పార్టీలకేమైనా పట్టింపు ఉందా, అసలు అవగాహన ఉందా అన్న ప్రశ్నలు వేసుకోకుండ వారు కోరుకునే సాధికారత వారికి గుడ్డిగా ఇవ్వడం అనవసరం. వారు అనుసరిస్తున్న విధానాలను వారు సంకల్పపూర్వకంగా ఏర్పరచుకున్న విధానాలుగా చూడడం, మొత్తమంతా ప్రజల ఆకాంక్షల నుండి ఒక అనివార్యక్రమంలో పుట్టిందన్న వాదనను విమర్శించడం, వాటి దుష్ఫలితాలను నిర్మొహమాటంగా ఆక్షేపించడం అవసరం.

నక్సలైట్ పార్టీలు అనేకం ఉన్నాయి. కాబట్టి ఒక్కొక్క పార్టీవిషయం విడివిడిగా మాట్లాడుకోవాలని వీరి 'పోరాట ప్రాంతాలకు'-ముఖ్యంగా ఉత్తర తెలంగాణకు-దూరంగా బతికేవాళ్ళు అనుకోవచ్చు. అది ఒకప్పటి మాట. ఉత్తర తెలంగాణలో ప్రధానంగా పనిచేస్తున్న పీపుల్స్‌వార్ ,జనశక్తి, ప్రతిఘటన (ఫణిబాగ్చి గ్రూపు)ల ఆచరణలో ఈ రోజు మౌలికమైన తేడా ఏమీలేదు. ప్రజాసమీకరణ ప్రధానమా లేక దళ చర్యలు ప్రధానమా అనే చర్చ ఈ పార్టీల మధ్య ఒకప్పుడు జరిగేది. పీపుల్స్‌వార్ దళ చర్యలకే ప్రాధాన్యం ఇస్తుందని ఇతరులు విమర్శించేవారు. ఇప్పుడు ఆ చర్చ, ఆ విమర్శ తగ్గిపోయాయి. ఎందుకంటే ఇప్పుడు అందరి ఆచరణ దాదాపు ఒకటే. *(నేనిక్కడ సాయుధ పోరాట పార్టీల గురించి మాట్లాడుతున్నాను. న్యూడెమోక్రసీని, జనశక్తి పేరుతోనే పనిచేస్తున్న ఒకప్పటి 'నాగిరెడ్డి' గ్రూపునూ ప్రస్తావించడం లేదు. వాటి ఆచరణలో విమర్శించవలసిన విషయాలు లేవని కాదు. కానీ అది వేరే చర్చ.)* ఇప్పుడు అందరి కార్యకలాపాలూ దళాల చుట్టూ తిరుగుతున్నాయి. రాశిలోనే తప్ప గుణంలో తేడా స్వల్పం. *(ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, బీహార్‌లోని ఎం-ఎల్ పార్టీలు కూడ ఇప్పుడు ఈ నమూనాలోనే పనిచేస్తున్నాయి. అది మంచో చెడో గాని ఇప్పుడు దేశంలో పీపుల్స్‌వార్ నమూనాయే విప్లవ కమ్యూనిస్టు నమూనా అయింది.)* రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమానికి ప్రధాన కేంద్రాలైన వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలోనైతే రాశిలో కూడ తేడా లేదు. కాబట్టి అందరి గురించి కలిపే చర్చించవచ్చు. ఈ పార్టీలు ప్రజాసమీకరణ అసలే చేయడం లేదని కాదు. సమస్యల మీద పోరాడడానికి ప్రజలను సమీకరిస్తున్నది చాలా తక్కువేగాని ప్రదర్శనలకు సదస్సులకు అప్పుడప్పుడు బాగానే సమీకరిస్తుంటారు. పోలీసులు అడ్డం రాకుంటే ఇంకా పెద్ద ఎత్తున సమీకరించగలరు. ఈ పార్టీలకున్నంత ప్రజాదరణ ఉత్తర తెలంగాణలో వేరే ఏ రాజకీయాలకూ లేదనేది కేవలం వీరి ఆత్మస్తుతి అనుకోనక్కరలేదు. తుపాకుల ఘోషమధ్య నిజమైన ప్రజాదరణ ఎవరికి ఎంత ఉంది అని తేల్చడం కష్టమే గాని ఎం-ఎల్ పార్టీలకు చాలా ప్రజాదరణ ఉన్నమాట కాదననవసరం లేదు. అంతమాత్రం చేత ఇక నోరు మూసుకో మంటే మూసుకోవలసిన అవసరమూ లేదు.

ఎం-ఎల్ పార్టీల పోరాటాల పట్ల మొత్తంగా నా వైఖరేమిటో స్పష్టం చేయకుండ కేవలం వారి తప్పుడు పోకడలను విమర్శిస్తున్నట్టు మాట్లాడుతూ (లేదా నటిస్తూ) వారి పోరాట లక్ష్యానికి నిజానికి తావే లేకుండా చేస్తున్నానన్న విమర్శ నా మీద పెట్టే అవకాశం ఉంది. *(ఇంకొంచెం సున్నితంగా చెప్పదలచుకున్న వాళ్లు, నైతిక సార్వజనీనత చాటున నేను రాజకీయ పోరాటాలకు చోటు లేకుండ చేస్తున్నానని అభిశంసించ వచ్చును.)* తమకు ఎవరిపట్లా లేని జవాబుదారీతనం తమను విమర్శించేవారికి మాత్రం తమ పట్ల ఉండాలనే ఈ ధోరణిని

ఆమోదించవలసిన అవసరం లేనప్పటికీ నా వైఖరేమిటో చెప్తాను. తెలంగాణలోనూ ఏజెన్సీలోనూ కొన్ని రకాల సామాజిక ఆర్థిక ఆధిపత్యాన్నీ, అన్యాయాన్నీ పోగొట్టడానికి నక్సలైట్ పార్టీల బలప్రయోగ రాజకీయాలు చాలా ఉపయోగపడ్డాయి. (మొదట్లో ఈ రాజకీయాలలో బలప్రయోగంతో పాటు ప్రజాసమీకరణ కూడ చెప్పుకోదగ్గ మోతాదులో ఉండిందనేది కూడా సత్యమే.) ఈ మార్పు బలప్రయోగం అవసరం లేకుండా వచ్చి ఉంటే బాగుండేది. ఎందుకంటే, బలప్రయోగంతో లేక బలప్రయోగ భయంతో వచ్చే మార్పుకంటే సామాజిక సంస్కృతిలో పరిపూర్ణంగా జీర్ణమైన తరువాత వ్యవస్థితమయ్యే మార్పే స్థిరంగా, సహజంగా ఉంటుంది కాబట్టి. కానీ దీనికి తప్పు పట్టవలసింది బలప్రయోగం చేసినవారిని కాదు. ప్రత్యామ్నాయ ప్రయత్నాలు సాగనివ్వనివారిని. అయినప్పటికీ- ఆ మేరకు బలప్రయోగం ద్వారా న్యాయాన్ని నిలబెట్టిన వారి కృషిని గుర్తిస్తూనే- ఆ పని బలప్రయోగం ద్వారా చేపట్టడం వల్ల వచ్చిన నష్టాలను సహేతుకంగా గుర్తించవలసిందే. అప్పుడు మాత్రమే వాటిని చక్కదిద్దడం సాధ్యం అవుతుంది. అది అవసరాన్ని మించిన రాశిలో ఉండకుండ చూడడం సాధ్యం అవుతుంది.

రెండు, అన్యాయాలను ఎప్పటికప్పుడు ఎదుర్కొనడమే కాక అన్యాయానికి తావేలేని సమసమాజాన్ని నిర్మించడం కూడ ఎం-ఎల్ పార్టీల ఆశయమే. దానికోసం వారు రాజ్యాధికారాన్ని తమ రాజకీయ లక్ష్యంగా ఎంచుకున్నారు. ఆ రాజ్యాధికారానికి బలప్రయోగాన్ని (సాయుధ పోరాటమార్గాన్ని) సాధనంగా ఎంచుకున్నారు. ఈ లక్ష్యం, సాధనం ఆ పార్టీల ప్రజాపునాదిలో మెజారిటీ ఆమోదం పొందాయని నమ్మడానికి ఆధారాలేమీ లేవు. ఈ లక్ష్య సాధనకోసం జరిగే చర్యలలో ప్రజాసమీకరణ చాలా తక్కువ. తమ కార్యకర్తలలో అత్యధిక భాగం అదే ప్రజాపునాదికి. (పీడిత కుల, వర్గాలకు-స్త్రీలు అతితక్కువ అయినప్పటికీ) చెందినవారన్న ఒక్క విషయమే ఇది 'ప్రజల లక్ష్యం' అని ఆ పార్టీలు చెప్పుకోవడానికి (మనం ఒప్పుకొనేటట్టయితే) ఉపయోగపడుతుంది.

సమసమాజ స్థాపన రాజ్యాధికారం ద్వారా జరగదని నేను అనుకుంటున్నాను. సమసమాజ స్థాపనే కాదు, దాని ఆర్థిక పార్శ్వం అయిన (అది పార్శ్వం మాత్రమే, 'పునాది' కాదు)సమష్టి ఉత్పత్తి వ్యవస్థను నెలకొల్పడం సైతం రాజ్యాధికారం ద్వారా జరగదని ఈ శతాబ్దపు చరిత్ర ఋజువు చేసిందనుకుంటున్నాను. అయినప్పటికీ, సమసమాజ స్థాపనకు అవసరమైన కొన్ని పనులు- ఉదాహరణకు సొంత ఆస్తిని కాపాడే చట్టాలను రద్దు చేయడం, సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల దాడినుండి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడడం వగైరా-రాజ్యం ద్వారా జరగగలవు. అవి కూడ ఆ రాజ్యం ప్రజాస్వామికమైతేనే నిలకడగా జరగగలవు. ఈ పరిమితమైన పరిధిలో రాజ్యాధికార లక్ష్యాన్ని ఒక అర్థవంతమైన రాజకీయ లక్ష్యంగానే గుర్తించవచ్చు. మరి ఈ లక్ష్యం కేవలం సాయుధ పోరాటం ద్వారానే సాధ్యమౌతుందా? అది పరిస్థితులను బట్టి ఉంటుంది. ప్రస్తుతం భారతదేశంలో ఉన్న పరిస్థితులలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తిరస్కరించే సాయుధ పోరాట పంథాలో మాత్రమే సాధ్యమౌతుందని అనుకోనవసరం లేదు. అయినప్పటికీ ఆ పంథానే ఎంచుకోవడం వెనుక బలమైన వాదనలున్నాయి. కాబట్టి దీనిని అర్థరహితమైన రాజకీయ నిర్ణయంగా భావించనవసరం లేదు. దాని సాధికారతను ప్రశ్నించవలసిందే గాని మొత్తంగా తిరస్కరించవలసిన అవసరం లేదు.

అయితే సాయుధ పోరాట పంథా అనేది ఒకే ఒక రూపంలో ఉండదు. అనేక రూపాలలో ఉండగలదు. అన్నిటి ప్రభావం ఒకే రకంగా ఉండదు. ఒక నిర్దిష్టమైన రూపాన్ని మన రాష్ట్రంలోని (సాయుధపోరాట) నక్సలైట్ పార్టీలు ఎంచుకున్నాయి. దాని ఫలితాలను, పర్యవసానాలను నిర్దిష్టంగానే అర్థం చేసుకొని విమర్శించాలి. వాటికి ఆ పంథాను ఎంపిక చేసుకొని అమలు చేస్తున్నవారిని బాధ్యులు చేయాలి. వారి పంథా 'అనివార్యం' అనుకుంటే ఈ పర్యవసానాల గురించి చేయగలిగిందేమీ లేదనుకుంటాం. కాని అది ఉద్దేశపూర్వకంగా ఎంచుకున్న ఒకానొక మార్గం అని గుర్తించినప్పుడు దానివల్ల వచ్చే సత్ఫలితాలతో పాటు దుష్ఫలితాలను కూడ గుర్తించడం అవసరం, వాటికి ఆ పార్టీలను నిలదీయడం అవసరం. అప్పుడు కనీసం ఆ దుష్ఫలితాలను తగ్గించగలుగుతాం.

దీనికి నేను సార్వజనీన నైతిక ప్రమాణాలు ఉపయోగిస్తున్నానా లేదా అనేది మొత్తం విమర్శ చదివిన తరువాత నిర్ణయించవలసిన విషయం. నైతికత అనగానే అవి సార్వజనీనమా అని ఆందోళన చెందే దుస్థితిలో అభ్యుదయవాదులు ఉండనవసరం లేదు. (దురదృష్టవశాత్తు చాలామంది ఉన్నారు.) కొన్ని సూత్రాలు సార్వజనీనమైనవే. ఏది తప్పు ఏది ఒప్పు అనేదానికి అన్ని విషయాలలోనూ సార్వత్రిక ప్రమాణాలు ఉండకపోవచ్చును గానీ ఒకరు చేయని తప్పుకు (ఆ తప్పును ఏ విధంగా నిర్వచించినప్పటికీ) వారిని శిక్షించకూడదనేది ఒక సార్వత్రిక నియమమేననీ, అది రాజ్యానికే కాక ఉద్యమాలకు కూడా వర్తిస్తుందనీ అనుకుంటాను. న్యాయానికి అన్నివేళలా ఒకే నిర్వచనం ఉండకపోవచ్చును గానీ ఒక నిర్వచనం అంటూ ఇచ్చిన తరువాత మనకోసం మనం కోరుకునే న్యాయం ఇతరులకు కూడ మనం ఇవ్వాలనేది ఒక సార్వత్రిక నియమమే అనుకుంటాను. ఒక హక్కు లేక నియమం లేక విలువ సార్వత్రికం కాదనీ, ఒక పరిధిలో మాత్రమే దానిని ఆమోదిస్తామనీ చెప్పేవారు ఆ పరిధిలోనే దానిని ఎందుకు ఆమోదిస్తున్నారో తర్కబద్ధంగా వివరించే బాధ్యత తమమీద వేసుకోవాలన్నది ఒక సార్వత్రిక నియమమే ననుకుంటాను. సార్వత్రికం కాని విలువను తాము ఆమోదించే పరిధి లోపల అమలు చేసేటప్పుడు సమత పాటించాలనేది ఒక సార్వత్రిక నియమమే ననుకుంటాను.

అన్యాయానికీ దౌర్జన్యానికీ గురయినవారు ప్రతీకారం తీర్చుకునేటప్పుడు సరిగ్గా తమకు అన్యాయం జరిగిన మోతాదులోనే వ్యవహరించాలని అనలేము గానీ ఆ అన్యాయాన్ని చక్కదిద్దే కర్తవ్యాన్ని నూతన సమాజనిర్మాణ కృషిలో భాగంగా ఎంచుకున్నవారు అందుకు తగిన రీతిలో వ్యవహరించాలనడంలో తప్పు లేదనుకుంటాను. రాజ్యరహిత సమాజాన్ని అంతిమ లక్ష్యంగా ఎంచుకున్నవాళ్ళు (అందులో భాగంగానే రాజ్యాధికార లక్ష్యాన్ని తక్షణ కర్తవ్యంగా ఎంచుకున్నప్పటికీ) సమాజంలో బలప్రయోగాన్నీ అధికారాన్నీ ఆరాధించే సంస్కృతిని- మనుషులలో అటువంటి మనస్తత్వాన్ని-పెంపొందించకుండా ఉండాలనడంలో అనౌచిత్యం లేదనుకుంటాను. సాంస్కృతిక విప్లవం ఎప్పుడో కాదు ఇప్పటినుండే మొదలవుతుంది అని ఈ మధ్యకాలంలో అంటున్నవాళ్ళు సంస్కృతిలో విప్లవం తేకపోతే పోయారు (అంతటి పేరాశపరులం కాము) హింసా దౌర్జన్యాలనూ ముఠాతత్వాన్నీ అవకాశవాదాన్నీ పెంచకుండా ఉండాలని కోరడంలో అసాధ్యమైన నీతి ఏమీ లేదనుకుంటాను.

నక్సలైట్లు ఎంచుకున్న పోరాట పంథా వారికి రాజ్యాధికారం తెచ్చిపెడుతుందా లేదా అన్నదొక్కటే దాని మంచిచెడులను చర్చించడానికి గీటురాయి కాకూడదు. 'విలువలు సార్వత్రికమా?' అని ప్రశ్నించేవారి మనస్సులో ఉన్న భావన ఇదేనైతే దానిని వదులుకోవడం అవసరం. ఆ లోపల వారు తయారుచేస్తున్న సామాజిక సంస్కృతి ఎటువంటిది? దేనిని ధ్వంసం చేస్తున్నారు, దేనిని నిర్మిస్తున్నారు? ఎవరికి హాని చేస్తున్నారు, ఎంత చేస్తున్నారు, ఎందుకు చేస్తున్నారు? ఎటువంటి సామాజిక మార్పుకూ నైతిక వాతావరణానికీ దోహదం చేస్తున్నారు? ఎటువంటి వ్యక్తులను ఉద్యమాలవైపు ఆకర్షిస్తున్నారు, ఎటువంటి కార్యకర్తలను తయారు చేస్తున్నారు?....మొదలైన ప్రశ్నలన్నీ వేసుకోవాలి.

## 2

రెండేళ్ళ క్రిందననుకుంటాను. వికారాబాద్ ఎం.ఎల్.ఏ. చంద్రశేఖర్ (ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రి) పైన ఒక అభియోగం వచ్చింది. అతని ప్రోద్బలంతో అతని అనుచరులు వికారాబాద్ 'వార్త' విలేఖరి పైన దౌర్జన్యం చేశారని. ఆ విలేఖరి ఎవరో చెప్పిన విషయాన్ని నిజమో కాదో తెలుసుకోకుండా వార్తగా వ్రాసేసాడు. ఎం.ఎల్.ఏ. ఒక గ్రామానికి పోయినప్పుడు అక్కడ ప్రజలతనికి చెప్పులతో నిరసన తెలిపారని వార్త. ఈ వార్త చదివి కోపగించిన చంద్రశేఖర్ అనుచరులు విలేఖరిపైన తమ నాయకుడి సమక్షంలోనే, అతని ప్రోద్బలంతోనే చెప్పులతో కొడుతూ దాడి చేశారు. ఇది అభియోగం. అది నిజం కాదని, వాస్తవానికి తాను బలప్రయోగానికి పాల్పడకుండా తన అనుచరులను అదుపు చేయడానికి ప్రయత్నించాననీ ఎం.ఎల్.ఏ. అన్నాడు. అయితే తమ ఆరోపణలను తాము ఋజువు చేసుకోగలమనీ చంద్రశేఖర్ పైన, అతని అనుచరులపైన కేసుపెట్టి అరెస్టు చేయాలనీ విలేఖరులు ఆందోళన చేసారు. తాను దళితుణ్ణి కాబట్టే ఇంతగా ఆందోళన చేస్తున్నారని చంద్రశేఖర్ ప్రత్యారోపణ చేసాడు. అగ్రకులాలకు చెందిన ఎం.ఎల్.ఏ.లూ, మంత్రులూ విలేఖరులను ఏమన్నా నోరు మెదపని సంఘాలు తనమీద నిరాధారమైన ఆరోపణలు వేసి ఆందోళన చేస్తున్నాయన్నాడు. అతను చేస్తున్న తప్పులు కప్పిపుచ్చుకోవడానికి కులాన్ని వాడుకుంటున్నాడని విలేఖరులు అన్నారు. ఇరుపక్షాలూ మద్దతు సమీకరించుకుంటూ తమ వాదన ప్రచారం చేసుకున్నారు.

ఈ క్రమంలో చాలా ప్రశ్నలు చర్చకు వచ్చాయి. కులాలుగా వర్గాలుగా చీలిపోయి ఉన్న మన సమాజంలో పత్రికా స్వేచ్ఛను ఏ విధంగా అర్థం చేసుకోవాలి? బలవంతులకు నష్టకరమైన వార్తలు వ్రాయడానికి తటపటాయించే పత్రికలు బలహీనుల విషయంలో తటపటాయింపు లేకుండా రాసిపారేసి 'తప్పయితే క్షమించమని అడుగుతాం లెమ్మం'టే దానిని పత్రికా స్వేచ్ఛ పేరిట ఆమోదించాలా? విలేఖరులు కుల, వర్గ, లింగ పక్షపాతానికి అతీతులా? ఒక దళిత రాజకీయవేత్త నిజంగానే ఒకవేళ దౌర్జన్యం చేసినా దానిని అదేపనిగా ప్రచారం చేసి అతని కెరీర్ దెబ్బతీయడం అగ్రకులాల రాజకీయ ఆధిపత్యానికి సేవచేయడం కాదా? అని ఒకవైపు. చిత్తశుద్ధితో విలేఖరి నిజమని నమ్మి వ్రాసిన వార్తల్లో తప్పుంటే

సంజాయిషీ అడగొచ్చుగాని దాడిచేయడం సరైనదేనా? విలేఖరులు ఆత్మవిశ్వాసం కోల్పోతే పత్రికా స్వేచ్ఛ దెబ్బతినదా? దళిత నాయకులను విమర్శిస్తూ వార్తలు వ్రాసే విలేఖరులకు కులతత్వం అంటగట్టడం కూడ పత్రికా స్వేచ్ఛ పైన దాడికాదా? రాజకీయాలలో నేరప్రవృత్తి గురించి ఆందోళన చెందే మనం దళిత రాజకీయవేత్తలకు మాత్రం మినహాయింపు ఎందుకివ్వాలి? దానివల్ల అంతిమంగా దళితులకే నష్టం కాదా? అని ఇంకొకవైపు. ఈ విధంగా చర్చ కొన్ని వారాలు నడిచింది.

ఇది ఈనాటి పరిస్థితులలో సమాజ పురోగమనానికి చాలా ఉపయోగకరమైన చర్చ. అవసరమైన చర్చ. ఇరుపక్షాలు వినిపించిన వాదనలను సమాజం ఆకళింపు చేసుకున్న తరువాత ఇద్దరూ రాజీకి వచ్చి ఒక క్షమాపణతో సంతృప్తి చెందినా ఇంకొక రకంగా పరిష్కారమైనా ఆ చర్చవల్ల మన అవగాహన మెరుగుపడేది. భవిష్యత్తు ఆచరణకు - విలేఖరులకూ రాజకీయ నాయకులకే కాక మనందరికీ - ఒక ప్రమాణం దొరికేది.

కానీ ఈ చర్చ అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ అయ్యింది. పీపుల్స్‌వార్ ప్రతినిధి ఒకరు ఎం.ఎల్.ఏ. చంద్రశేఖర్‌ను హెచ్చరిస్తూ ప్రకటన చేశారు. (*లేకపోతే ఉత్తరం రాశారో*) ఆయన వెంటనే 'అన్నలు చెప్పారు కాబట్టి నా పొరపాటు ఒప్పుకుంటున్నాను. ఇంకెప్పుడు ఇట్లా జరుగదు' అని ప్రకటించి వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాడు. ఆయన అభిప్రాయాలు నిజానికి మారలేదు. సంఘటన గురించి అప్పటిదాకా ఎవరికున్న అభిప్రాయాలూ మారలేదు. ఏది న్యాయం, ఏది అన్యాయం, ఏది దౌర్జన్యం, ఏది ప్రజాస్వామ్యం అంటూ ఇరుపక్షాలు లేవదీసిన ప్రశ్నలకు జవాబు దొరకలేదు. కాని సమస్య 'పరిష్కారమైపోయింది'. తప్పు చంద్రశేఖర్‌దే అయి ఉండవచ్చునుగాని ఋజువయింది చంద్రశేఖర్ తప్పు చేశాడని కాదు. తప్పొప్పులు నిర్ణయించడానికి భయం, బెదిరింపుల కంటే నాగరికమైన మార్గాలు అన్నల రాజ్యంలో లేవని.

ఈ పరిష్కారాన్ని ఆనాడు ఆందోళన చేసిన విలేఖరులు విజయంగా భావించారో లేదో తెలీదు. ఎం.ఎల్.ఏ. తన తప్పు 'ఒప్పుకున్నాడు' కాబట్టి ఆందోళన విరమించారు. కాని విరమించే ముందు సిగ్గుతో తలదించుకొని రెండు నిముషాలు మౌనం పాటించి ఉంటే బాగుండేది.

ఇది చిన్నవిషయం అనుకునేవారు ఈ వ్యాసాన్ని ఇంక చదవనవసరం లేదు. నేను వాళ్ళకు చెప్పగలిగిందేమీ లేదు. ఇంతకంటే చాలా పెద్దవిషయాలు ఉన్నాయి. వాటిగురించి కూడ మాట్లాడుకుందాం. కాని ఈ 'చిన్న'విషయం తెలంగాణలో నేడు నెలకొన్న పరిస్థితికి బాగానే అద్దం పడుతుంది. చంద్రశేఖర్‌ను బెదిరించే ఉద్దేశం తమకు లేదనీ కేవలం తమ అభిప్రాయాన్ని ప్రకటించి అతనికి సలహా ఇవ్వడం తమ ఉద్దేశమనీ పీపుల్స్‌వార్ బాధ్యులు అనవచ్చు. వాళ్ళకు ఉద్దేశం ఉన్నా లేకున్నా (ఉందని ఒప్పుకున్నా లేకున్నా) వారి 'సలహా' లేక 'అభిప్రాయం' ఒక బెదిరింపుగా పనిచేస్తుందనేది తెలంగాణలో అందరికీ తెలిసిన ఒక

వాస్తవం. దానికి వారే బాధ్యులు. వారి అభిప్రాయాన్ని మన్నించనివారికి 'దేహశుద్ధి' జరిగిన ఘటనలనేకం ఉన్నాయి కాబట్టి (అది తమ విధానం కాదని వారు అప్పుడప్పుడు అంటున్నప్పటికీ) అదేమీ అసహజం కాదు. ఆ సంగతి ఆ సలహా లేక ప్రకటన ఇచ్చిన 'అన్న'కూ తెలుసును, దానికోసం పైరవీ చేసుకున్న ఆందోళనకారులకూ (ఎవరో ఒకరు పైరవి చేసుకునే ఉంటారు) తెలుసును. అందుకోసమే వాళ్ళు పైరవీ చేసుకుంటారు, అది తెలిసే వీరు ప్రకటన ఇస్తారు.

అయితే ఏమనవచ్చు. ఇటువంటి సామాజిక ఘర్షణలలో సమస్య పరిష్కారమయ్యే ముందు దాని భిన్న కోణాలు ప్రజల ఆలోచనలోనూ అవగాహనలోనూ జీర్ణం కావడం అవసరం. హేతుబద్ధమైన వివేచన ద్వారా అది సామాజిక చైతన్యంలో భాగమైన తరువాత జరిగే పరిష్కారమే నిలకడగా నిలుస్తుంది. ప్రజల చైతన్యం పెంచడం ద్వారానే సమస్యలు పరిష్కరించడం తమ విధానమని ఎం-ఎల్ పార్టీలన్నీ ప్రకటిస్తుంటాయి. కాని వారు చైతన్యం అనేది వ్యవస్థపట్ల నిరసనాత్మక చైతన్యం, దానికి వ్యతిరేకంగా పోరాడే చైతన్యం మాత్రమే. ఆ చైతన్యమైనా ప్రజలలో నిజంగా పెంపొందేదాకా వీరు ఆగుతున్నారా లేక తమ కార్యకర్తల మిలిటెన్సీనే ప్రజాచైతన్యంగా చలామణి చేస్తున్నారా అనేది ఒక ముఖ్యప్రశ్నేగానీ అదట్లాగుంచి, ఆ నిరసన, ఆ పోరాట చైతన్యం చాలా అవసరమే అయినప్పటికీ అదే అన్ని విషయాలకూ సరిపోదు. వ్యవస్థను కూలదోయడమే కాక సమాజ పునర్నిర్మాణం కూడ మన ధ్యేయమైనట్లయితే అది కొన్ని విషయాలకు మాత్రమే సరిపోతుందని గుర్తించాలి. తిరస్కరించడం, పోరాడడం, కూలదోయడం అనే క్రియలకు పరిమితం కాని చైతన్యవంతమైన ఆలోచన అనేక విషయాలలో అవసరం. దానికి కావలసింది మిలిటెన్సీ కాదు, వివేచన. వర్గకసికాదు, సున్నితత్వం. శత్రువును గుర్తించి ద్వేషించే చైతన్యం కాదు, శత్రువు-మిత్రులు అనే ద్వివిధ వర్గీకరణ అన్నిటికీ సరిపోదని గుర్తించి భిన్నకోణాలను అర్థం చేసుకొనే సహనం. దీనికి స్వేచ్ఛాయుతమైన సంవాదం కావాలి. చర్చకావాలి. ఆ స్వేచ్ఛను పెంపొందించడం ద్వారానే అనేక సమస్యలకు నిజమైన-నిలకడ అయిన-పరిష్కారం లభిస్తుంది అని ఎం-ఎల్ పార్టీలు గుర్తిస్తున్నాయా? ఎక్కడో ఒకచోట డాక్యుమెంట్లలోనో ఆత్మవిమర్శ పత్రాలలోనో రాసుకోవడం కాదు. ఆచరణలో గుర్తిస్తున్నాయా? లేకపోతే ఒక హెచ్చరిక చేస్తే-ఒక పోస్టర్ వేస్తే-అయిపోయేదానికి ఇదంతా ఎందుకు అనుకుంటున్నారా? అసలు ఆ గుర్తింపుకు వారి వ్యూహంలో చోటు ఉందా? **పేదప్రజలను పునాది చేసుకున్న బలప్రయోగం ద్వారా తమ ఆధిపత్యాన్ని సమాజం మీద నెలకొల్పి తమ ఆధ్వర్యంలోనే అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయన్న విశ్వాసం, భయం, బెదిరింపు తమ పునాది ప్రజలలోనూ ఇతర వర్గాలలోనూ కల్పించి తమ ప్రశాసనాన్ని క్రమంగా విస్తరించాలన్నది సాయుధ పోరాట కమ్యూనిస్టు పార్టీల వ్యూహం.**పునర్నిర్మాణం తరువాతి సంగతి. ఈ వ్యూహంలో ఒకే ఒక సత్యానికి చోటుంటుంది. దానిపేరు అధికారం, 'పవర్'. అది స్వభావరీత్యానే సంపూర్ణ సత్యం. సందేహాలకూ సంవాదానికీ అతీతమైన సత్యం. అది బలప్రయోగంతోనే అమలవుతుంది.

కాని సమాజ పురోగమనంలో బలప్రయోగంతో అమలయ్యే సంపూర్ణ సత్యాల పాత్ర పాక్షికమే. సంవాదం ద్వారా ఎదగవలసిన పాక్షిక సత్యాల పాత్ర చాలా ఉంది. ఇంకొక రకంగా చెప్పాలంటే బలప్రయోగంతో పరిష్కారమయ్యే సమస్యలు కొన్నే. ఒక క్రూరుడైన పెత్తందారు

ఎన్నాళ్ళయినా తన అణచివేత సాగించుకుంటూ చట్టాన్ని తనకు లోబర్చుకొని దానివేటు తప్పించుకుంటూ ఉంటే అతని ఆధిపత్యాన్ని బలప్రయోగంతో – లేక బలప్రయోగం చేస్తామన్న హెచ్చరికతో-పరిష్కారం చేయడం తప్ప గత్యంతరం లేకపోవచ్చు. కాని వికారాబాద్ ఎం.ఎల్.ఏ.కీ విలేఖరులకూ మధ్య తలెత్తిన వివాదానికీ ఇదే పరిష్కారం, ఒక సహకార సంఘంలో తలెత్తిన వివాదానికీ ఇదే పరిష్కారం, పాలిపంచాయితీలకూ ఇదే పరిష్కారం, ఇరుగు పొరుగుల కొట్లాటలకూ ఇదే పరిష్కారం, సామాజిక సమస్యలకూ ఇదే పరిష్కారం, ఏ కారణంగానైనా ఇన్‌ఫార్మర్‌గా మారిన వ్యక్తిని దారిలో పెట్టడానికి-లేక అడ్డం తొలగించడానికి – ఇదే పరిష్కారం, ప్రజలు తెలిసో తెలియకో అన్నల రాజకీయాలకు అడ్డం తగిలినా పాలక రాజకీయాలవైపు మొగ్గు చూపినా వారిని 'చక్కదిద్దడానికీ' ఇదే పరిష్కారం, అసలు ఏ సమస్య లేకపోయినా తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం అనేదే సమస్య అయినా దానికీ ఇదే పరిష్కారం-ఇది పరిష్కారం కాని సమస్య ఏదీ లేదు తెలంగాణలో. అన్నలు తమ ఆధిపత్యం కోసం చేసే బలప్రయోగానికయితే సంజాయిషీ కూడ చెప్పుకోరు. తమ ఉద్యమానికి అడ్డం వచ్చినవారిని బలప్రయోగంతో అడ్డం తొలగించుకోవడం తమ హక్కుగా భావిస్తారు. అక్కడ న్యాయాన్ని పెంపొందించడం అనేదానికి తమ రాజకీయ పురోగమనం తప్ప వేరే అర్థమేదీ లేదు కాబట్టి దానికదే జవాబు. కాని ప్రజల మధ్య సమస్యల పరిష్కారంలో కూడ అతిగా బలప్రయోగం ఎందుకు చేస్తారంటే 'బాధితులు కోరుకుంటారు' అని జవాబు చెప్తారు.

అవును, ప్రజలు కోరుకుంటారు. సమస్యలు ఉన్నవారు సత్వర పరిష్కారం కోరుకుంటారు, తమకు అనుకూలమైన పరిష్కారం కోరుకుంటారు తప్ప తమ సమస్య పరిష్కారం సమాజ పురోగమనంలో భాగంగా జరగాలని కోరుకోరు. (అందుకే 'న్యాయం జరగాలి' అనే బదులు'నాకు న్యాయం జరగాలి' అనే విచిత్రమైన ప్రయోగం వాడుకలోకి వచ్చింది. తప్పుడు భాష ఎక్కడున్నా దాని వెనక తప్పుడు క్రియ ఏదో ఒకటి ఉంటుంది.) సమస్య స్వభావాన్ని బట్టి ఈ తొందరను మనం క్షమించనూ వచ్చు, స్వార్థపూరితమైన దృష్టిమాంద్యమని నిందించనూ వచ్చు. కాని సమస్య పరిష్కారం సమాజ పురోగమనంలో భాగంగా జరిగేటట్టయితే న్యాయం జరగాలి, అది న్యాయంగా జరగాలి (ఇవి రెండూ ఒకటి కాదు), సమాజంలో న్యాయాన్ని పెంపొందించే పద్ధతిలో జరగాలి. అధికార ప్రదర్శన ముఖ్యమైన చోట ఈ స్పృహ ఉండదు. పరిష్కారం చేసేవారి బలం నిలదొక్కుకోవాలి, పెరగాలి. అది ముఖ్యం. అందుకే బలమున్నవారిని ఆశ్రయించడం ద్వారానే సమస్యలు వేగంగా-మనకు అనుకూలంగా- పరిష్కారం అవుతాయన్న ఆలోచనను చరిత్రలో అన్ని పెత్తందారీ వ్యవస్థలూ మనుష్యులలో పెంచాయి. దానివల్ల వాటి పెత్తనం పెరుగుతుంది, మన అవసరాలు తీరతాయి. ఒక ఇంట్లో కొట్టుకుంటున్న పిల్లలు తండ్రికి ఫిర్యాదు చేస్తే కొట్టి పరిష్కారం చేస్తాడని-ఎవరు ముందు పోతే వారికి అనుకూలంగా పరిష్కారం చేస్తాడని-నమ్ముతారు. తండ్రులందరూ బలప్రయోగం మీద నమ్మకం ఉన్నవాళ్ళు కాకపోవచ్చు, న్యాయాన్యాయ విచక్షణ లేనివారు కాకపోవచ్చు. అయినప్పటికీ ఆ నమ్మకం తండ్రుల పెత్తనానికి చాలా ఉపయోగపడుతుంది కాబట్టి అది సజీవంగానే ఉంటుంది. పోషించబడుతుంది. అన్ని పెత్తందారీ వ్యవస్థలూ అంతే. మనం ఆశ్రయించే పెత్తందారు-

పెత్తందారీ వ్యవస్థ -ఏ కారణంగానైనా (అది మంచి కారణం కావచ్చు, చెడ్డ కారణం కావచ్చు) సమస్యకు సత్వర పరిష్కారం ఈయకపోయినా లేక 'మనకు న్యాయం' చేయకపోయినా ప్రత్యామ్నాయ పెత్తందారును ఆశ్రయిస్తాము. పెత్తనం కోసం పోటీపడేవాళ్ళకు (వ్యక్తులు కావొచ్చు, వర్గాలు కావొచ్చు, సంస్థలు కావొచ్చు) ఈ పరిస్థితి చాలా ఉపయోగ పడుతుంది. పెత్తనం కోసం అటు భూస్వామ్య వర్గంతోనూ, ఇటు రాజ్యాంగ యంత్రంతోనూ పోటీలో ఉన్న నక్సలైట్ పార్టీలు ఈ సంస్కృతిని ప్రోత్సహించడంలో అందుకే ఇతర ఆధిపత్య శక్తులను అనుకరిస్తున్నాయి. దీనివల్ల ఎప్పుడూ అన్యాయమే జరుగుతుందని కాదు. అసలు విషయం అది కాదు.

ఎన్ని ఆందోళనలు చేసినా ఈ మేనేజ్‌మెంట్ వినదు. లేబర్ డిపార్ట్‌మెంట్ లంచాలు మేసి వారి పక్షానే ఉంటుంది. లేదా కంపెనీ స్థితిగతుల దృష్ట్యా సాధ్యం కాదంటుంది. లీగల్ యూనియన్లు యాజమాన్యం జేబు సంస్థలుగా వ్యవహరిస్తాయి. లేదా ఈనాటి కోరికలకూ రేపటి అవసరాలకూ సమతుల్యం పాటించాలని వెనక్కి లాగుతాయి. ఇంకా గొడవ చేస్తే పోలీసులు తంతారు.

ఎవరితో చెప్పించినా పక్కపొలం ఆసామి నీళ్ళు వదలడు. కోర్టుకుపోతే అందరికీ అన్ని అవకాశాలూ అనంతంగా ఇవ్వాలనే బూర్జువా సివిల్ చట్టంలో ఎప్పటికీ పరిష్కారం దొరకదు. దొరికినా అతని హక్కే ప్రధానమని నిర్ణయించి కోర్టుతీర్పు అతనికే అనుకూలించవచ్చు.

ఎన్నిసార్లు నచ్చచెప్పినా అల్లుడు బిడ్డను పండుగకూ పబ్బానికీ ఇంటికి పంపించడు. కులపెద్దలకు చెప్తే వాడికి నెమ్మదిగా నచ్చజెప్పుదామంటారు. అది ఇప్పట్లో అయ్యేపనికాదు. పైగా 'నువ్వే బిడ్డను అల్లుడికి దూరం చేస్తున్నావు కాబట్టి అల్లుడు పంపించడం లేదేమో' అన్న సందేహం కూడ లేవదీస్తున్నారు.

పత్రికలలో ఎన్నిసార్లు రాయించినా ఆకతాయి వీధి రౌడీల బెడద పోలీసులు పట్టించు కోరు. పెద్దమనుషులను సంప్రదిస్తే విలువల పతనాన్ని అరికట్టాలంటారు. 'నీ కొడుకు రౌడీ అయినప్పుడు నువ్వేమైనా చేయగలిగావా ఆలోచించ'మంటారు. ఈ సంవాదం ఎప్పటికి పరిష్కారమిచ్చేనో తెలీదు.

ఒక హక్కు మనం కోరుకోవాలంటే దానికి చట్టంలోనైనా సంప్రదాయంలోనైనా గుర్తింపు ఉండాలి. రెండింటిలోనూ లేని హక్కు మనకు కావాలంటే రెండింటినీ గుర్తించని వారి అండ కావాలి. (ఆ హక్కు ఇప్పటికున్న చట్టాన్నీ సంప్రదాయాన్నీ దాటిపోయేది కావచ్చు. ఏ చట్టమూ ఏ సంప్రదాయమూ ఒప్పుకోజాలనిది కావచ్చు.)

ఇటువంటి సమస్య ఏదైనా నక్సలైట్ల దగ్గరకు తీసుకుపోతే వాళ్ళు బెదిరించి - లేక తన్ని, కాళ్ళు విరగ్గొట్టి, చంపి-పరిష్కారం చేసేస్తారు కదా అన్న ఆలోచన (మంచికైనా చెడుకైనా) రావడం సహజం.దానిని ఎం-ఎల్ పార్టీలు నిర్విచక్షణగా ప్రోత్సహించడమే ఆక్షేప ణీయమైన విషయం. దీని అర్థం ఏ సమస్య వారి దగ్గరికొచ్చినా వెనకాముందు ఆలోచించకుండ మీదపడి తన్ని పరిష్కారం చేస్తారనీ, తమను మొదట ఆశ్రయించిన వారికే 'న్యాయం'

చేస్తారనీ కాదు. అట్లా జరిగిన సంఘటనలూ చాలా ఉన్నాయి. అందుకు విరుద్ధంగా జరిగినవీ ఉన్నాయి. ఎవ్వరూ ఇప్పటిదాకా నక్సలైట్ల పరిష్కారాల మీద అధ్యయనమేదీ చేయకున్నా, అందుకు విరుద్ధంగా జరిగినవే ఎక్కువ ఉండి ఉంటాయని భావించడానికి నాకు అభ్యంతరమేమీ లేదు.

కానీ పరిష్కారం ఏ విధంగా చేసినా, అది ఏరకమైన సమస్య అయినా, దాని చివర బలప్రయోగం అనే అస్త్రం బెదిరింపుగా వేళ్ళాడుతూ ఉంటుంది. మనం ఏం చెప్పినా ఎంత వివరించినా చివరకు వాళ్ళ అభిప్రాయాన్ని మన్నించకపోతే దెబ్బలు తప్పవన్న భయం ఉంటుంది. అందులోనూ మామూలు దెబ్బలు కావు. చంపదలచుకోనప్పుడు మోకాలికి దిగువ ఎముకలు రెండు కాళ్ళవీ ఇనపరాళ్ళతో విరగ్గొట్టి శాశ్వతంగా అవిటివాడిని చేయడం అన్నలకు ప్రియమైన శిక్ష.

హింస పరిమాణం గురించి విభేదం ఉన్నా కొంత భయం ఉండడం కొన్నిరకాల సమస్యల పరిష్కారానికి అవసరం, అనివార్యం కావచ్చు. అసలే హింస జరగకుండ అన్నివేళలా న్యాయం జరగాలని చెప్పగల స్థితిలో-దురదృష్టవశాత్తు - సమాజం లేదు. కానీ ఏ సమస్యను బలప్రయోగంతో పరిష్కారం చేయవచ్చు, ఏది చేయకూడదు అన్న విచక్షణ ఎం-ఎల్ పార్టీలకు శూన్యం. నాయకత్వంలో ఉందిగానీ కార్యకర్తలలోనే లేదని మనరాష్ట్రంలో చాలామంది మేధావులు నమ్ముతున్నారు. కానీ నాయకత్వంలో నిజంగా ఉంటే కార్యకర్తలలో ఒక నాటికయినా కనిపించాలి. లేదంటే ఇట్లా సర్దిచెప్పుకోవడం వాళ్ళకు బాగుందనుకోవాలి. అయితే వారి విచక్షణా రాహిత్యం కాకతాళీయం కాదు. అది వారి వ్యూహంతో ముడిపడి ఉంది. (దీని అర్థం ఆ విచక్షణ అసలే అసాధ్యమని కాదు. పట్టింపు ఉంటే ఆ వ్యూహంలో కూడ కొంతవరకు సాధ్యమే.) ఎం-ఎల్ పార్టీల వ్యూహానికి కావలసింది వారి మాట అంటే సమాజంలో 'ఖదర్' ఉండడం, పెరగడం. అన్నలంటే 'భయం' లేకుండా పోతే ఆ వ్యూహం దెబ్బతింటుంది. ఇది మూలసూత్రంగా నడిపించే ఆలోచనకు ఏ సమస్యను బలప్రయోగంతో పరిష్కరించవచ్చు, ఏది కూడదు అన్న విచక్షణ సులభంగా తోచదు. ఆ విచక్షణ కేవలం తాత్కాలిక పరిస్థితులకు సంబంధించిన విషయంగా ఉండిపోతుంది. ఫలాన కోవకు చెందిన సమస్యను నక్సలైట్లు బలప్రయోగంతో పరిష్కరించే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు, చేయరు అంటూ ఒక్క ఉదాహరణ కూడ ఇవ్వలేము. అప్పటి బాధ్యుడు అప్పటి పరిస్థితిలో బలప్రయోగం చేయొద్దులెమ్మని వదిలిపెట్టిన ఘటనలు చాలానే ఉండవచ్చుగాక. ఆ పార్టీల నిర్మాణంలో పైస్థాయికి పోయేకొద్దీ ఈ విచక్షణ ఉన్న వాళ్ళ సంఖ్య కొంత పెరుగుతుంది, కిందిస్థాయికొచ్చే కొద్దీ కొంత తగ్గుతుంది. కానీ తప్పంతా గ్రామీణ మిలిటెంట్ల పైననే పెట్టి, 'పార్టీ మంచిదే, మిలిటెంట్లదే పొరబాటు' అని తప్పించుకోవడం వీరికి అలవాటయిపోయింది. కాని బలప్రయోగం విషయంలో విచక్షణారాహిత్యం వారికి వ్యూహాత్మకంగా సహజమైన ('అనివార్యం' కాకపోవచ్చు) వైఖరి కాబట్టి ఒకవేళ నాయకత్వంలో విచక్షణ ఉన్నా అది లేని కార్యకర్తలను సవరించే ప్రయత్నంగానీ విచక్షణ కలిగించే శిక్షణ ఇచ్చే ప్రయత్నంగానీ చేస్తున్న దాఖలాలు లేవు. పార్టీ అంటే పార్టీ అనుయాయులలో అభిమానం ఉంటే చాలదు. పార్టీ

మాట జవదాటడమంటే సమాజంలో మొత్తంగానే (అనుయాయులతో సహా) భయం ఉండాలి. అప్పుడే అనుయాయులు గట్టిగా (తమ భయంవల్లనే కాదు, తమ అభిమానం వల్ల కూడ, అంతకుమించి ఇతరుల భయం వల్ల కూడ) పార్టీతో ఉంటారు. ఇతరులు కూడ పార్టీ పెత్తనానికి లోబడి ఉంటారు. సమాజంపైన ఈ రకమైన ఆధిపత్యం నెలకొల్పడం వ్యూహాత్మకంగా కేంద్ర విషయమైన ఉద్యమాలు సమస్యల పరిష్కారానికి బలప్రయోగం ఎప్పుడు ఉపయోగించవచ్చుననే విషయంలో తక్షణ పరిష్కారమొక్కటే కాక, న్యాయాన్ని కాంక్షించే సంస్కృతినీ న్యాయబద్ధమైన ఆలోచనా సరళినీ సమాజంలో పెంపొందించవలసిన ఆవశ్యకతను ఒక ప్రమాణంగా పెట్టుకోవడం కష్టం. ఒకప్పుడు ఈ పట్టింపు కొంత ఉండిందేమోగానీ ఆయుధబలం పెంచుకొని, దానికి అతికే దృక్పథం పెంచుకొని ఒకరిని చూసి ఒకరు (పీపుల్స్ వార్‌ను చూసి అందరూ) నేర్చుకొని పురోగమిస్తున్న (బలంలోనూ ప్రాముఖ్యంలోనూ పురోగమిస్తున్నారనడానికి సందేహించ నక్కరలేదు) క్రమంలో అది బాగా తగ్గిపోయింది. సమస్యల పరిష్కారంలో చేయగల న్యాయం చేస్తుంటారు. (అవినీతి, ఆశ్రిత పక్షపాతం లేవని కాదు - ఆ విషయం దిగువ చూద్దాం. కానీ అదివేరే విషయం.) కానీ మొత్తమంతా ఆధిక్యతా వ్యూహంలో భాగంగానే, తమ మాట అంటే 'ఖదర్' ఉండాలన్న ప్రధాన రాజకీయ అవసరంలో భాగంగానే.

## 3

ఆధిక్యతా రాజకీయాలు ఎక్కడున్నా అక్కడ అవకాశవాదం కూడ ఉంటుంది. ఆ రాజకీయాల అవకాశవాదం మాత్రమే కాదు. అది సమాజంలో పెంపొందించే అవకాశవాదం కూడ ఉంటుంది. ఇది తెలంగాణలో వెగటు పుట్టించే మోతాదులో ఉంది. ఇంతా చేసి వికారాబాద్ ఎం.ఎల్.ఏ. చంద్రశేఖర్ తన తప్పు ఎందుకు 'ఒప్పేసుకున్నాడు'? నిజంగానే పీపుల్స్‌వార్ వాళ్ళు తనను కొడతారని భయపడ్డాడా? అయి ఉండదు. అది అన్నల దృష్టిలో అంత మరీ సీరియస్ విషయం కాదు. అయినా ఒప్పేసుకున్నాడంటే కారణం 'అన్నల మాట విన్నాడు' అన్న 'మంచి పేరు' పొందడం కోసమే. ఆ విధేయత వల్ల చాలా ప్రయోజనా లుండగలవు. ఉదాహరణకు రేపెప్పుడైనా ఇంతకంటే సీరియస్ విషయం జరిగితే 'ఆ రోజు మీరు చెప్పిన వెంటనే ఒప్పుకోలేదా' అన్న నిష్ఠూరం క్షమాపణ కోరుకోవడానికి పనికొస్తుంది. ఆయన నియోజకవర్గంలో కొంతకాలం బలంగా ఉండిన పీపుల్స్‌వార్ ఒక ఎన్‌కౌంటర్ ఫలితంగా ఆ తరువాత నామమాత్రంగా కూడ లేకుండా పోయింది. కాని రేపు మళ్ళీ బలం పుంజుకోవచ్చు. అక్కడ రెడ్డి భూస్వాముల పెత్తనం చాలా బలంగా ఉంది కాబట్టి ఉద్యమకారుల ప్రవేశం చాలా అవసరం కూడ. ఆ రోజు మళ్ళీ వస్తే 'చంద్రశేఖర్ అన్నల పట్ల విధేయత ప్రదర్శించాడు' అనేది అతనికి ఉపయోగపడుతుంది. అతను అందుకోసం విధేయత ప్రదర్శించాడని పీపుల్స్‌వార్‌కు తెలుసు. అయినా వారి ఆధిపత్య రాజకీయ వ్యూహంలో దానికి కూడ చోటు ఉంది కాబట్టి దానిని ఆహ్వానిస్తారు. ఇష్టం కొద్దీ అనుయాయులు కాలేనివారు భయంకొద్దీ లొంగిపడి ఉన్నా, అవకాశవాద ప్రయోజనాలకోసం విధేయులయి ఉన్నా అది వారి వ్యూహాత్మక బలాన్ని పెంచే విషయమే. విధేయత ప్రదర్శించేవారు దానివల్ల కొన్ని

ప్రయోజనాలు పొందుతుండవచ్చునని కూడ అన్నలకు తెలుసును. అది 'పార్ట్ ఆఫ్ ది గేమ్'. ఆధిపత్య రాజకీయ క్రీడలో అదికూడ భాగమే. అది మితిమీరిపోయిన రోజు అన్నలే అతనిని 'ప్రజాద్రోహి' అని ఖతం చేస్తారు, లేదా కాళ్ళు చేతులు విరగ్గొడతారు, లేదా రాజకీయంగా తొక్కేస్తారు. అది వారికీ తెలుసు, వీరికీ తెలుసు, ప్రజలకూ తెలుసు. అంతవరకు మాత్రం ఈ కేళి సాగుతూనే ఉంటుంది.

ఈ ఆధిపత్య రాజకీయ కేళిలో చెప్పుకోవలసిన విషయం దానిలోని ఒక్కొక్క ఘట్టం నక్సలైట్ల అనుయాయులైన మధ్యతరగతి జీవుల కళ్ళలో చిందించే తళుకులు. పీడితులు తిరగబడి ఒక క్రూరుడైన భూస్వామిని చంపినపుడు సంతోషించే మానసిక స్థితితో దీనిని పోల్చి తప్పించుకునే ప్రయత్నం చేస్తారేమో. కాని ఇవి పోల్చదగ్గవి కావు. నక్సలైట్ల భయం కేవలం క్రూరులయిన భూస్వాముల మీదకాదు, మొత్తంగా సమాజం మీద పనిచేస్తుంది. అది పీడన నుండి పుట్టిన తిరుగుబాటు పీడితులలో కలిగించే భయం కాదు. అది వ్యూహాత్మక ఆధిపత్య రాజకీయం తన దారిలో ఎదురయ్యే వారందరిలోనూ కలిగించే భయం. ఆ రాజకీయం సామాజిక పునాది ఎక్కువగా పేదలలోనే ఉండవచ్చుగాక, దానిని ఆరాధించే మానసికస్థితి పీడనను ద్వేషించేది మాత్రమే కాదు. ఆధిపత్యాన్ని ఆరాధించేది కూడ. అందుకే ఈ రోజు రాష్ట్రంలో ప్రజాతంత్ర వాదులుగా చలామణి అవుతున్న విప్లవ కమ్యూనిస్టు రాజకీయ అభిమానులైన బుద్ధిజీవులలో ఎంతమందిని నిజంగా ప్రజాతంత్ర వాదులుగా గుర్తించాలో, ఎంతమందిని అధికారిక ఆధిపత్యానికి *(ఏ కారణంగానయితేనేం)* దగ్గర కాలేక ప్రత్యామ్నాయ ఆధిపత్యాన్ని ఆశ్రయిస్తున్న వ్యక్తులుగా–స్వభావరీత్యా మౌలికంగా అధికారాన్ని ఆరాధించే వ్యక్తులుగా–గుర్తించాలో తెలీదు. బహుశా ఎక్కువ మందిలో రెండు గుణాలూ కలిసి ఉన్నాయనుకుంటాను. అన్నల చేతిలో ఎ.కె.-47ల సంఖ్య పెరిగే కొద్దీ వారి అభిమానులలో రెండవ గుణం ఎక్కువ ఉన్నవారి సంఖ్య పెరుగుతూ ఉంది.

రెండువైపులా అవకాశవాదాన్ని పెంచే ఈ విప్లవ ఆధిపత్య రాజకీయాలు తెలంగాణలో వెగటు పుట్టించే వాతావరణాన్ని కలిగిస్తున్నాయన్నాను. ఇందుర్తి (హుస్నాబాద్) ఎం.ఎల్.ఏ. దేశిని చినమల్లయ్య ఎన్నికల ప్రచార జీపును **1994** అసెంబ్లీ ఎన్నికలప్పుడు పీపుల్స్‌వార్ వాళ్ళు తగలబెట్టారు. చినమల్లయ్య కూడ ఒక కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ.) నాయకుడే. నిరాడంబరుడిగా, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా ఆయనకు అంతో ఇంతో మంచి పేరు ఉంది. అయినప్పటికీ తన జీపును కాలబెట్టినప్పుడతను నిరసన తెలపడు. 'మీ రాజకీయాలు మీకు ఉన్నట్లే నా రాజకీయాలు నాకు ఉన్నాయి. నా జీపు కాలబెట్టడానికి మీరెవ్వరు' అనడు. 'ఎం.ఎల్.ఏ.గా నేను ప్రజలకు ఏం ద్రోహం చేసానో చెప్పండి' అని నిలదీయడు. 'అన్నలకు నేనంటే ప్రత్యేకమైన కోపమేమీ లేదు. వాళ్ళు ఎవరి జీపునైనా కాలబెడుదురు. నా జీపు కూడ కాలబెట్టారు. అంతే తప్ప నా జీపని కాలబెట్టలేదు' అని తానే వివరణ ఇస్తాడు. తన మీద వారికి ప్రత్యేకమైన కోపమేమీ లేదని తాను నమ్ముతున్నట్లు వారికి తెలియజేయడం తనకే మంచిదని ఆయన భావిస్తాడు. చాలామంది రాజకీయవేత్తల కంటే మెరుగైన విలువలు గల చినమల్లయ్య (సి.పి.ఐ. రాష్ట్రనాయకత్వానికి పువ్వాడ నాగేశ్వరరావు

కనిపించినంత అందంగా ఆయన కనిపించనప్పటికీ) తనను తాను ఇంతగా కించపరచుకుంటాడు. ఆయన మనసులో లేని ఆత్మన్యూనత ప్రదర్శిస్తున్నాడని తెలిసి కూడ అన్నలు అతని విధేయతకు సంతోషిస్తారు. విధేయతలో ఉండేదీ కోరుకునేదీ అవకాశవాదమే కదా.

కడియం శ్రీహరి (రాష్ట్ర ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమ మంత్రి)ని పీపుల్స్‌వార్ వరంగల్ జిల్లాలోకి అడుగుపెట్టవద్దని శాసించిన సంగతి తెలిసిందే. అతని అనుచరులయిన (ఎక్కువగా దళిత కులాలకు చెందిన) ప్రజాప్రతినిధులను ఇన్‌ఫార్మర్లు అని ప్రకటించారు, బెదిరించారు. వరంగల్‌లో జరిగే ఎన్‌కౌంటర్‌లకు శ్రీహరి బాధ్యుడని అన్నారు. శ్రీహరి నిజంగా అంతటి దుర్మార్గుడా అన్న విషయం పక్కన పెడదాం. శ్రీహరి కంటే ప్రత్యక్షంగా అవినీతిపరులనీ నేరచరితులనీ పేరున్న తెలుగుదేశం నాయకులకు లేని ఆంక్షలు, హోంమంత్రిపైన సహితం లేని వ్యతిరేకత, శ్రీహరిపైన ఎందుకు అన్న ప్రశ్నకు ఇప్పటిదాకా జవాబు లేదన్న విషయం కూడ పక్కన పెడదాం. గత సంవత్సరం వరంగల్‌లో ఎ.ఐ.పి.ఆర్.ఎఫ్. ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్య తెలంగాణా' సదస్సు జరిగినపుడు సదస్సుకు పోలీసులు ఆటంకాలు పెట్టకుండా చూడాలని శ్రీహరి పైననే ఒత్తిడి పెట్టారు. తమ బెదిరింపు కారణంగా అతని రాజకీయ మనుగడే ప్రశ్నార్థకం అయ్యింది కాబట్టి తన అవసరాలకోసం ఆ పని చెయ్యక చస్తాడా అని వారి ఆలోచన. అతను హోంమంత్రి అయి ఉంటే, అతను మంచివాడనుకున్నా కాదనుకున్నా అతనినే అడగక తప్పదు. కాని అతను సాంఘిక సంక్షేమ మంత్రి. అన్నల పట్ల విధేయత ప్రదర్శించడం అతనికి అవసరం కాబట్టి వారి పని చేయాలే తప్ప అది అతని విధులలో భాగం కాదు. 'నేను ప్రజాద్రోహినైనప్పుడు నా సహాయం మీ కెందుకు' అని అతను ఆత్మగౌరవం కాపాడుకునే ప్రయత్నం చేయడు. తెలుగుదేశం రాజకీయాలలో ఉన్న వ్యక్తి తన ఆత్మగౌరవానికి అంత ప్రాముఖ్యం ఇవ్వడని వారికి తెలుసు. దానికంటే వారి అవసరం తీర్చి వారికి మంచివాడు కావడమే ఉచితమని అతను భావిస్తాడని వారికి తెలుసు. ఈ అవకాశవాదమే అన్నలకు కావలసింది. వాళ్ళ పని అయిపోయింది. శ్రీహరికి ఫలం దక్కేనో లేదో చూడాలి.

ఇద్దరు పెద్దవాళ్ళ ఉదాహరణలు మాత్రమే ఇచ్చానని అనుకోనక్కరలేదు. పైనుండి కిందిదాకా అనేక ఉదాహరణలు ఇయ్యవచ్చును. పిల్లినైనా ఒక మూలకు నెడితే తిరగబడుతుందని మామూలుగా అంటుంటారు. (విప్లవ మేధావులే ఎక్కువగా అంటుంటారు. హింసకు ప్రతి హింస అనివార్యం అని చెప్పడానికి.) కాని అన్నల రాజ్యంలో ఆ సత్యం చెల్లదు. దొరతనాన్ని ప్రశ్నించడానికీ దొరతనానికి వ్యతిరేకంగా తిరగబడడానికీ తెలంగాణ ప్రజకు వెన్నెముక నిచ్చిన ఈ పార్టీలు ఇప్పుడు తెలంగాణను తమకు పాదాక్రాంతం చేసుకున్నాయి. వీరికి వ్యతిరేకంగా ఎవరూ తమ హక్కుల గురించి, ఆత్మగౌరవం గురించి మాట్లాడరు. ఏదో ఒకలాగ వీరిని మంచి చేసుకొని అడ్జెస్టయి బ్రతకడం ఉత్తమం అనే అవకాశవాదాన్ని అందరూ అలవరచుకున్నారు. కొందరు భయం వల్లనైతే కొందరు తమలోని బలహీనతల వలన, ఏదో ప్రయోజనం పొందుదామన్న ఆలోచన వలన, అలవర్చుకున్నారు. మన సమాజంలో విలువలు పూర్తిగా పతనం అయి ఉండడం నక్సలైట్ పార్టీల విప్లవ దాదాగిరీకి బాగా ఉపయోగపడింది. ఒకవైపు వ్యవస్థను 'కూకటివేళ్ళతో పెకిలించి వేయాలి' (అదొక వృక్ష విశేషం అయినట్టు) అన్న

అభిప్రాయం బాగా ప్రాచుర్యం పొందడం వారి రాజకీయాలకు ఉపయోగపడగా మరో వైపు నైతిక పతనం వల్ల పెరిగిన ఆత్మన్యూనత, అవకాశవాదాలు వారి దాదాగిరీకి చాలా ఉపయోగపడ్డాయి. ఏదో ఒక బలహీనత లేని వారు ఈరోజు అరుదు. ఆ బలహీనతవల్ల వారు తమ ఆత్మగౌరవాన్ని గురించి గానీ హక్కుల గురించి గానీ విప్లవకారుల ఎదుట గట్టిగా మాట్లాడరు. వాళ్ళ బలహీనతలను ఆసరా చేసుకొని వారిపైన పెత్తనం చేయడం అన్నలకు సులభం. ఆ వ్యక్తులు కూడ-తమ బలహీనతల వల్లనే- హక్కులకోసం నిలబడే బదులు నక్సలైట్ పెత్తనానికి తల ఒగ్గి దానినుండి రాగల ప్రయోజనం పొందుదామని భావిస్తారు. వీరికా సంగతి తెలిసి వారిని వాడుకుంటారు. ఈ బాపతు మనుషులు తెలంగాణ నిండా కనిపిస్తారు. (వారి మాట తీరును బట్టి, నడవడికను బట్టి సులభంగానే గుర్తుపట్టవచ్చు.) ఇంక కేవలం భయం వల్ల నోరుమూసుకొని పడి ఉండేవారు చాలామందే ఉన్నారు. వీళ్ళను కూడా సులభంగానే గుర్తుపట్టవచ్చు. వీళ్ళ పట్ల కొంత సానుభూతి కూడ చూపించవచ్చు.

నక్సలైట్ పార్టీల కార్యకర్తలకు షెల్టర్ ఇచ్చి, చందాలు ఇచ్చి, ఆయుధాలు సరఫరా చేసి, దళాల యూనిఫారాలు కుట్టిచ్చి, ప్రయాణాలకు కార్లు ఏర్పాటు చేసి, తమ భూములు బీడు పడకుండా కాపాడుకున్న భూస్వాములు, తమ సారాయి వ్యాపారం (ప్రభుత్వ నిషేధం కంటే ముందు నుండి ఉన్న అన్నల నిషేధ కాలంలో కూడ) కాపాడుకున్న వ్యాపారస్థులు చాలా మందే ఉన్నారు. ఏదో ఒక రోజు ఈ సంబంధాన్ని గురించి మరీ ఎక్కువగా ప్రజలు మాట్లాడు కుంటున్నారనో లేక ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా ఒక సారాయి దుకాణం పేల్చవలసి వచ్చిందనో లేదా ఒక పాలక పార్టీ నాయకుడు ఇంటిపైననో, వ్యక్తిపైననో దాడి చేయవలసి వచ్చిందనో అనుకున్నప్పుడు అన్నలు వీరిపైన దాడి చేస్తారు, చంపుతారు, కొడతారు, దుకాణం పేల్చేస్తారు, భూములు బీడు పెట్టిస్తారు. వాళ్ళకు ఏదో ఒక పేరు పెడతారు-ప్రభుత్వ ఏజెంట్ అనో పోలీస్ ఇన్ఫార్మర్ అనో ప్రజాద్రోహి అనో. ఇన్నాళ్ళూ మమ్మల్ని వాడుకున్నప్పుడు ఆ సంగతి తెలియలేదా అని వారు ఎదురు తిరగరు. ఎదురు తిరగరనీ, అంత స్వాభిమానం వారిలో లేదనీ అన్నలకు తెలుసు. అదే వారి బలం. వరంగల్ జిల్లాలో సారావ్యాపారి - మరియు-తెలుగుదేశం నాయకుడు బస్వారెడ్డి దీనికి ఒక ఉదాహరణ. తెలంగాణలో ప్రతి జిల్లాలో ప్రతి ప్రాంతంలో ఇటువంటివాళ్ళు ఉన్నారు.

ఒక మంచి కమ్యూనిస్టు పార్టీకి పేదలలో పునాది ఉండాలి, మధ్యతరగతికి లేక ధనిక వర్గానికి చెందిన అభ్యుదయవాదులతోను సత్ప్రవర్తనగల వ్యక్తులతోనూ స్నేహ సంబంధా లుండాలి. కాని మన ఎం-ఎల్ పార్టీలకు పేదలలో పునాది అయితే ఉంటుంది గానీ మధ్యతరగతికి చెందిన అభ్యుదయవాదులతోనూ సద్వర్తనులతోనూ వారికుండే అవసరం, ఉపయోగం తక్కువ. అవకాశవాదులతో, లౌక్యం తెలిసిన దొంగలతో ఎక్కువ అవసరం ఉంటుంది, వారితోనే ఎక్కువ సంబంధాలుంటాయి. వాళ్ళయితేనే దళాలకు షెల్టర్ ఇచ్చి తమను తాము పోలీసుల నుండి అవసరమయినప్పుడు కాపాడుకోగలరు, ఏదో ఒక దొంగవ్యాపారం చేసి పెద్దమొత్తంలో చందా ఇవ్వగలరు, తుపాకులు సరఫరా చేయగలరు, కార్లు జీపులు ఇవ్వగలరు. ఈ సహాయక సంబంధాన్ని వాళ్ళు వాడుకొని ఏదో ఒక ప్రయోజనం

పొందుతూనే ఉంటారు. చివరికి దెబ్బలు తినే రోజు వచ్చినపుడు దెబ్బలు తింటారు. 'వెగటు పుట్టించే వాతావరణం' అని నేను ఊరికే అనలేదు. వరంగల్ జిల్లా పాలకుర్తి సమీపంలోని ఈరవెన్నుకు చెందిన భూస్వామి చిత్తరంజన్ రెడ్డిని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇతను పీపుల్స్‌వార్ దళానికి ఆశ్రయమిచ్చి, సహాయసహకారాలు అందించి వాళ్ళు బీడు పెట్టిన భూమిని మళ్ళీ దున్నుకునే అవకాశం పొందాడు. తన రాజకీయ ప్రత్యర్థిని ఇన్‌ఫార్మర్ అని ప్రచారం చేసి గ్రామం నుండి తరిమేశాడు. ఆ తరువాత తానే ఇన్‌ఫార్మర్‌గా మారి ముగ్గురు దళ సభ్యులను ఎన్‌కౌంటర్‌లో చంపించాడు. అతని అనుచరుడైన ఒక బి.సి. కులస్తుడిని అన్నలు పట్టుకొని ఇన్‌ఫార్మర్ అని చంపగలిగారు గాని చిత్తరంజన్‌రెడ్డి మాత్రం తప్పించుకొని తిరుగుతున్నాడు.

'నక్సలైట్‌ల చేతిలో సారా కాంట్రాక్టర్ హత్య' అనీ 'భూస్వామి హత్య' అనీ పేపర్లో వార్తలు వస్తూంటాయి. పోనీలే ఒక 'వర్గ శత్రువు' పోయాడు అని దూరంగా బ్రతికే ఎం-ఎల్ పార్టీల అనుయాయులు సంతృప్తి చెందుతుంటారు. కాని దగ్గర నుండి చూసేవాళ్ళకు చాలా సందేహాలు వస్తూంటాయి. ఈ సారాయి వ్యాపారిని చంపారు కాని ఫలానా వారిని ఎందుకు చంపలేదు? కనీసం వారి వ్యాపారాన్ని ఎందుకు ఆపలేదు? ఈ భూస్వామిని చంపారు కాని ఫలానా భూస్వామిని ఎందుకు చంపలేదు? అసలు సారాయి వ్యాపారి, భూస్వామి అయినంత మాత్రాన చంపడం ఎం-ఎల్ పార్టీల విధానం కాదని అందరికీ తెలుసు. చంపడానికీ, చంపకపోవడానికీ ఏదో ప్రత్యేకమైన కారణం ఉండాలి. కానీ అన్ని సందర్భాలలోనూ ఆ కారణం మృతుల ప్రత్యేకమైన క్రూరత్వంతోనూ, దుర్మార్గంతోనూ ముడిపడిన కారణంగా కనిపించదు. వాడుకోవడం, అవసరం తీరిపోవడం, వాడుకోబడేవాడు అనుమతించిన దానికంటే ఎక్కువ ప్రయోజనం పొందాలని చూడడం, లేదా ఈ అవకాశవాద సంబంధం సమాజంలో ప్రచారం పొందడం, లేదా ప్రభుత్వ నిర్బంధానికో మరొకదానికో నిరసనగా చంపడానికి, లేక దాడి చేయడానికి అతడు తగిన 'సింబల్' గా కనిపించడం మొదలైన అనేక కారణాలు దాగి ఉంటాయి.

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్, కాంగ్రెస్ నాయకుడు 'కడెం' నారాయణరెడ్డిని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. అతను భూమి కబ్జాదారుడు, కలప స్మగ్లర్ (అవినీతిమయమైన అటవీశాఖ సహితం అప్పుడప్పుడు సిగ్గుపడి అతని మీద కేసులు పెడుతుంటుంది.) తన జీతగాడిని హత్యచేసి ఇందన్‌పల్లి దగ్గర రోడ్డుపక్కన పూడ్పించి కేసు కాదు సరికదా, పేపర్లో వార్త సహితం రాకుండా ఆపగలిగాడు. ఈ మధ్య మరొక రైతు కూలి సంఘం (న్యూడెమోక్రసి) కార్యకర్త హత్యకు బాధ్యుడైనాడు. అయినా పీపుల్స్‌వార్ నుండి అతను ఏ రోజూ ఏ సమస్యా ఎదుర్కోలేదు. వాళ్ళతో తనకు మంచి సంబంధాలున్నాయని బాహాటంగానే మాట్లాడుతుంటాడు. విమర్శ మరీ ఎక్కువయ్యేసరికి పీపుల్స్‌వార్ ఈమధ్య అతడి పాడుపడ్డ బంగ్లాను పేల్చేసి తన శత్రుత్వం ప్రకటించింది. మళ్ళీ అదే ప్రాంతంలో ప్రజలలో చాలా మంచి పేరున్న లక్ష్మణచాందా నివాసి టీచర్ చిన్నారెడ్డినీ, ఎవరికీ ప్రత్యేకంగా పెద్దగా ద్రోహం చేయని ఖానాపూర్ సర్పంచ్ విలాసరావు దేశ్‌పాండేనీ పీపుల్స్‌వార్ చంపింది.

అన్నలను ప్రశ్నించలేక, ఎదురు తిరగలేక పడి ఉండే దుర్గతి కేవలం ఎం.ఎల్.ఏ.లదీ, మంత్రులదీ, మధ్యతరగతి అవకాశవాదులదీ కాదు. తమకు వ్యతిరేకంగా మాట్లాడే స్వేచ్ఛ ప్రజలకుందని, నిలదీసే స్వేచ్ఛ సైతం ఉందని విప్లవ కమ్యూనిస్టు పార్టీలు చెప్పుకుంటుంటాయి. పూర్తిగా తమ మనుషులే అయినవారు తమని నిలదీస్తే, అది కూడ స్పాంటేనియస్‌గా అసంఘటితంగా జరిగితే సహించి సమాధానం చెప్పిన ఘటనలూ తమ నడవడికను సవరించు కున్న ఘటనలూ ఉన్నాయి గానీ ఇతర ప్రజలు (భూస్వాములే కానక్కరలేదు) ప్రశ్నించినపుడు, నిలదీసినపుడు సహిస్తారన్న భరోసా లేదు. ప్రశ్నించే జనం రిస్క్ తీసుకో వలసిందే. ప్రశ్నించి తన్నులు తిన్నవారు ఆదిలాబాద్ నుండి విశాఖపట్నం దాకా చాలామందే ఉన్నారు. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలో జనశక్తి తోనూ, పీపుల్స్‌వార్‌తోనూ పలుగ్రామాల ప్రజలు ఈ చేదు అనుభవం రుచి చూసారు.

అంతేకాదు, ప్రశ్నించడాన్నీ విమర్శించడాన్నీ ఎం.ఎల్ పార్టీలు ఒకమేరకు సహిస్తాయేమో గానీ తమకు వ్యతిరేకంగా ప్రజలను, ప్రజాభిప్రాయాన్ని ఆర్గనైజ్ చేసే ప్రయత్నాన్ని మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ సహించవు. అది న్యాయమైన వ్యతిరేకతే అయినా, ఆర్గనైజ్ చేసే వ్యక్తి అట్టడుగు వర్గాలనుండే వచ్చినా కూడ సహించవు. అధికారానికి వ్యతిరేకంగా ప్రజలకు సంఘటితపడే హక్కు ఉందని ఈ పార్టీలూ, వీటి తోడబుట్టిన పౌర ప్రజాస్వామ్య హక్కుల సంఘాలూ తెలుగు ప్రజలకు నేర్పాయి. అదొక విలువయిన కృషి. కాని తమ పార్టీలకు వ్యతిరేకంగా ఆర్గనైజ్ చేసే హక్కును మాత్రం ఈ పార్టీలు సహించవు. దానిగురించి ఏ ప్రజాతంత్ర మేధావీ మాట్లాడడు. వీరికి వ్యతిరేకంగా ఆర్గనైజ్ చేయడమంటే భూస్వాములకు అనుకూలంగా ఆర్గనైజ్ చేయడం అనుకోనక్కరలేదు. లేదా తుపాకులు పట్టుకొని వీళ్ళ మీద తిరగబడడం అని అర్థం చేసుకోనక్కరలేదు. వీళ్ళకు వ్యతిరేకంగా ప్రజలను ప్రజాతంత్ర దృక్పథంతో నయినా సరే కూడగట్టడం, ప్రజలను కూడగట్టి వీళ్ళను నిలదీసి ప్రశ్నించడం, వీళ్ళ తప్పుల గురించి ప్రజలలో ప్రచారం చేయడం-ఇవన్నీ నిషిద్ధ చర్యల క్రిందనే వస్తాయి. ఆ ప్రయత్నం చేసినవారు ప్రజాపోరాటాలకు అడ్డం వచ్చిన వ్యక్తులుగానే ముద్ర భరించవలసి ఉంటుంది. దాడికి గురికావలసి ఉంటుంది. ఎం.ఎల్. పార్టీలు ఏ స్వేచ్ఛనైనా సహిస్తాయేమోగాని తమను వ్యతిరేకించే రాజకీయ స్వేచ్ఛను మాత్రం సహించవు. అందుకే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో నక్సలైట్ రాజకీయాలకు వ్యతిరేకంగా భీకరంగా ఉపన్యాసాలు ఇచ్చే సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం), బిజెపి వంటి పార్టీలు ఉత్తర తెలంగాణ గ్రామాలలో వారికి వ్యతిరేకంగా మాట్లాడవు. ఇచ్చిన హక్కులు తీసుకొని, వారిని నొప్పించే పని చేయకుండ తమ జాగ్రత్తలో బతుకుతుంటాయి. తమవారి నెవరినైనా నక్సలైట్లు హత్యచేస్తే ఒకటీ అరా నిరసన సభలు పెడతారే తప్ప నక్సలైట్లకు వ్యతిరేకంగా ప్రజలను ఆర్గనైజ్ చేసే ప్రయత్నమేమీ చేయరు. చేయకపోగా, 'మా పార్టీ లైన్ మీకు తెలిసిందేకాని మేము మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నాం' అని అడిగిన వారికీ అడగని వారికీ వివరిస్తుంటారు. అయినప్పటికీ అన్నలు కోపగించి పదవికీ పార్టీకీ రాజీనామా చేయమని ఆదేశిస్తే రాజీనామా చేసేసి అంతకంటే సహజం ఏముందన్నట్టు బతుకుతుంటారు.

క్రూరులయిన భూస్వాములపేరిట మొదలు పెట్టిన బలప్రయోగాన్ని రాజకీయ ఆధిపత్యం నెలకొల్పడానికి కూడ వాడుకోవచ్చుననే ఈ వైఖరిని ఎన్నికల రంగానికి సహితం ఎం-ఎల్ పార్టీలు విస్తరించాయి. **1995**లో హైదరాబాద్‌లోని గాంధినగర్ ప్రాంతంలో పోలీసులు దుర్మార్గంగా తరిమి కాల్చిచంపిన ప్రతిఘటన నాయకుడు మధుసూదన్‌రాజు హత్యోదంతం అందరికీ తెలిసిందే. దాని వెనక ఉన్న కథ మాత్రం చాలా మందికి తెలియదు. ఆ పార్టీకి బలం ఉన్నది ప్రధానంగా వరంగల్ జిల్లా ములుగు ఏజెన్సీలో. అక్కడ గోవిందరావుపేట మండల ప్రజాపరిషత్‌లో (ఎన్నికలు జరిగిన) ఎనిమిది ఎంపిటిసి పోస్టులలో మూడు మాత్రమే ఆ పార్టీ గెలిచింది. మిగిలిన ఐదు సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఎం-ఎల్ పార్టీల సిద్ధాంతాల ప్రకారమే తమ ఉమ్మడి వర్గ ప్రయోజనాలు కాపాడుకోవడానికి తమ తేడాలు మర్చిపోయి ఒకటయి మండలాధ్యక్షురాలి సీటు (అది గిరిజన మహిళకు రిజర్వు అయింది) కొట్టేయవలసింది. కాని వర్గ ప్రయోజనాల కంటే తుపాకీ భయం బలమైనది కావడంవల్ల వారిద్దరూ వెనక్కి తగ్గి ప్రతిఘటన అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ వినయానికి కారణం ఊహించడం కష్టం కాదు. తమకు తెలియకుండా జరిగిపోయిన ఈ ఘోరానికి పోలీసులకు చాలా కోపం వచ్చింది. నక్సలైట్లకు తామే అసలు ప్రత్యర్థులైనట్టు చాలా ఏళ్ళుగా వ్యవహరిస్తున్న పోలీసులు దీనిని సవాలుగా తీసుకున్నారు. 'ప్రతిఘటన' పైన నిర్బంధం పెంచారు. ములుగు తాలుకాలో మొదలైన అరెస్టులు, చిత్రహింసల పరంపర హైదరాబాద్ దాకా సాగి ఆ పార్టీ నాయకుడి హత్యతో ముగిసింది. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం కోసం మధుసూదన్ రాజు చేసిన అవిరళ కృషిని అతని కామ్రేడ్లే కాక ప్రజాతంత్ర వాదులందరూ కొనియాడారు. (కొనియాడవలసిందే) కాని అతని చావుకు దారితీసిన విప్లవ దాదాగిరీని గుర్తించడం, విమర్శించడం మాత్రం ఎవరి కర్తవ్యమూ కాలేదు.

గోవిందరావుపేటలో జరిగిన దానిని 'ఏకగ్రీవం చేయించడం' అంటారు. ఇదొక విచిత్రమైన ప్రయోగం (తప్పుడు పనులకు తగినట్లు తప్పుడు భాషా ప్రయోగాలు కూడ పుడతాయి.) ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అంటే అర్థం ఉంది. అన్ని తలలూ చర్చించి ఒకే ఆలోచనకు వచ్చి ఎంపిక చేసుకోవడం అనే అర్థం ఉంది. ఏకగ్రీవం చేయించడం అంటే నిర్ణయం చేసే హక్కును అన్ని తలల నుండి ఒకే తల స్వాధీనం చేసుకోవడం అని అర్థం. పుల్లారెడ్డి గ్రూపుగా ఒకప్పుడు పిలవబడిన పార్టీ, దాని శాఖోపశాఖలు ఈ క్రియలో అనుభవజ్ఞులు. మొదట్లో దీనికొక తర్కం ఉండేది. ఎన్నికల సమయంలో అనవసరమైన స్పర్ధలన్నీ ముందుకు వచ్చి అప్పటివరకు ఐక్యంగా ఉద్యమించిన ప్రజలను చీల్చే ప్రమాదం ఉంది కాబట్టి పార్టీ ప్రాబల్యం ఉన్న గ్రామాలలో (అవసరమైతే అన్ని పార్టీలను సంప్రదించి) 'ఏకగ్రీవం చేయడం' మంచిదని భావించేవారు. సాధారణంగా పార్టీ ప్రతిపాదించిన వ్యక్తే ఎన్నికయ్యేవాడు. ఇందులో తప్పేమీ లేదని ఒకప్పుడు నేను కూడా అనుకున్నాను గానీ నిజానికి ఇది కమ్యూనిస్టులకు ఎన్నికలంటే ఉన్న అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తుంది తప్ప వేరే ఏమీ కాదు. ఎన్ని లోపాలున్నా ప్రజలందరికీ ఒకే దామాషాలో నిర్ణయాధికారం ఇచ్చేది ఎన్నికల వ్యవస్థే. దాని బదులు ఇతర పార్టీల ముఖ్యులతోనూ తమ పార్టీ ముఖ్యులతోనూ మాట్లాడి

ఏకగ్రీవం చేసే పద్ధతి, తమ పర్యవేక్షణ లేకుండ ప్రజలు స్వంతంగా నిర్ణయం తీసుకునే ఏ ప్రక్రియ పట్లనయినా కమ్యూనిస్టులకుండే అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తుంది తప్ప వేరే ఏమీ కాదు.

అదెట్లాగున్నా మొదట్లో ఈ తర్కమైనా ఉండేది. పోను పోను,మా తుపాకులు ఉన్నచోట మేము చెప్పినవారు సర్పంచ్ కావలసిందే (సర్పంచే కాదు సింగిల్ విండో అధ్యక్షులు ఎంపిటిసి వగైరా) అనే దాదాగిరీ దాని స్థానాన్ని ఆక్రమించింది. దాదాగిరీ ఎక్కడుంటే అక్కడ అవకాశవాదం కూడ ముందుకొస్తుంది. అన్నల ఉద్దేశ్యం అర్థమైన వాడెవ్వడో ఒకడు ముందుగానే ఊరి పెద్దలతో మాట్లాడుకొని అన్నల అనుమతి పొంది 'ఏకగ్రీవం' అయిపోతాడు. లేదా కాంగ్రెస్‌వారు, టి.డి.పి. వారు ఎవడో ఒకడ్ని తామే ప్రోత్సహించి గ్రామంలోని అన్నల మనుష్యులతో మాట్లాడించి అతడినే ఏకగ్రీవం చేస్తారు. పోలీసులు-నక్సలైట్ పార్టీల డీఫ్యాక్టో రాజకీయ ప్రత్యర్థులు - ఈ ఏకగ్రీవ ఎన్నికల పట్ల తమ నిరసనను మొదటినుంచి చాలా క్రూరంగా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికైన వారిని తీసుకుపోయి హింసించి రాజీనామా చేయించిన ఘటనలు వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌లలో జరిగాయి. మొదట్లో ఈ ఏకగ్రీవ సర్పంచ్‌లు చిత్రహింసలకు కొన్నాళ్ళు బాగానే తట్టుకున్నారు గానీ పోను పోను (ముఖ్యంగా జనశక్తి ప్రాబల్యం ఉన్న కరీంనగర్‌లో) రెండుసార్లు బెదిరిస్తే రాజీనామా చేసే బాపతు వచ్చారు. పోలీసుల దౌర్జన్యాన్ని వివరణాత్మకంగా ఖండించిన ప్రజాతంత్రవాదులు ఎన్నికల ప్రక్రియతో అన్నలు ఆడుకుంటున్న ఆటలను విమర్శించడం తమ కర్తవ్యం కాదనుకోవడం ఆ పార్టీలకూ ప్రజలకూ ప్రజాతంత్రవాదుల విశ్వసనీయతకూ కూడ చాలా నష్టం చేసింది.

ఎం-ఎల్ పార్టీలు ఏ స్వేచ్ఛనైనా సహిస్తాయి గానీ తమను వ్యతిరేకించే రాజకీయ స్వేచ్ఛను మాత్రం సహించవని అన్నాను. వ్యతిరేకించడమే కాదు, ప్రజలలో ఒక ప్రత్యామ్నాయంగా తయారుకావాలని ప్రయత్నించినా సహించని ఘటనలున్నాయి. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు గ్రామాలలో ఉండవచ్చు. ఆ పార్టీలు పీడిత ప్రజలలో ఎం-ఎల్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలబడడంగానీ వారి వ్యాప్తికి అడ్డం రావడం గానీ జరగదు కాబట్టి. (అయితే పోలీసుల నిర్బంధానికీ ప్రభుత్వ అప్రజాస్వామ్య విధానాలకూ ఈ పార్టీల నాయకులు తరచుగా మూల్యం చెల్లిస్తుంటారు.) సి.పి.ఐ., సి.పి.ఐ(ఎం)లాంటి పార్టీలు ఉన్నా నక్సలైట్లకు వ్యతిరేకంగా ప్రజాసమీకరణ చేయకుండా, వారి వ్యాప్తికి భౌతికంగానే కాదు, రాజకీయ ప్రచారం ద్వారా కూడ అడ్డం రాకుండా బ్రతకాలి. 'నక్సలైట్‌లలో చేరొద్దు' అని కూడ ఎవరినీ నిరుత్సాహ పర్చకూడదు. దానికి కూడ భౌతిక దండనే శిక్ష. అంబేద్కర్ సంఘాలూ, స్వచ్ఛంద సంస్థలూ, ఆదివాసీ సంఘాలూ ఉంటే అవి అన్నలు సంప్రదించమన్నప్పుడు సంప్రదించి, వారు సూచించిన కార్యక్రమాన్ని చేపట్టి, వారికి ఎక్కడా అడ్డం రాకుండ, ముఖ్యంగా వారి మిలిటెంట్లకు, దళాలకు కోపం తెప్పించకుండ నడుచుకోవాలి. కార్యకర్తల సమీకరణలో వారితో పొరపాటున కూడ పోటీకి దిగకూడదు. ఎం-ఎల్ పార్టీలు కూడ పీడిత ప్రజల సమస్యలు చేపడతాయి కాబట్టి కార్యక్రమాల విషయంలో ఈ సంఘాలకూ వారికీ వైరుధ్యం రావలసిన అవసరం అన్ని సందర్భాలలో ఉండదు. అది లేనంతకాలం పరస్పర సహకారంతో పనిచేసుకుంటారు కూడ. కాని ఈ సంఘాలు భిన్నమైన రాజకీయాలను ప్రజలలో

ప్రవేశపెట్టకూడదు. కేవలం కార్యక్రమాలకు పరిమితం అయి పని చెయ్యాలి. అప్పుడే ఈ సహకారం కొనసాగుతుంది. నక్సలైట్‌ల హింసాత్మక చర్యల వల్ల ప్రజలకు వచ్చే నష్టాన్ని గురించి గొడవ పెట్టకూడదు. ప్రజలలో వ్యతిరేక భావం కలిగించేటట్టు ప్రచారం చేయకూడదు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీల సంఘాలు ఈ కారణంగా ఒక దశలో పీపుల్స్‌వార్‌తో గొడవపడ్డాయి. ఇప్పుడు తెలుగుదేశం మంత్రి కడియం శ్రీహరి సమస్య ఎదుర్కొంటున్నాడు. పీడిత ప్రజలలోని ఒక సెక్షన్‌లో (*దళితులలో*) అతను తనకంటూ ఒక రాజకీయ పునాదిని-పీపుల్స్‌వార్‌తో విభేదించే రాజకీయ పునాదిని- ఏర్పరచుకునే ప్రయత్నం చేస్తున్నాడన్న అనుమానమే అతనిపైన అన్నలకు ఉన్న ద్వేషానికి కారణమైనట్టుంది. ఆ ద్వేషానికి జవాబుగా అతను నిజంగానే పనిగట్టుకొని జిల్లాలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ప్రోత్సహించడంతో వారి ద్వేషం మరింత బలపడింది. శ్రీహరికి జ్ఞానోదయం ఎప్పుడవుతుందో చూడాలి.

శ్రీహరిలోనూ అతని తెలుగుదేశం రాజకీయాల్లోనూ లోపాలు లేవని కాదు. ఉన్నాయి. వాటిని చూపించే అతని పట్ల తాము ప్రదర్శిస్తున్న విద్వేష వైఖరిని పీపుల్స్‌వార్ సమర్థించుకుంటున్నది. కాని అటువంటి లోపాలు లేనటువంటి వారిపైన కూడ ఇదే దాదాగిరీని ప్రదర్శించినపుడు అసలు విషయం వారి లోపమా వీరి అసహనమా అన్న సందేహం వస్తుంది. ఏజెన్సీ గిరిజనులలో తమ వ్యాప్తికి అడ్డం వస్తున్నారనే పీపుల్స్‌వార్ తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లో పనిచేస్తున్న 'శక్తి' పైన, విశాఖపట్నంలో పనిచేస్తున్న'సమత' పైన నిషేధం పెట్టింది. ఆ స్వచ్ఛంద సంస్థల పైన ఆదివాసీలకు అన్యాయం చేసారన్న అభియోగం లేదు. మేలు చేసిన చరిత్ర మాత్రమే ఉంది. వారు మేలు చేసింది వారి పద్ధతిలోనే కావచ్చు. ఆ పద్ధతి ఎం-ఎల్ పార్టీల రాజకీయ దృక్పధానికి నచ్చకపోవచ్చు. అంతమాత్రం చేత వారు గిరిజన ద్రోహులు కారు. ఆ సంస్థల మీద, బాధ్యుల మీద పీపుల్స్‌వార్ అర్థరహితమైన ఆరోపణలు వేయడమే కాక (*బిర్లాలకు విశాఖపట్నం ఏజన్సీలో ప్రభుత్వం భూమి లీజుకు ఇవ్వకుండా అడ్డుపడి పోరాటం చేసిన 'సమత' ను బిర్లా ఏజెంటన్నారు*), అవి స్వచ్ఛంద సంస్థలనీ, సామ్రాజ్యవాద ఏజెంట్లనీ, ప్రజలలో సంస్కరణ భ్రమలు కల్పించి ప్రజలను పోరాటాలనుండి దూరం చేస్తున్నారనీ ఆరోపించారు. వాళ్ళ పద్ధతులు నచ్చనంత మాత్రాన వారిని తరిమేసే హక్కు పీపుల్స్‌వార్‌కు ఎక్కడిదన్న ప్రశ్న అటుంచి, రాష్ట్రంలో అనేక ఇతర ప్రాంతాలలో పీపుల్స్‌వార్‌కు స్వచ్ఛంద సంస్థలతో మంచి సంబంధమే ఉంది. వాళ్ల జీపులనూ, ఇతర వసతులనూ వాడుకుంటుంటారు. తమ వ్యాప్తికి వారు అడ్డం రానంతకాలం-తమ విధానాలతో అడ్డస్తయి పనిచేయడంవల్ల కావచ్చు, తమకు నిర్మాణం లేని ప్రాంతాలలో పనిచేయడం వల్ల కావచ్చు, వారు చేసే పని స్వభావరీత్యా తమతో పోటీకి వచ్చేది కాకపోవటం వల్ల కావచ్చు-వారిని వాడుకుంటారు. అడ్డం వచ్చినప్పుడే వారు సామ్రాజ్యవాద ఏజెంట్లవుతారు.

## 4

ఈ అసహనం అందరి దగ్గరా సాగుతుందిగానీ ఒక నక్సలైట్ పార్టీ పనిచేసే చోట మరొక నక్సలైట్ పార్టీ ప్రవేశిస్తే ఇద్దరి వైఖరీ ఒకటే కాబట్టి సాగడం కష్టం. అప్పుడు పరస్పర దాడులు, హత్యలు, హింసాకాండ చెలరేగుతాయి. తాము బలప్రయోగంతో తేల్చుకోగలిగి

నట్టయితే ఈ పరస్పర సంహారంలో ఏ ప్రజాస్వామ్య సూత్రమూ ఇమిడి ఉందని ఈ పార్టీలు అనుకోవు. అది రెండు పంథాల మధ్య పోరాటం అనీ సత్యం ఎవరి దగ్గర ఉంటే వారే నిలదొక్కుకుంటారనీ ఈ పార్టీలే కాదు, విప్లవ అభిమానులైన మేధావులు సైతం సూత్రీకరిస్తారు. బలప్రయోగ సామర్థ్యంలో పీపుల్స్‌వార్‌కు ఎవరూ పోటీ రాలేరు కాబట్టి ఆ పార్టీ వైఖరి ఎప్పుడూ ఇదే. తక్కినవారికి మాత్రం తాము బలహీనంగా ఉన్న చోట ప్రజాతంత్ర సూత్రాలు గుర్తొస్తాయి. అప్పుడు రెండు పంథాల పోరాటం అని దబాయించడం మానేసి, ఎదుటివారు తమ ప్రజాస్వామ్య హక్కులపైన దాడి చేస్తున్నారని ఆందోళన చేస్తారు. ప్రజాతంత్రవాదుల మద్దతు కోరుతారు.

న్యూడెమోక్రసీ (ప్రజాపంథా) నల్గొండ జిల్లాలో పీపుల్స్‌వార్‌తో ఘర్షణ పెట్టుకొన్న తొలి రోజులలో పీపుల్స్‌వార్‌కు ఆ జిల్లాలో దళాలు లేవు కాబట్టి ఉభయులూ సమ ఉజ్జీలుగా చంపుకున్నారు. ఆలేరు మండలం టంగుటూరు గ్రామాన్ని-ఎం-ఎల్ రాజకీయాలకు ప్రతీకగా ఉన్న గ్రామాన్ని-తమ పరస్పర సంహారంలో ఇద్దరూ కలిసి వల్లకాడు చేసారు. ఖమ్మం జిల్లా బయ్యారంలో నిరాయుధుడైన కార్మిక నాయకుడు ముస్తఫాను తమ ప్రత్యర్థి వర్గంలో చేరాడని న్యూడెమోక్రసీ వారు హతమార్చారు. అయితే నిజామాబాద్ జిల్లాలో నిరాయుధులైన న్యూడెమోక్రసీ రైతుకూలి సంఘం కార్యకర్తలకు పీపుల్స్‌వార్ దళాలతో ఘర్షణ మొదలయ్యేసరికి తమ రాజకీయ స్వేచ్ఛపైన దాడి జరుగుతూ ఉందని గొడవచేశారు. ఇదే పార్టీ ఈ మధ్య పశ్చిమగోదావరి జిల్లాలో ఒక గిరిజనుడిని చంపింది. ఒకప్పుడు న్యూడెమోక్రసీలో పనిచేసి బయటకు పోయిన ఈ గిరిజనుడు అల్లరిమూకలనూ అరాచకవాదులనూ చేరదీస్తున్నాడని చెప్పి చంపారట. గుండాలను చేరదీసే భూస్వాములను సైతం ప్రజా ఉద్యమాల ద్వారా ఎదుర్కోవాలి తప్ప చంపడం పరిష్కారమార్గం కాదని భావించే ఈ పార్టీ దుర్బలుడైన ఆ గిరిజనుడిని ఎందుకు చంపినట్లు? *'1 ఆఫ్ 70'* పట్ల ఈ పార్టీ అనుసరిస్తున్న గోడమీది పిల్లి వైఖరిని నిరసించి, గిరిజనులను ఈ మధ్య కాలంలో భూమి పోరాటాలకు సంఘటితం చేస్తున్న సి.పి.ఐ.(ఎం)కు దగ్గరైనందుకా? సి.పి.ఐ. (ఎం)లో చేరమని గిరిజనులను ప్రోత్సహించినందుకా? అది అతని రాజకీయ స్వేచ్ఛ కాదా?

పరస్పర ఘర్షణలున్నచోట ఎం-ఎల్ పార్టీలు దిగజారని స్థాయి అంటూ లేదు. ఈ మాట అనడానికి ఎంత ఇబ్బంది అనిపించినా అనక తప్పదు. మామూలుగా ఈ పార్టీలను 'ముఠాలు' అని పోలీసులు తప్ప ఎవరూ అనరు. అనడం భావ్యం కూడ కాదు. కాని ఘర్షణలున్న చోట ఆ మాట ప్రయోగించడంలో ఔచిత్యం ఉంది. తాము ఒక్కరే పనిచేసేచోట పాటించే అనేక నియమాలను ఘర్షణలున్నచోట ఈ పార్టీలు పాటించవు. ఘర్షణలో ఆధిక్యత నెలకొల్పడానికి ఉపయోగ పడుతుందనుకుంటే ఏమైనా చేస్తారు. మామూలుగా చేరదీయనివారిని చేరదీస్తారు, మామూలుగా తలదూర్చని సమస్యలలో తలదూరుస్తారు, ఎదుటివారి చర్యల వల్ల అసంతృప్తులయిన వారిని రెచ్చగొడతారు, ఎదుటివారు బహిష్కరించినవారికి ఆశ్రయమిస్తారు, తమ సంఘాలలో సభ్యత్వం కూడ ఇస్తారు. ఎదుటివారు చేసిన న్యాయాన్ని అన్యాయమంటారు, ప్రజల మధ్యనున్న చిన్న సమస్యలను పోటా పోటీగా పెంచి పెద్దది చేస్తారు, ప్రజలలోనూ తమ

కార్యకర్తలలోనూ అరాచక ప్రవర్తనను ప్రోత్సహిస్తారు, పోలీస్ ఇన్‌ఫార్మర్లుగానూ మారగలరు- ఒకమాటలో చెప్పాలంటే ఫాక్షన్ ముఠాలలాగ ప్రవర్తిస్తారు. ఈ ప్రవర్తన వారివెంట ఉన్న ప్రజల పైన కూడ దుష్ప్రభావం వేస్తుంది. స్థానిక కార్యకర్తలు, ప్రజలు కూడ చీలి ముఠాలుగా వ్యవహరించడం నేర్చుకుంటారు. ప్రజలమధ్య సామరస్య వాతావరణం ధ్వంసం అవుతుంది. ముఠాతత్వం, ఘర్షణపడే స్వభావం ఉండే వ్యక్తుల అవసరం ఉద్యమాలకు పెరుగుతుంది. అటువంటివారు ఉద్యమాలలో పైకివస్తారు. ఉద్యమాల నైతిక స్థాయి దిగజారుతుంది.

జనశక్తికీ పీపుల్స్‌వార్‌కూ ఉన్న ఘర్షణలకు ప్రధాన కేంద్రాలైన మెదక్, కరీంనగర్ జిల్లాలోనూ (కొంతవరకు శ్రీకాకుళం జిల్లాలోనూ), త్రికోణంగా చీలిన పీపుల్స్‌వార్ గ్రూపుల ఘర్షణకు కేంద్రమైన అనంతపురం జిల్లాలోనూ దీనికి చాలా ఉదాహరణలు ఉన్నాయి. న్యూ డెమోక్రసీ తక్కిన అన్ని ఎం-ఎల్ పార్టీలతోనూ ఘర్షణ పడుతున్న ఖమ్మం జిల్లా ఇల్లందు ప్రాంతంలోనూ, వివిధ 'పుల్లారెడ్డి' గ్రూపులు ఒకచోట పనిచేస్తున్న వరంగల్ జిల్లా ములుగు తాలూకాలోనూ యివి కనిపిస్తాయి.

ఏడెనిమిదేళ్ళ క్రితం మెదక్‌లోనూ కరీంనగర్‌లోనూ చాలా తీవ్రస్థాయిలో ఉన్న జనశక్తి-పీపుల్స్‌వార్ ఘర్షణలు చల్లబడ్డాయనుకుంటూ ఉండగా ఈ మధ్య మళ్ళీ పెరిగాయి. గత అనుభవం నుండి ఈ రెండు పార్టీలూ ఏమీ నేర్చుకోలేదనడానికి సూచికగా అదేరకమైన ఘర్షణలు మళ్ళీ జరుగుతున్నాయి. గ్రామీణ కార్యకర్తల మధ్యనున్న వ్యక్తిగత ఘర్షణలు పార్టీల మధ్య ఘర్షణలుగా మారడం, ప్రజల మధ్యనున్న చిన్న సమస్యలలో చెరి ఒకవైపు నిలబడి సమస్యను పెంచి తమ మధ్య వైరాన్ని కూడ పెంచుకోవడం, ఒకరి సానుభూతిపరులపైన మరొకరు దాడి చేయడం, ఒకరు బహిష్కరించిన వారిని మరొకరు చేర్చుకోవడం, ఒకరు చేసిన పరిష్కారాన్ని మరొకరు తిరగదోడడం జరుగుతున్నది.

కరీంనగర్ జిల్లాలో గంభీరరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాలలో జనశక్తి, పీపుల్స్‌వార్ దళాలు **1996**లో ఒక వరుస క్రమంలో ముగ్గురు గ్రామీణ తెలుగుదేశం నాయకులను హతమార్చారు. ఆ పార్టీకి సహకరిస్తున్నాడని ఈ పార్టీవాళ్ళు, ఈ పార్టీకి సహకరిస్తున్నాడని ఆ పార్టీవాళ్ళు చంపారు తప్ప మృతులకు ఇతరత్రా చెడ్డ పేరు లేదు. నిజానికి పీపుల్స్‌వార్ హత్యచేసిన ఎల్లారెడ్డిపేట జడ్‌పిటిసి ఎల్సాని మల్లయ్యకు ప్రజలలో మంచిపేరు ఉండింది కూడ. ఎల్లారెడ్డిపేట మండలంలో ఆ పార్టీ చర్యల పట్ల ఎన్నడూ వ్యక్తం కానంత నిరసన ఈ హత్య ఫలితంగా మల్లయ్య స్వగ్రామమైన నారాయణపురంలో వ్యక్తం అయింది. ఆ మండలానికి మల్లయ్య పేరు పెట్టాలన్న ప్రతిపాదన వచ్చింది కానీ ఎందుకో అమలు కాలేదు. *(గతంలో తాడిచర్ల మండలానికి మల్హరరావు పేరు, కేశవపట్నం మండలానికి గాజుల శంకరయ్య పేరు పెట్టినట్టు. ఇట్లా అన్నలు చంపిన ప్రజాదరణ గల ప్రజాప్రతినిధుల పేర్లు మండలాలకు పెడుతూ పోతే కరీంనగర్ జిల్లా మండలాల జాబితా వేగంగానే మారిపోయే ప్రమాదం ఉంది!)*

ఈ సంవత్సరం మార్చి నెలలో సిరిసిల్ల డివిజన్‌లో జనశక్తి, పీపుల్స్‌వార్‌లు ఒకరి సానుభూతిపరులను, కార్యకర్తలను మరొకరు కొట్టడం చంపడం మళ్ళీ మొదలు పెట్టారు.

జనశక్తివారు నలుగురికి దేహశుద్ధి చేసి ఒకరిని చంపగా, పీపుల్స్‌వార్ ఇద్దరిని హతమార్చింది. ఈ రెండు పార్టీలూ ప్రజలను సమీకరించి శ్రమదానం ద్వారా చెరువులు కట్టిస్తున్నారని ఘనంగా చెప్పుకుంటున్న వీర్నపల్లి అడవిలోనే ఈ జంట హత్య జరిగింది. ఆ తరువాత (ఈ వ్యాసం రాస్తుండగా) జనశక్తివారు ఇంకొక పీపుల్స్‌వార్ అనుయాయుడిని చంపారు. చనిపోయిన వారంతా ఇన్‌ఫార్మర్ అన్న నింద మోపబడ్డవారేగానీ నిజానికిది ఆధిపత్య పోరు తప్ప వేరే ఏమీ కాదు. ఈ ఆధిపత్య పోరులో చనిపోయేవారంతా అట్టడుగు వర్గాలలో కులాలలో పుట్టి ఎం-ఎల్ రాజకీయాల పట్ల ఆకర్షితులయి ఈ పార్టీలోనో ఆ పార్టీలోనో చేరినవారే.

అదే కరీంనగర్‌జిల్లా తాడిచర్ల అడవులలోని గాదంపల్లి లంబాడా తండాలో గత సంవత్సరం పీపుల్స్‌వార్ సీతారాం నాయక్ అనే లంబాడా రైతును చంపింది. ఈ హత్యోదంతం కొంచెం వివరంగా చెప్పుకోదగింది. సీతారాంకు అదే గ్రామానికి చెందిన రాజు నాయక్‌తో చిన్న ఘర్షణ ఉండింది. ఇద్దరూ సాధారణ రైతులే, లంబాడా గిరిజనులే. ఆ ఘర్షణలో భాగంగా కొట్టుకోవడం, సీతారాం ఇచ్చిన ఫిర్యాదు మీద పోలీసులు రాజు ఇంటి పైన దాడి చేయడం కూడ జరిగింది. కాలక్రమంలో రాజు మంథని ప్రాంతంలో తిరిగే పీపుల్స్‌వార్ దళానికి దగ్గరయ్యాడు. అది చూచి భయపడి కాబోలు సీతారాం 'ప్రతిఘటన' నక్సలైట్లకు దగ్గరయ్యాడు. (అతడు ఆ నిర్ణయం తీసుకోవడంలోనే ఆ పార్టీల ముఠాతత్వాన్ని గురించి ప్రజల్లో ఉన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.) ఈ రెండు పార్టీలలో ఏ ఒక్కరైనా ఈ గిరిజన రైతులిద్దరినీ కూర్చోబెట్టి వాళ్ళ గొడవలకు కారణాలు తెలుసుకొని సర్దుబాటు చేసి ఉండవచ్చును. కానీ దాని బదులు వారి ఘర్షణ పీపుల్స్‌వార్-ప్రతిఘటనల ఘర్షణగా మారింది. ఒకే వర్గానికీ గిరిజన జాతికీ చెందిన ప్రజలుగా కనిపించవలసిన వాళ్ళు 'మావాడు', 'మీవాడు' గా కనిపించసాగారు. ఆ ప్రాంత పీపుల్స్‌వార్ దళనాయకుడు చంద్రన్న ఒకసారి ఆ ప్రాంతం ప్రతిఘటన దళాన్నీ, వారి మద్దతుదారులైన సీతారాం వంటివారినీ పిలిచి జాగ్రత్తగా మసలుకొమ్మని హెచ్చరించాడు. తరువాత ఒకసారి 'ప్రజాకోర్టు' పెట్టి రాజుకు సీతారాం నష్టపరిహారం కట్టి ఇయ్యాలని తీర్పు ఇచ్చాడు. (రాజు పట్టుబట్టలేదు, సీతారాం కట్టియ్యలేదు.) సీతారాం ప్రతిఘటనకు కేవలం షెల్టరు, అన్నం సమకూర్చే మద్దతుదారుగా ఉండిపోగా, రాజు పీపుల్స్‌వార్ కార్యకర్త అయ్యాడు. అతని మీద తనతోటి మిలిటెంట్ భార్యపైన అత్యాచారం చేసాడన్న అభియోగం (ఆమె ఇచ్చిన ఫిర్యాదే) ఉన్నప్పటికీ పీపుల్స్‌వార్ దళం అతన్ని దూరం ఉంచలేదు. రాజు తన స్థానాన్ని ఉపయోగించుకొని దళాన్ని ఏమని రెచ్చగొట్టాడోగానీ దళం ఒకరోజు తండాలోకి వచ్చి సీతారాం నాయక్‌ను కాల్చి చంపింది. దానికి కోపగించి సీతారాంకు సన్నిహితులైన వారు రాజు ఇంటిపైన దాడిచేసి చాలా నష్టం చేసారు. ఆ నష్టం కూడ సీతారాం కుటుంబం చేతనే రాజు కుటుంబానికి దళం ఇప్పించింది. (అయితే ఈ డబ్బు పోలీసుల పాలయినట్టుంది-రాజును పట్టుకోవడానికి అతని ఇంటిపైన దాడి చేసినపుడు పోలీసులు పట్టుకు పోయినట్టున్నారు.) నక్సలైట్లు ఎవరినైనా చంపితే మృతుల కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం సీతారాం కుటుంబం తీసుకోవడానికి వీలులేదనీ

తీసుకుంటే అది కూడ తామే స్వాధీనం చేసుకుంటామనీ దళం సీతారాం కుటుంబాన్ని హెచ్చరించింది. (అయితే ఒక నక్సలైట్ పార్టీకి చెందిన వ్యక్తిని మరొక నక్సలైట్ పార్టీ చంపితే మట్టుకు నష్టపరిహారం ఇచ్చేది ఉండదని ప్రభుత్వం అంటున్నది కాబట్టి అది బహుశా ఎట్లాగూ దక్కేది కాదనుకోండి.) ఈ పనులన్నీ చేసింది ఎవరో 'అవగాహన లేని మిలిటెంట్లు' కాదు. మంథని ప్రాంత పీపుల్స్‌వార్ దళం స్వయంగా చేసింది.

తాడిచర్లను తాడిపత్రిగా మార్చి, పీపుల్స్‌వార్ ప్రతిఘటన పార్టీల బదులు జె.సి. దివాకర్‌రెడ్డినీ సూర్యప్రతాప్‌రెడ్డినీ ఊహించుకుంటే ఈ కథ చాలా సహజంగా ఉంటుంది. కాని ఇదేదో చాలా అరుదైన కథ అనుకోనక్కరలేదు. ఇటువంటి కథలు తెలంగాణలో- ముఖ్యంగా మెదక్, కరీంనగర్ జిల్లాల్లో-డజన్ల సంఖ్యలో ఉన్నాయి.

మెదక్ జిల్లాలోనయితే **1990-92** కాలంలో పీపుల్స్‌వార్ - జనశక్తి పార్టీలు పరస్పర సంహార క్రీడలో **30**కి పైగా హత్యలు చేసుకున్నాయి. ఎవరిది న్యాయమో తేల్చండని వీరు బొంబాయి నుండీ ఈ రాష్ట్రం నుండీ ఆహ్వానించిన ప్రజాతంత్రవాదులు ఇద్దరి పద్ధతిలోనూ ఉన్న ముఠాతత్వాన్ని ఎత్తిచూపారు. అప్పటికి హత్యాకాండ ఆగిపోవడంతో రెండు పార్టీలకు బుద్ధి వచ్చిందని అందరూ భావించారు గానీ ఈ మధ్య మళ్ళీ అదే పద్ధతిలో చంపుకుంటున్నారు. **1997**లో మొదలుపెట్టి ఇప్పటికి చెరి మూడు హత్యలు చేసుకున్నారు. గతంలో ఘర్షణలున్నప్పుడు ఇరువైపులా కార్యకర్తలుగా ఉన్నవారిలో చాలామంది ఈ మధ్య కాలంలో 'మాజీలు' అయ్యారు. పాత కక్షలను త్రవ్వి తీసి వాళ్ళను పరస్పరం చంపడం, చంపుతామని బెదిరించడం జరుగుతూ ఉంది.

కరీంనగర్‌లో లంబాడా సీతారాం హత్యలాగే మెదక్‌లో మాదిగ యువకుడు మైసయ్య హత్య ఈ ఘర్షణల స్వభావానికి అద్దం పడుతుంది. నష్కల్ గ్రామ నివాసి అయిన మైసయ్య పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసాడు. ఒకప్పుడు 'జనశక్తి' లో పనిచేసాడు. ఆ తరువాత మాదిగ రిజర్వేషన్ ఉద్యమ కార్యకర్త అయ్యాడు. అయినప్పటికీ తమతో సంబంధాలున్నాయని జనశక్తి వారంటారు. (లేవని ఎం.ఆర్. పి.ఎస్. వారంటారు) ఏకసమయంలో అన్నలమనిషి గానూ మరొక పార్టీ మనిషిగానూ ఉండడం తెలంగాణలో అసాధారణమేం కాదు. మైసయ్యకు అదే ఊరికి చెందిన నారాయణ అనే మాల యువకుడితో భూమి తగాదా ఉండింది. తగాదా సంక్లిష్టమైనదే గానీ భూమి పరిణామం **6** గుంటలు మాత్రమే. నారాయణ మైసయ్య అంత చదువుకున్నవాడు కాదు గానీ అతనికి పీపుల్స్‌వార్ మద్దతు ఉంది. ఇటు మైసయ్యకు జనశక్తి ముద్ర ఉండడంతో వారి చిన్న తగాదాకు పెద్ద రంగు అంటుకుంది. ఈ ఘర్షణకు ఇతర కోణాలు కూడ ఉన్నాయి. మాల-మాదిగ కోణం ఉంది. మైసయ్యలో తన విద్యాధిక్యతను ఎదుటివారు గుర్తించాలన్న (కొంతవరకు సహజమైన) పట్టుదలతోపాటు స్వభావసిద్ధమైన మొండితనం ఉండింది. 'అన్నల' మనిషినైన నన్ను ఇతడెందుకు గుర్తించడని అతని ప్రత్యర్థికీ అంతే పట్టుదల. దీనికి గ్రామంలోని ఇతర రాజకీయాలు కూడ తోడయ్యాయి. అటు కొందరు, ఇటు కొందరు చేరారు. టి.డి.పి. వాళ్లు, కాంగ్రెస్ వాళ్ళు, బి.జె.పి. వాళ్ళు చేరారు.

వారి భూమి తగాదాకు పీపుల్స్‌వార్ చూపించిన పరిష్కారాన్ని మైసయ్య ఒప్పుకోలేదు. ఇరు వర్గాలు దాడి చేసుకున్నారు, కొట్టుకున్నారు, పోలీసు కేసులయ్యాయి. తరువాత వారి భూమి పంచాయితీని పరిష్కరించడానికి పౌరహక్కుల సంఘంతో సహా ఇతరులనేకులు ప్రయత్నం చేసారు. ఇరుపక్షాల మొండితనం వల్ల (బహుశా మైసయ్య మొండితనమే ఎక్కువ కావచ్చు) అది పరిష్కారం కాలేదు. అయినా అది వారిద్దరి సమస్య తప్ప ప్రజలందరి సమస్యా కాదు. వారిద్దరిలో ఒకరు పీడకులు ఒకరు పీడితులు కారు. దానిని వారు పరిష్కారం చేసుకోకపోతే వారికి మాత్రమే నష్టం. అదికూడ పెద్ద నష్టం కాదు, చిన్న నష్టమే. నక్సలైట్లయినా వేరొకరైనా చూపించిన పరిష్కారాన్ని వారు ఆమోదించకపోతే దానిని 'ప్రిస్టేజ్' సమస్యగా భావించకుండ 'మీ కర్మ' అని వదిలిపెడితే ఎవరికీ నష్టం ఉండేది కాదు. కాని స్థానిక పీపుల్స్‌వార్ దళం - మైసయ్య తమ పరిష్కారాన్ని ఆమోదించక పోవడాన్ని సహించలేక పోయారో, లేక తమ అనుయాయుడి వ్యక్తిగత కక్షను తీర్చడం తమ రాజకీయ కర్తవ్యంగా భావించారో, లేక మాటవినని వారిని విడిచిపెడితే తమ ప్రశాసనం దెబ్బ తింటుందనుకున్నారో గానీ - గత జూలైలో మైసయ్యను కాల్చి చంపారు. అతను తమ వారిపైన పోలీసులచేత దాడి చేయించాడని (అంటే ఇన్‌ఫార్మర్ అని)యధావిధిగా ఆరోపణ వేసారు. దీనికి ప్రతీకారంగా జనశక్తివాళ్ళు నారాయణకు మద్దతు ఇచ్చిన జంపాగౌడ్ అనే తెలుగుదేశం కార్యకర్తను హత్య చేసారు. అంతకుముందే ఎం.ఆర్.పి.ఎస్. వాళ్ళు పీపుల్స్‌వార్ మైసయ్యను ఇన్‌ఫార్మర్ అనడాన్నీ హత్యచేయడాన్నీ సవాలు చేస్తూ నక్కల్‌లోనే 'ప్రజాకోర్టు' పెట్టి నిరసన వ్యక్తం చేసారు.

నిజానికి **1990** నుండి ఇప్పటిదాకా మెదక్ జిల్లాలో ఈ రెండు పార్టీల మధ్య నడిచిన ఘర్షణల చరిత్ర వివరంగా చెప్తే ఇద్దరి మీద శాశ్వతమైన అసహ్యం ఏర్పడే ప్రమాదం ఉంది. వేరే ఏ తెలంగాణ జిల్లాలోనూ లేనంతగా మెదక్ జిల్లాలో మిలిటెంట్లంటే రౌడీలు అన్న అభిప్రాయం ప్రజలలో ఉంది. రౌడీ స్వభావంగల వాళ్ళను ఇరువురూ చేరదీయడంవల్లనే రెండు పార్టీల మధ్య ఘర్షణలు అంత తీవ్రస్థాయిలో ఉన్నాయనుకోవాలా? ఘర్షణలు తీవ్రంగా ఉండడం వల్లనే రౌడీ స్వభావం గలవాళ్ళు పోటాపోటీగా ఇరువైపులా ఆకర్షితులయ్యా రనుకోవాలా? లేక ఘర్షణల కారణంగానే అటువంటివారిని-కొట్లాటకు పనికొస్తారని-పార్టీలు చేరదీసాయనుకోవాలా? లేకపోతే పరస్పర ఘర్షణల పట్ల పార్టీల కున్న ఉదాసీన వైఖరి వల్ల కార్యకర్తల్లో అటువంటి గుణాలు ముందుకొచ్చాయనుకోవాలా?

అన్ని తెలంగాణ జిల్లాల కంటే మెదక్‌లో మొదటినుండి గ్రామీణ ప్రజాజీవిత సంస్కృతిలో హింసాదౌర్జన్యాల పాలు ఎక్కువ ఉంది. మూకుమ్మడిగా ప్రజలే 'మంత్రగాళ్ళ' పైన దాడిచేసి అతిక్రూరంగా హింసించి చంపిన ఘటనలు ఈ జిల్లాలో చాలా కనిపిస్తాయి. అటువంటి సంస్కృతి ఉన్న ప్రాంతాలలో సాయుధ పోరాట రాజకీయాలను అనాలోచితంగా ప్రవేశపెడితే ఎటువంటి వ్యక్తులు ఆకర్షితులౌతారు-లేదా ఎటువంటి ప్రవర్తన ముందుకొస్తుంది- అనేది సందేహాస్పదమే. ఎవరు రాజకీయాలకు ఆకర్షితులై వస్తున్నారు, ఎవరు ఆయుధాలకు ఆకర్షితులై వస్తున్నారు అనేది తేల్చిచెప్పడం కష్టమే. హింసకూ క్రూరత్వానికీ రాజకీయ మిలిటెన్సీకీ న్యాయమైన ప్రజాగ్రహానికీ తేడా గుర్తించడం ఎన్నడూ నేర్చుకోని నక్సలైట్ పార్టీలు ఎంపిక

చేసుకునే కార్యకర్తలలో హింసాప్రవృత్తి ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. (వాళ్ళకు ఇతరత్రా *అవగాహన ఉండనే ఉండదని గానీ ప్రజలకు అసలే పనికిరారని గానీ అనుకోనవసరం లేదు.)* ఒక పార్టీయే ఉంటే ఈ లోపాన్ని కాలక్రమంలో గుర్తించి సరిదిద్దుకోవడం సాధ్యమేమోగానీ రెండు పార్టీలు ఒకే ప్రజాపునాది కోసం పోటీ పడే పరిస్థితి వచ్చేసరికి ఇరుపక్షాలకూ ఈ కోవకు చెందినవాళ్ళే ఎక్కువ అవసరం అవుతారు. వాళ్ళను సవరించే సంగతి అటుంచి వారి ప్రాముఖ్యం మరింత పెరగడం వల్ల అసలే ఘర్షణతో నిండి ఉన్న వాతావరణం మరింత బీభత్సంగా తయారవుతుంది.

ఫాక్షన్ సంస్కృతి బలంగా ఉన్న రాయలసీమ జిల్లాలలో సాయుధ పోరాట రాజకీయాలు ప్రవేశపెడితే ఈ ప్రమాదం ఇంకింత ఎక్కువ ఉంటుంది. ఆ ఉద్యమం చేపట్టే పోరాటంలో విప్లవం ఎక్కడ ముగుస్తుందో ఫాక్షన్ రాజకీయం ఎక్కడ మొదలవుతుందో తేల్చి చెప్పడం కష్టం. ఈ రెండిటి మధ్య తేడా సిద్ధాంత విశ్లేషణలో ఉన్నంత స్పష్టంగా నిజజీవితంలో ఉండదు. ఫాక్షన్ సంస్కృతి బలంగా ఉన్న ప్రాంతాలలో మొదటిది చాలా సులభంగా రెండవదిగా మారగలదు. దీనిని నివారించడానికి చాలా మెలకువగా నడుచుకోవడం అవసరం. కానీ దానికి కావలసిన అవగాహన ఎం-ఎల్ పార్టీలకు ఉందా? వర్గాలను ఆర్థిక సంబంధాలు నిర్ణయిస్తాయనీ, వర్గప్రయోజనాలు పోరాటాలకు దారితీస్తాయనీ నమ్మే సిద్ధాంతంలో తాము ఏ రకమైన సామాజిక సంస్కృతిలో పనిచేస్తున్నామో, దాని ప్రభావం తమ పోరాటపంథాపైన, తమ పోరాట పంథా ప్రభావం దానిపైన ఏ విధంగా ఉంటాయో గుర్తించాలన్న స్పృహ ఉండడానికి చోటు ఉందా?

ఫాక్షనిస్టు అయిన ఎం.వి. రమణారెడ్డి చేతినుండి పీపుల్స్‌వార్ స్వాధీనం చేసుకున్న (చిత్తూరు జిల్లా) మదనపల్లి స్పిన్నింగ్ మిల్ కార్మిక సంఘం కథ ఒక ఉదాహరణ. రమణారెడ్డి చేతినుండి స్వాధీనం చేసుకున్నాక యూనియన్‌లో కొనసాగిన ఘర్షణలను పీపుల్స్‌వార్ నియమించిన కొత్త నాయకులు ఫాక్షన్ పద్ధతిలోనే నడిపారు. రెండు హత్యలు చేసారు, చాలా కొట్లాటలు జరిగాయి. పీపుల్స్‌వార్‌లోని గణపతి వర్గం-కె.ఎస్. వర్గం చీలికకు మిల్లు కార్మికుల అంతర్గత విభేదాలతో ముడిపడి, అటు ఆ చీలిక ఇటు ఈ విభేదాలు మరింత తీవ్ర రూపం తీసుకున్నాయి. చివరికి మళ్ళీ ఎం.వి. రమణారెడ్డి మనుషులే మిల్లు యూనియన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిలో కె. ఎస్. వర్గం పాత్ర కొంత లేకపోలేదనేది కేవలం గణపతి వర్గీయుల సందేహం కాదు. ఈ క్రమంలో అవాంఛనీయమైన వ్యక్తిత్వం ఉన్న మనుషులు ఇరువైపులా చేరి 'ప్రజా రాజకీయాలకు' ప్రతినిధులుగా నిలబడి ఆ మాటంటేనే ప్రజలలో ఏవగింపు కలిగే పరిస్థితి తెచ్చారు.

ఫాక్షన్ సంస్కృతి మదనపల్లి కంటె బాగా ఎక్కువ ఉన్న అనంతపురం జిల్లాలో **1990-91** ప్రాంతంలో మంచి భూమి పోరాటాలు నిర్వహించి ప్రజలలోకి వేగంగా చొచ్చుకొని పోయిన పీపుల్స్‌వార్ ఆ తరువాత మూడుగా చీలి, మూడు వర్గాలూ ఫాక్షన్ పద్ధతిలో కొట్లాడుకుంటున్న నేపథ్యంలో *(వేరే ఏ రకంగానూ కొట్లాడుకోవడం రాయలసీమ వాసులకు-కమ్యూనిస్టులతో సహా సులభంగా తెలియదు కాబట్టి)* ఆ జిల్లాలో- ముఖ్యంగా

ఉరవకొండ, పెనుకొండ తాలూకాలలో-కొన్నాళ్లు కనుమరుగవుతుందన్న ఆశ చూపించిన ఫాక్షన్ వాతావరణం తిరిగి పూర్తి స్థాయిలో తలెత్తింది. ప్రతీ సమస్యలోనూ గణపతి వర్గం నక్సలైట్లు, కె ఎస్ వర్గం నక్సలైట్లు, ఆర్ఓసి లేక సురేశ్ వర్గం నక్సలైట్లు (వీళ్ళను పరిటాల రవి నక్సలైట్లు లేక 'అడవి తెలుగుదేశం' వాళ్ళు అంటారు) చెరి ఒక పక్షం తీసుకొని- ఏగ్రామంలోనూ సాధారణంగా ముగ్గురూ ఉండరు, ఎవరో ఇద్దరే ఉంటారు అదృష్టం కొద్దీ-సమస్యను తమ ఫాక్షన్ కొట్లాటలలో భాగం చేస్తున్నారు. పరస్పరం హత్యలు చేసుకుంటున్నారు. కొంచెం ప్రపంచ జ్ఞానం ఉన్న రైతులు 'పాత ఫాక్షన్లు పోయి కొత్తవి వచ్చాయి తప్ప వేరే ఏమొచ్చింది' అని పెదవి విరుస్తున్నారు. అది లేని వాళ్ళకు రాజకీయాలు ఇంకొక రకంగా ఉండగలవని తెలీదు కాబట్టి ఉత్సాహంగా ఈ కొత్త ఫాక్షన్ కొట్లాటలలో పాల్గొంటున్నారు. ఉరవకొండ ఎం.ఎల్.ఏ పయ్యావుల కేశవ్ కుటుంబానికీ దివంగత సిపిఐ నాయకుడు నారాయణరెడ్డి కుటుంబానికీ ఉన్న ఫాక్షన్ కొట్లాటలో మొదటి వర్గం గణపతి గ్రూపు మద్దతునూ రెండవ వర్గం కె.ఎస్. గ్రూపు మద్దతునూ పొందాయన్న బలమైన వదంతి ఉంది. అది పూర్తిగా నిజమైనా కాకున్నా ఆ యిరువురి గ్రామాలలో పయ్యావుల వర్గంలో ఉండిన సామాన్య ప్రజలిప్పుడు గణపతి గ్రూపుతోనూ ఇవతలి వర్గంలో ఉండిన వారిప్పుడు కె ఎస్ గ్రూపుతోనూ ఉన్నారు. పెత్తందారీ ఫాక్షన్ల మధ్య విడిపోయిన ప్రజలు కమ్యూనిస్టు పార్టీ వెనుక ఐక్యం కావలసింది పోయి ఆ కమ్యూనిస్టు పార్టీ చీలిపోయిన తరువాత, ఆ వాతావరణంలో ఆ చీలికకు ఉండే ఫాక్షన్ స్వభావం వల్ల, తిరిగి అదే రకంగా చీలిపోయి ఏకసమయంలో ఒక పెత్తందారీ ఫాక్షన్‌తోనూ దానికి సమాంతరంగా ఒక కమ్యూనిస్టు ఫాక్షన్‌తోనూ ఉంటారు. ఆయుధాలతో సమాజంపైన తమ వ్యక్తిగత ఆధిపత్యం నెలకొల్పడం ఫాక్షనిస్టుల లక్షణం. ఆయుధాలతో సమాజం మీద తమ రాజకీయ ఆధిపత్యం నెలకొల్పడం నక్సలైట్ పార్టీల విప్లవ వ్యూహం. ఈ రెండింటికీ వర్గ విశ్లేషణలో కనిపించినంత తేడా వాస్తవంలో లేదు, ఉండనక్కరలేదు. రెండింటిలోనూ ప్రజలుంటారు. ఎక్కువ భాగం పేద ప్రజలే ఉంటారు. అది వ్యక్తిగతం, ఇది రాజకీయం, అది పెత్తందారీ వర్గాల ఆధిపత్యం, ఇది శ్రామిక ప్రజల ఆధిపత్యం అని చెప్పుకున్నంత మాత్రాన ఫాక్షన్ సంస్కృతిలో తేడా వచ్చేస్తుందనుకుంటే పొరబాటే. విలువలు ప్రధానమైన రాజకీయం మాత్రమే ఫాక్షన్ సంస్కృతికి భిన్నంగా ఉండగలదు. విప్లవ రాజకీయాలలో చీలిక వచ్చినప్పుడు ఈ అభేదం మరింత స్పష్టం అవుతుంది గానీ చీలిక లేకపోయినా, ఒకే పార్టీ ఉన్నా, బలానికీ ఆధిపత్యానికీ ప్రాముఖ్యం ఇచ్చినంత కాలం ఫాక్షన్ సంస్కృతిని తప్పించుకోవడం కష్టం. ఫాక్షన్ గ్రామాలలో సంఘం పెడితే మొదట ఫాక్షన్ రాజకీయాలలో ఆరితేరినవారే సంఘం దగ్గరికి వస్తారు అని అనుభవజ్ఞుడైన ఒక రాయలసీమ కమ్యూనిస్టు నాయకుడంటాడు. దీని అర్థం విప్లవ ఫాక్షన్లకూ భూస్వామ్య ఫాక్షన్లకూ ఏ తేడా లేదని కాదు. పెత్తందారీ ఫాక్షన్లలో బడుగుప్రజలకు కాలిబంట్లుగా తప్ప నాయకత్వంలో స్థానం ఉండదు. వారి ప్రయోజనాలకూ అంతే. ఫాక్షన్ రూపంలో నడిచే విప్లవ పోరాటాలలోనూ విప్లవ గ్రూపుల ఫాక్షన్ ఘర్షణలలోనూ బడుగువర్గాలకూ వారి ప్రయోజనాలకూ ప్రధాన స్థానం ఉంటుంది. అందువల్ల కూలిరేట్లు, భూములు మొదలయిన సమస్యలకిక్కడ వ్యక్తీకరణ దొరుకుతుంది. వాటితో పాటు కేవలం ముఠా స్వభావం ఉన్న

ఇతర సమస్యలకు కూడ వ్యక్తీకరణ దొరుకుతుంది. ఫాక్షన్ పద్ధతిలోనే వీటికి పరిష్కారం దొరకనూ వచ్చు, ఫాక్షన్ పద్ధతుల కారణంగా దొరకనూ పోవచ్చు. అంతకు మించి ప్రజాతంత్ర రాజకీయ పురోగతి మాత్రం ఉండదు.

ఎం-ఎల్ పార్టీల ముఠా కొట్లాటలకు శ్రీకాకుళం జిల్లా కూడ కొంచెం పేరు పొందింది. 1990లో పీపుల్స్‌వార్ ఇక్కడ ఇద్దరు జనశక్తి కార్యకర్తలను చంపింది. ఒక ఎం-ఎల్ పార్టీకి చెందిన రహస్య కార్యకర్తలు మరొక ఎం-ఎల్ పార్టీలోకి పోకుండ, లేక చీలిక తేకుండ నిరోధించడానికి వారిని కిడ్నాప్ చేసి దాచిపెట్టడం, చంపడం ఈ జిల్లాలోనే జరిగింది. జనశక్తిలోని కొందరు సాయుధ దళ సభ్యులు 'ఎస్.వి. కృష్ణయ్య వర్గం' వైపు వెళ్ళి పోనున్నారన్న అనుమానంతో ఆ పార్టీ నాయకుడు కుమార్ ఇద్దరిని కిడ్నాప్ చేసి ఒకరిని చంపి రెండవ వ్యక్తిని బందీగా ఉంచాడు. (*పార్టీ ఫిరాయింపులు ఆపడానికి కిడ్నాప్ చేయడం కేవలం 'బూర్జువా' రాజకీయాల లక్షణం కాదనీ, అదనంగా హత్యచేసి ఆపడం విప్లవ కమ్యూనిస్టులకు చెల్లుతుందనీ ఈ విధంగా రుజువయింది. ఈ ఘనకార్యం చేసిన మహానుభావుడికి జనశక్తి వేసిన 'శిక్ష' ఏమిటంటే తాత్కాలికంగా కిందికి తగ్గించి తిరిగి జిల్లాకమిటీలోకే కాదు నేరుగా రాష్ట్ర కమిటీలోకే తీసుకోవడం!*) అయితే 'ఎస్.వి. కృష్ణయ్య వర్గం' లోకి పోతారనుకున్నవాళ్ళు పీపుల్స్‌వార్ వైపు మొగ్గు చూపేసరికి వారిని స్వేచ్ఛగా ఇటు రానివ్వాలని పీపుల్స్‌వార్ జనశక్తిని హెచ్చరించింది. వచ్చినవారిని వెంటనే చేర్చుకుంది. ఈ విధంగా ఫిరాయించిన వారిని వెంటనే చేర్చుకోవడం ఘర్షణలు పెంచే చర్య అనీ సిద్ధాంతరీత్యా అనుచితమనీ పీపుల్స్‌వార్ అనుకోలేదు. ఖమ్మం జిల్లాలో కూడ 'పుల్లారెడ్డి' రాజకీయాలలో ఉండి దుందుడుకు తనానికి విమర్శకు గురయిన దళకమాండర్ మంగన్న పీపుల్స్‌వార్‌లోకి ఇదే విధంగా ఫిరాయించాడు. ఆఫ్ఘనిస్తాన్ లాంటి చోట్ల 'వార్‌లార్డ్స్' ఘర్షణలలో ఒక పక్షాన ఉన్న సైనిక అధిపతి తన సైన్యంతో సహా విపక్షంలోకి ఫిరాయించిన ఉదంతాలు చదువుతుంటాం. సైన్యానికి తుపాకీ బలమే తప్ప సిద్ధాంతమేమీ ఉండదు కాబట్టి ఈ ఫిరాయింపులలో వింతేమీ లేదనుకుంటాం. మరి నక్సలైట్ దళాల సంగతి కూడ అంతేనా? మరయితే ప్రధానంగా దళాల చుట్టూ తిరిగే నక్సలైట్ రాజకీయాలలో రాజకీయమేమైనా ఉందనుకోవాలా?

ఈ లోపల ఫిరాయింపు ద్వారానే కాక ఇతరత్రా కూడ బలం పెంచుకున్న పీపుల్స్‌వార్ శ్రీకాకుళంలో జనశక్తిని బెదిరించే కార్యక్రమం మొదలుపెట్టింది. మేము తప్ప ఇంకెవ్వరూ ఇక్కడ ఉండడానికి వీలులేదు అనే పద్ధతిలో దాదాగిరీ చలాయిస్తూ ఉంది. ఇప్పటికే పీపుల్స్‌వార్ కొంతకాలంగా పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రంలోని పర్లాకిమిడి ప్రాంతంలోకి ఈమధ్య జనశక్తి ప్రవేశించే ప్రయత్నం చేయడంతో ఈ గొడవలు అక్కడికి కూడ ఎగుమతి అయ్యాయి. జనశక్తికి సహకరించిన వారిపైన పీపుల్స్‌వార్ దాడులు, బెదిరింపులు, జనశక్తి చేపట్టిన సమస్యలలో పీపుల్స్‌వార్ కావాలని అవతలివైపు చేరి పాడుచేయడం, ఈ కొత్త 'పోరాటప్రాంతం' లోనూ మొదలయింది.

జనశక్తి పేరిట ఏడేళ్ళ క్రితం ఐక్యమైన పార్టీలు తిరిగి ఒకసారి చీలి మళ్ళీ రెండవ చీలికకు సన్నద్ధమైన క్రమంలో నిన్నటి కామ్రేడ్లను ఈ రోజు చంపుకున్న ఘటనలు నాలుగు

శ్రీకాకుళం, నల్గొండ, మెదక్, కర్నూలు జిల్లాలలో తలా ఒకటి - జరిగాయి. పరస్పర భౌతిక దాడులు, నిందారోపణలతో కూడిన ప్రచారం చాలా జరిగింది. చీలిక నుండి పుట్టిన ఉక్రోషం తప్ప ఈ ఘర్షణలకు వేరే కారణమేదీ లేదు. ఈ నాలుగింటిలో మూడు హత్యలు 'రాజన్న వర్గం'గా పిలవబడే గ్రూపే- అంటే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అనుయాయులే -చేసారు. మళ్ళీ మధ్యతరగతి ప్రజాతంత్రవాదులలో కొంచెం ఎక్కువ మద్దతు ఉండేది ఈ వర్గానికే. ఆ మద్దతుదార్లు ఈ హత్యలను మాత్రం ప్రశ్నించకుండా జాగ్రత్త పడుతుంటారు. (ఇది రాస్తుండగానే అయిదవ హత్య మెదక్ జిల్లాలో జరిగింది. అది కూడ 'రాజన్నవర్గమే' చేసింది. 'వీరయ్యవర్గానికి' సహకరిస్తున్నాడని అనుమానించిన యువజన కాంగ్రెస్ నాయకుడు రవీంద్రరెడ్డిని చంపింది.)

తెలంగాణకు తిరిగివద్దాం. విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలు ఉత్తర తెలంగాణ జిల్లాలలో - అందులోనూ వరంగల్ కరీంనగర్ జిల్లాలలో-మొదట ప్రవేశించడం ఒక రకంగా ఆ రాజకీయాల అదృష్టం. లేకుంటే ఎం-ఎల్ పార్టీలకు (ముఖ్యంగా అందరికీ మార్గదర్శకంగా తయారవుతున్న పీపుల్స్‌వార్‌కు) హింస పట్ల ఉన్న అనాలోచితమైన వైఖరి వల్ల ఈ పాటికి ఆ రాజకీయాలలో వట్టి దాదాగిరీ గుండాగిరీల పాలు ఇంకా ఎక్కువ అయి ఉండేది. మన రాష్ట్రమంతటిలోకీ ప్రజాజీవిత సంస్కృతిలో హింసాదౌర్జన్యాల పాలు-బలప్రయోగం చేసి మన అవసరాలు సాధించుకోవడంలో తప్పేమీ లేదనే సంస్కృతి-అతి ఎక్కువ ఉన్నది రాయలసీమలో నయితే అతి తక్కువ ఉన్నది ఈ జిల్లాల్లోనే. (అంటే ఇక్కడసలు రౌడీలు, గుండాలు లేనే లేరని కాదు. సాపేక్షంగా ఆ సంస్కృతి తక్కువని మాత్రమే.) విప్లవహింస పేరిట ఎం-ఎల్ పార్టీలే ఆ ఆలోచనను ఈ తెలంగాణ జిల్లాలకు అలవాటు చేసాయి. విప్లవహింస అంటే బలప్రయోగం చేసి అవసరాలు సాధించుకోవడం అనేనా అర్థం అని అడగవచ్చు. ఇక్కడ మనం సిద్ధాంతం గురించి మాట్లాడుకోవడం లేదు. ఆచరణలో అది పెంపొందిస్తున్న ఆలోచనా రీతుల గురించి మాట్లాడుకుంటున్నాం. అవి సిద్ధాంతం ప్రకారమే ఉండనక్కరలేదు. ఆ రెండిటికీ తేడా సమిష్టి హింస-వ్యక్తిహింస అనే దానిలో ఉందనుకుంటే పెద్ద పొరబాటే. కేవలం వ్యక్తులు మాత్రమే చేయగల తిరుగుబాట్లు ఉంటాయి. సమిష్టి పేరిట జరిగేవి తరచుగా వ్యక్తుల చర్యలే అయి ఉంటాయి. నిజమైన తేడా ఏమైనా ఉంటే అది న్యాయాన్యాయాల విలువలకూ బాధ్యతకూ మన చర్యల పర్యవసానం పట్ల మనకుండే జవాబుదారీతనానికీ సంబంధించినది. హింసను కేవలం ఒక సులువయిన సాధనంగా చూసే ఆలోచనారీతే తప్పని గుర్తిస్తే తప్ప ఈ తేడా అర్థం కాదు. గుర్తించలేని విప్లవరాజకీయాలు సమాజంలో హింసాదౌర్జన్యాల సంస్కృతిని పెంచగలవని గుర్తించడంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. పోలీసులు పైసలు ఇస్తామంటే ఆశపడి తమ సహచరులనే చంపేసి పార్టీనుండి బయటికి పోయి పోలీసుల పంచన చేరిన కత్తుల సమ్మయ్యలూ, నాగరాజులూ, సోమ్లానాయక్‌లూ ఆకాశం నుండి ఊడిపడలేదు. పోలీసులు వారిని సృష్టించలేదు. అనాలోచితమైన హింసారాజకీయాలే వారిని సృష్టించాయి. పోలీసులు వారిని వాడుకున్నారు.

ఎం-ఎల్ పార్టీలు తమ పోరాటవ్యూహంలో భాగంగా ఉత్తర తెలంగాణకు బలప్రయోగ సంస్కృతి అలవాటు చేయడమేకాక (లేదా పెంచడమే కాక) తాము చీలి కొట్లాడుకున్న క్రమంలో ప్రజలను చీల్చి, వారికి ముఠాతత్వం నేర్పించి చాలా నష్టం చేసాయి. నల్గొండ జిల్లాలో టంగుటూరు లాగే కరీంనగర్‌లో నిమ్మపల్లి, దూమాల వంటి గ్రామాలు ఒకప్పుడు విప్లవకమ్యూనిస్టు రాజకీయాలకు ప్రతీకలుగా నిలిచి ఆ తరువాత అన్నల ముఠాకొట్లాటలలో చీలి ఫాక్షన్ గ్రామాలుగా మారి నిస్పృహకూ అనిశ్చితికీ ముఠా కక్షలకూ నేరగాళ్ళకూ నిలయాలయ్యాయి. ఒకప్పుడు 'పుల్లారెడ్డి గ్రూపు' గా వరంగల్ జిల్లా ములుగు తాలుకాలో మంచి ప్రజా ఉద్యమం నడిపిన పార్టీ కాలక్రమంలో నాలుగు ముక్కలయి (ఇప్పుడు అయిదవ ముక్క సిద్ధంగా ఉన్నట్టుంది) ఆ ప్రాంత ప్రజలకు ఎంత నష్టం చేసిందో వరంగల్ జిల్లా నక్సలైట్ రాజకీయాల చరిత్రతో పరిచయం ఉన్నవారందరికీ తెలుసును. పోలీస్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన అరుణక్క, పరస్పర ఘర్షణలలో 'ప్రతిఘటన' వర్గం అతి కిరాతకంగా చంపిన బాబన్న, తాను నాయకత్వం వహిస్తున్న చీలిక వర్గానికి ఆయుధాలు సమకూర్చుకోవాలన్న తొందరలో పోలీసుల వలలో చిక్కి దిక్కులేని చావు పాలయిన ప్రజాదరణగల నాయకుడు అంతిరెడ్డి చనిపోయిన తరువాత ములుగు తాలూకాలో ఒకప్పటి ఉద్యమం రాశిలోనే కాక గుణంలోనూ బాగా దెబ్బతినింది. ఇదే రాయలసీమ అయి ఉంటే ఇంకెంత అధ్వాన్నంగా తయారయేదో కదా అని ఊహించుకొని సంతృప్తి చెందాలంతే. *(గత పంచాయతీ ఎన్నికలలో ప్రతిఘటన వాళ్ళు నిలబెట్టిన మండల ప్రెసిడెంట్ అభ్యర్థిని జనశక్తి వాళ్ళు కిడ్నాప్ చేసి దాచిపెట్టిన ఘటన రాయలసీమ వాసులకు సుపరిచితమైనదిగా కనిపిస్తుంది.)*

ఈ ముఠా కొట్లాటల సంస్కృతి ఉద్యమాల నైతిక స్థాయినీ ప్రజాజీవిత సంస్కృతినీ దిగజార్చడమే కాక పోలీసు నిర్బంధానికి ఊతం ఇస్తుంది. ముందసలు పోలీసు యంత్రాంగానికి చాలా ఆత్మస్థైర్యం ఇస్తుంది. మాఫియా గ్యాంగులలాగ కొట్లాడుకునే వీరిని అణచివేయడం చట్టవిరుద్ధం అయితే కావచ్చుగానీ దానిలో అనైతికత ఏముంది అని సమాజం అనుకోగలుగుతుంది. ఈ ముఠా కొట్లాటలకు ఏదో రాజకీయ ప్రాముఖ్యం అంటగట్టి దానిని విమర్శించడానికి వెనకాడే మేధావులు పోలీసు నిర్బంధంపట్ల సమాజంలో పెరిగే ఈ ఉదాసీనతను ఎదుర్కొనడానికి ఏమీ చేయలేరు.

ఈ నైతిక అర్థంలోనే కాక భౌతికంగా కూడ నిర్బంధం పెరిగే అవకాశం ఉంటుంది. తాము పని చేస్తున్న ప్రాంతంలోకి ఇతర ఎం-ఎల్ గ్రూపులు ప్రవేశిస్తే వాళ్ళ కదలికల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వడానికి వెనకాడరని న్యూడెమోక్రసీ వారిపైన *(ముఖ్యంగా వారికి గట్టి కేంద్రమైన ఖమ్మం జిల్లాలో)* సీరియస్ అభియోగం ఉంది. ఒకప్పుడు అవగాహనా లోపం వల్ల అటువంటి పొరబాట్లు జరిగిన మాట వాస్తవమేనని ఆ పార్టీవారు కూడ ఒప్పుకుంటారు గానీ ఇప్పుడా పని చేయడం లేదంటారు. అదెంత నిజమో తెలీదు. న్యూడెమోక్రసీకి ఆయుధాలు లేని లీగల్ నిర్మాణం చాలా ఉంది కాబట్టి, ఆయుధాలున్న ఎం-ఎల్ పార్టీ ఏదైనా వారు పనిచేస్తున్న ప్రాంతంలోకి ప్రవేశించినప్పుడు 'అనివార్యంగా' తలెత్తే ఘర్షణలలో

వీరి నిరాయుధులైన లీగల్ కార్యకర్తలకు వారి ఆయుధాల నుండి ప్రమాదం ఉంటుంది కాబట్టి, ప్రాణరక్షణ కోసం పోలీసుల అండ కోరడంలో తప్పులేదనే వాదన, అవసరమైన దానికంటే ఎక్కువ సమాచారం పోలీసులకు చేరవేసే అవకాశాన్ని కల్పిస్తుంది. దానిని 'సద్వినియోగం' చేసుకునే బలహీనతకు లోనుకాకుండా ఉండాలంటే చాలా క్రమశిక్షణ కావాలి.

ఒకరిమీద ఒకరు పోలీసులకు ఇన్‌ఫర్మేషన్ ఇచ్చినా ఇయ్యకున్నా వీరు పరస్పర కొట్లాటలలో నిమగ్నం అయి ఉండడం పోలీసులకు చాలా ప్రయోజనం కలిగిస్తుంది. వీళ్ళ ముఠాతత్వంవల్ల అసంతృప్తులయిన సామాన్య ప్రజలు పోలీసులకు ఇన్‌ఫర్మేషన్ ఇవ్వగలరు. సహకరించగలరు. ముఠాకొట్లాటల వల్ల గ్రామాలలో పెరిగే నేరప్రవృత్తి పోలీసుల ప్రవేశానికీ సమాచార వ్యవస్థకూ చాలా ఉపయోగపడుతుంది. వీళ్ళు కొట్లాడుకోవడం వల్ల వచ్చే కేసులు మూకుమ్మడి అరెస్టులకూ చిత్రహింసలకూ అవకాశం ఇస్తాయి.

ఈ మధ్య కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకాలో జనశక్తి వాళ్ళు ఒక పీపుల్స్‌వార్ మిలిటెంట్‌ను కిడ్నాప్ చేసి ఒళ్ళు విరగ్గొట్టారు. మామూలుగానయితే పోలీసులకు చిక్కని ఆ యువకుడు మంచం నుండి లేవలేని స్థితిలో కామారెడ్డిలో తన సోదరి ఇంట్లో తలదాచుకొని వైద్యం చేయించుకుంటుండగా పోలీసులొచ్చి తీసుకుపోయి కాల్చి చంపారు. గత సంవత్సరం వరంగల్ జిల్లా నర్సంపేట అడవులలో ఒకరినొకరు తరుముకుంటున్న జనశక్తి, న్యూడెమోక్రసీ దళాలను గమనించిన పోలీసులు ఒక ఫోర్స్‌గా బయలుదేరి రోడ్డుపక్కన ప్రత్యర్థుల కోసం చూస్తున్న న్యూడెమోక్రసీ దళంపైన కాల్పులు జరిపి, వెంటబడి తరిమి ఒక సీనియర్ నాయకుడిని చంపారు.

## 5

అయితే కేవలం భిన్న నక్సలైట్ గ్రూపుల మధ్య ఘర్షణ ఉన్నప్పుడు మాత్రమే నక్సలైట్ రాజకీయాలలో అవాంఛనీయమైన పోకడలు కనిపిస్తాయనుకుంటే పొరబాటే. గ్రామ ముఠా కక్షలలోనూ రాజకీయ కక్షలలోనూ ఒక పక్షం తీసుకొని రెండవ పక్షంపైన దాడి చేయడం, కార్యకర్తల వ్యక్తిగత కక్షల పరిష్కారం పార్టీ కార్యక్రమంగా మారడం, ప్రజల సమస్యలపైన చేసే పంచాయతులలో చిన్నతప్పులకు కూడ పెద్ద శిక్షలు వేసి తమ సత్తా చూపించుకోవడం, తమ మాట వినని వారిని, తమ కార్యకలాపాలకు అడ్డం వచ్చేవారిని ప్రజాద్రోహులుగా లేక ఇన్‌ఫార్మర్లుగా చిత్రీకరించి దాడి చేయడం, తమ కార్యకర్తలు తప్పు చేసారని తెలిసినా 'మావాళ్ళు' అనే ఫాక్షనిస్టు వైఖరితో వారిని వెనకేసుకొని రావడం, ఒకరిని చంపదలచుకుంటే వారిపైన తమకున్న నిర్దిష్టమైన అభియోగాన్ని మించి ఆరోపణలు వేయడం ('లంచగొండి, వ్యభిచారి, పంచాయితులు చేసి ప్రజలలో అరాచకం సృష్టిస్తున్నాడు, పార్టీకి వ్యతిరేకంగా ప్రచారంచేసి ప్రజలను గందరగోళంలో పడేస్తున్నాడు, భూస్వాముల ఏజెంట్, ఇన్‌ఫార్మర్' అన్న దండకం చదివి వీటిలో ఏదో ఒక దానిలో ఏదో ఒక అర్థంలో అసలయిన అభియోగం నిక్షిప్తమయి ఉంటుందని గ్రహించి ప్రజలు వెతుక్కోవాలి'), భౌతికదాడులకు పాల్పడేటప్పుడు తమ నిర్ణయానికి అవసరమైన

దానిని మించి భళగొలిపె పరిమాణంలో హింస ప్రయోగించడం, ప్రభుత్వంపైన, పోలీసులపైన లేక ఇతర 'శత్రువర్గాల' పైన కక్ష సాధించుకోవడానికి ఆ వర్గాలకు చెందినవారు ఎవరు తమకు అందుబాట్లో ఉంటే వారిపైన (వారి వ్యక్తిత్వంతోనూ నడవడికతోనూ సంబంధం లేకుండా) దాడిచేయడం, చందాలు ఎవరెంత ఇవ్వగలరన్న విచక్షణ లేకుండ కిడ్నాప్ చేసి, బెదిరించి, హింసించి రౌడీ మామూళ్ల పద్ధతిలో వసూలు చేసుకోవడం, ఇటువంటి అవలక్షణాలెన్నో వీరి చర్యలలో నిత్యం కనిపిస్తాయి. ఇవి పూర్తిగా కాకతాళీయమైన అవలక్షణాలు కావు. 'మిలిటెంట్ల అవగాహనా లోపం' వల్ల మాత్రమే జరుగుతున్నవి కావు. వీరి పోరాట పంథానుండి ఈ అవలక్షణాలు 'అనివార్యంగా' వచ్చాయని అనలేముగానీ (సంకల్పపూర్వకమైన మానవ ఆచరణలో ఏదీ పూర్తిగా 'అనివార్యం' కాదు) దానితో సన్నిహితంగా ముడిపడి ఉన్నాయనేది సత్యం. ప్రజల న్యాయమైన హక్కులసాధన కోసం పరిమితంగా బలప్రయోగానికి పాల్పడడం మాత్రమే ఎం-ఎల్ పార్టీల లక్ష్యం అయి ఉంటే (ఆ పేరు మీదనే తమ హింసనంతా ఈ పార్టీలు సమర్థించుకుంటాయి) మిలిటెంట్లలో అవగాహనా లోపాలు ఎన్ని ఉన్నా ఇన్ని అవలక్షణాలు ఇంతటి మోతాదులో ఉండేవి కావేమో. కానీ హింస విషయంలో పరిమితి గురించి పట్టింపు లేకపోవడమేకాక, తమ దీర్ఘకాల రాజకీయ వ్యూహంలో భాగంగా సమాజంపైన సాయుధ ఆధిపత్యం నెలకొల్పడం కూడ నక్సలైట్ పార్టీల పంథాలో భాగమే. నిజానికి ప్రజల నిత్యజీవిత సమస్యల పరిష్కారంకంటే ఇదే ముఖ్యభాగం. గెరిల్లాజోన్‌గా ప్రకటించుకున్న ప్రాంతాలలోనే కాక ప్రకటించుకోని ప్రాంతాలలో కూడ ప్రకటించుకోని పార్టీల ఆచరణలో కూడ ఈ కార్యక్రమం నిత్యం అమలవుతూ ఉంటుంది. దానికి చాలా పర్యవసానాలుంటాయి. వాటిని విడివిడిగా దిగువ చర్చిద్దాముగానీ, ఆధిపత్య రాజకీయాలకు ('పవర్ పాలిటిక్స్'కు) సర్వత్రా ('వర్గ స్వభావం'తో నిమిత్తం లేకుండా) ఉండే అవలక్షణాలని ఒక్క మాటలో వీటిని వివరించవచ్చును. ఇది అనివార్యమా అంటే మానవ వ్యవహారాలలో ఏదీ సంపూర్ణమైన అర్థంలో అనివార్యం కాదు. కానీ ఆ లక్షణం బలంగా ఉంటుందనేది సత్యం. దానిని గుర్తించడానికిగానీ ఎదిరించడానికిగానీ మన రాష్ట్రంలోని ఎం-ఎల్ పార్టీలు పెద్దగా ప్రయత్నం చేస్తున్నట్టేమీ కనిపించదు. ఎవరైనా నిలదీసినప్పుడు లేక రహస్యంగా నిర్వహించే ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో విలేకర్లు అడిగినప్పుడు చెప్పవలసిన మంచి మాటలు నాలుగు చెప్తారుగానీ ఆ సంకల్పం నిజంగా ఉన్న సూచనలేవీ లేవు. ఉంటే అవే ఘటనలు మళ్ళీ మళ్ళీ పునరావృతం అయ్యేవికావు. ఇచ్చే హామీలకూ వారి నిత్య జీవిత ఆచరణకూ ఇంత వ్యత్యాసం ఉండేది కాదు. పీపుల్స్‌వార్ నాయకులు గ్రామీణ ప్రాంతాలకు పోయే ఎర్రబస్సులను ఇకమీదట తగలబెట్టం అని చాలాసార్లు చెప్పారు. కానీ తగలబెడుతూనే ఉన్నారు. (*1990-91* నాటి మోతాదులో కాకపోవచ్చు) పోలీసులలో కిందిస్థాయి కానిస్టేబుళ్ళను చంపడం తమ ఉద్దేశ్యం కాదన్నారు. కానీ ప్రధానంగా వాళ్ళనే చంపుతున్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికలకు ముందు, ఎన్నికల నిర్వహణకు అడ్డం రామనీ, కేవలం బహిష్కరణ ప్రచారం చేస్తామనీ అన్నారు. కానీ ప్రచారంలో పాల్గొనొద్దని వివిధ పార్టీల కార్యకర్తలను ఎప్పటిలాగ బెదిరించడం, పాల్గొన్న వారికి 'దేహశుద్ధి' చేయడం మాత్రమే కాక పోలింగ్ రోజున కనీసం **25** గ్రామాలలో వోట్ల డబ్బాలు ఎత్తుకుపోయి తగలబెట్టారు. అమాయక ప్రజలను తెలిసీ

చంపిన కాకతీయ ఎక్స్‌ప్రెస్ వంటి ఘటనలు పునరావృతం కావని అన్నారు. కానీ మొన్నటి ఫిబ్రవరి 22 సాయంత్రం విశాఖపట్నం జిల్లా చింతపల్లి ఏజెన్సీలో వోట్లడబ్బాలు వెనక్కి తీసుకొస్తున్న పోలీసులతోబాటు (పోలీసులకంటె ఎక్కువ సంఖ్యలో) ఆదివాసులున్నారని చూసికూడ మందుపాతర పేల్చి 8 మంది ఆదివాసీలను చంపారు. బెదిరించి, భయపెట్టి చందాలు వసూలు చేయడం తమ విధానం కాదని పీపుల్స్‌వారే కాదు అన్ని పార్టీలూ అంటూంటాయి. కానీ చందాల బెదిరింపుల గురించి (ముఖ్యంగా జనశక్తి మీద) విపరీతమైన ఫిర్యాదులు నిత్యం వింటూనే ఉంటాము. ఈ తారతమ్యాన్ని గురించి ఈ పార్టీలను ప్రశ్నిస్తే, నాయకత్వం తన అవగాహనను కార్యకర్తలకు అందియ్యడంలో జరుగుతున్న జాప్యం అని వివరిస్తారు. ఈ సమాధానాన్ని కొంతకాలం ఆమోదిస్తాం. కానీ ఎల్లకాలం ఆమోదించగలమా? నిజానికి పరిస్థితి మెరుగుకాకపోగా కాలక్రమంలో మరింత దిగజారుతున్న దాఖలాలున్నాయి.

అవలక్షణాల గురించి మాట్లాడేటప్పుడు, మంచి లక్షణాలేవీ లేవా? అవలక్షణాలే ప్రధానమా? అనే ప్రశ్న వస్తుంది. మంచి లక్షణాలను ఏకరవు పెట్టి బ్రాకెట్లో అవలక్షణాలను సూచించే పద్ధతి నేను అనుసరించదలచుకోలేదని మొదట్లోనే చెప్పాను. అయినప్పటికీ ఏది ఎక్కువ అని అడిగితే వాటిని విడదీయడం కష్టం అనేది సమాధానం అవుతుంది. పీడిత ప్రజల హక్కులకు అండగా నిలబడడం, వారికి బలాన్ని ఇవ్వడం, పెత్తందారీ వర్గాలను వ్యతిరేకించడం ఎం-ఎల్ పార్టీల ఉద్యమాలలోని మంచి లక్షణం అనుకుంటే అవలక్షణాలు దానిని అంటిపెట్టుకొని, దానికోసం అనుసరిస్తున్న పద్ధతులను అంటిపెట్టుకొని ఉన్నాయి. కాబట్టి విడదీసి తూకంవేసి ఏది ఎక్కువ అని తేల్చడానికి ప్రయత్నించడంలో పెద్దగా అర్థం లేదేమో. అయినా తేల్చడం సాధ్యమేననుకున్నా, మంచి లక్షణాలే ఎక్కువ తూగినా, అవలక్షణాల తూకం తక్కువేమీ కాదు కాబట్టి ఆ విధంగా అనుకోవడం వల్ల పొందగల సంతృప్తి ఏమీ ఉండదు.

గ్రామ రాజకీయాలలో పెత్తనం కోసం పోటీపడే కాంగ్రెస్, టి.డి.పి. వంటి పార్టీల నాయకులు నక్సలైట్ మిలిటెంట్లనూ దళసభ్యులనూ తమవైపు తిప్పుకోవాలని చూస్తారు. వారికులం, వారికుటుంబానికి అంతకు ముందున్న రాజకీయ సంబంధాలు, ఆ నాయకుడు వారికి ఎరగా చూపించగల సహాయసహకారాలు మొదలయినవన్నీ ఇందుకు ఉపయోగపడతాయి. ఈ ప్రయత్నం అన్ని సందర్భాలలోను సఫలం అవుతుందని భావించనక్కర లేదుగానీ అది సఫలం అయి ఆ నాయకుడు గ్రామ రాజకీయాలలో తన ఆధిక్యత నిలబెట్టుకోవడంలో అన్నల అండ పొందిన సందర్భాలేకాక, అన్నలు అతని ప్రత్యర్థులపైన, లేక వారి ఆస్తిపైన భౌతిక దాడులు చేసిన సందర్భాలు కూడ చాలానే ఉన్నాయి. వరంగల్ జిల్లా భగీరథపేటలో బిజెపికి చెందిన ఎంపిటిసి ప్రోద్బలంతో పీపుల్స్‌వార్ మిలిటెంట్లు హత్యచేసిన మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి మరణం ఒక ఉదాహరణ. ఆదిలాబాద్ జిల్లా లక్ష్మణచాందాలో గ్రామసర్పంచ్ పితూరీలు విని పీపుల్స్‌వార్ సింగాపూర్ దళం హతమార్చిన టీచర్ చిన్నారెడ్డిది ఇంకొక ఉదాహరణ. వీళ్ళిద్దరికీ గ్రామంలో మంచి పేరుండడం వల్ల ప్రజలలో ఈ హత్యల పట్ల చాలా నిరసన వ్యక్తం అయింది. అందువల్ల (వాళ్ళిద్దరూ రెడ్డి కులస్తులూ మధ్యతరగతి రైతులూ కావడం వల్ల కూడ) ఆ హత్యల వెనక ఉన్న అసలు కథ బయటకు రాగలిగింది. హతులైన

వారికి అంతటి మంచిపేరు లేని చోట్ల, లేదా వారు ఎస్‌సి, బిసి కులాలకు చెందిన పేదలయిన చోట్ల, అవి ఎవరూ పెద్దగా పట్టించుకోని ఘటనలుగా మిగిలిపోతాయి. 'గ్రామ రాజకీయాలతో ఏదో సంబంధం ఉందంట' అని ఒక్క పీపుల్స్‌వారే కాదు, అన్ని ఎం-ఎల్ పార్టీలు చేసే హత్యల గురించి తరచుగా అంటుంటారు. వరంగల్ పట్టణానికి సమీపంలో ఉన్న గోపాలపురంలో పీపుల్స్‌వార్ చేతిలో చనిపోయిన దేవరాజు హత్యను ఇంకొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు పీపుల్స్‌వార్ మిలిటెంట్‌గా ఉండి బయటికొచ్చిన దేవరాజు ఆ తరువాత కూడ ఆ పార్టీ సానుభూతిపరుడిగానే కొనసాగాడు. పోలీసులు అనుమానించి విపరీతంగా హింసించినా ఆ పార్టీ కార్యకర్తలకు-జిల్లా స్థాయి నాయకులకు కూడ - షెల్టర్లు ఇవ్వడం మానుకోలేదు. కాగా, గ్రామ రాజకీయాలలో అతను గ్రామ మాజీ సర్పంచ్‌కు వ్యతిరేకంగా ఉన్నాడు. ఆ మాజీ సర్పంచ్ *(దళిత కులస్థుడయినప్పటికీ)* మొదటి నుండి నక్సలైట్ల వ్యతిరేకే కాబట్టి అతనితో దేవరాజుకు ఉన్న ఘర్షణ పట్ల అన్నలకు అభ్యంతరమేమీ లేదు. వారు దేవరాజును తప్పుపట్టింది లేదు, హెచ్చరించింది లేదు, అతని సహాయం తీసుకోవడం మానుకున్నది లేదు. గత సంవత్సరం అకస్మాత్తుగా ఒకరోజు అతని ఇంటికొచ్చి మాటా మంతీ లేకుండా అతనిని కాల్చి చంపారు. తన భర్త చరిత్ర మొత్తం పత్రికలవారికి విడమరచి చెప్పి నా భర్త ఏం తప్పు చేసాడో అన్నలు చెప్పాలి అని అతని భార్య విసిరిన సవాలుకు ఇప్పటికీ జవాబు లేదు. మాజీ సర్పంచ్ ఏదో ఒక విధంగా అన్నలను 'మేనేజ్' చేసుకున్నాడనేది బలమైన అనుమానం. అతని మనుమడు ఇప్పుడు పీపుల్స్‌వార్‌లో ఉన్నాడు. అతను తన ఇంటి రాజకీయాలను ఆ పార్టీలోకి తీసుకుపోయి తమ శత్రువును *(పార్టీకి మిత్రుడే అయినా)* చంపించినట్టున్నాడు.

కరీంనగర్ జిల్లా మంథని ప్రాంత కాంగ్రెస్ నాయకుడయిన శ్రీపాదరావు జీతగాడు శ్రీకాంత్ *(ఇది అతని అసలు పేరో కాదో తెలీదు)* పీపుల్స్‌వార్‌లో చేరి సికాస ఆర్గనైజర్ అయిన తరువాత కూడ శ్రీపాదరావుకు దగ్గరయిన వారితో సన్నిహిత సంబంధాలు పెట్టుకొని అంబేడ్కర్ సంఘాల కార్యకర్తలను హతమార్చాడు. దీనిని బహిరంగంగా ప్రశ్నించిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు రాజారాంను పీపుల్స్‌వార్ బెదిరించగా అతను కొంతకాలం మంథని విడిచిపెట్టి కరీంనగర్‌లో భయపడుతూ బ్రతకవలసి వచ్చింది. చివరికి పీపుల్స్‌వార్ జిల్లా కమిటీ తన తప్పు తెలుసుకొని శ్రీకాంత్‌ను బహిష్కరించి రాజారాంతో సర్దుబాటు చేసుకునే లోపల చాలా నష్టం జరిగింది. అదే జిల్లా హుస్నాబాద్ ప్రాంతంలో చాలా కాలంగా సిపిఐకి బలం ఉంది. ఒకప్పుడు సిపిఐ నాయకుల దాదాగిరీ కూడ అక్కడ సాగింది. దాని నెదుర్కొనడానికి ***(1980ల చివరి భాగంలో)*** స్థానిక తెలుగుదేశం కార్యకర్తలకు పీపుల్స్‌వార్ సహకరించింది. *(లేక సిపిఐని దెబ్బతీసి తాను రంగప్రవేశం చేయడానికి పీపుల్స్‌వార్ తెలుగుదేశం వారిని వాడుకుందా?)* త్వరలోనే ఆ ఘర్షణ సిపిఐ-పీపుల్స్‌వార్ ఘర్షణగా మారింది. ఆ తరువాత సర్దుబాటు అయింది. సిపిఐ పెద్దమొత్తం నష్టపరిహారంగా చెల్లించి శాంతి కొనుక్కుంది. అయితే అంతా సద్దుమణిగిందనుకున్న తరువాత, తొలినాటి ఘర్షణలలో సిపిఐ చేతిలో హతుడైన ఒక తెలుగుదేశం నాయకుని తమ్ముడు గౌరీశంకర్ పీపుల్స్‌వార్ హుస్నాబాద్ దళనాయకుడయ్యాడు. అప్పటి నుండి పాత కక్షను తవ్వితీసి సిపిఐ వారిని గడగడ

లాడిస్తున్నాడు. హుస్నాబాద్ ప్రాంతంలో పోలీసులు తమ పార్టీ పైన పెట్టే నిర్బంధాని కంతటికీ సి.పి.ఐ వారే మూల్యం చెల్లించాలని టోకుగా ప్రకటించాడు. దళ కమాండర్ స్థాయినుండి అతను ప్రమోషన్ పొంది జిల్లా కమిటీలోకి ప్రవేశించిన తరువాత కూడ అతనిని (ఎన్నో ఫిర్యాదులున్నప్పటికీ) అదే ప్రాంతం ఇన్‌ఛార్జీ చేయడం వల్ల అదే పరిస్థితి కొనసాగుతున్నది. (అధికారులకు స్వస్థలంలో పోస్టింగ్ ఇస్తే స్వప్రయోజనాలకు అఫీషియల్ డ్యూటీ ముద్ర వేస్తారన్న అనుమానంతో ప్రభుత్వం కొన్ని రకాల ఉద్యోగులకు స్వస్థలంలో పోస్టింగ్ ఇవ్వదు. శత్రువు నుండయినా మంచి నేర్చుకోవడంలో తప్పులేదని కమ్యూనిస్టులు అంటుంటారు కాబట్టి ఈ నియమాన్ని అన్నలు కూడ అలవర్చుకుంటే మంచిది.)

నల్గొండ జిల్లాలో పీపుల్స్‌వార్ ఇద్దరు మాజీ సర్పంచ్‌లను గ్రామ కుల కక్షల నేపథ్యంలో చంపింది. వెలువర్తి గ్రామ మాజీ సర్పంచ్ జనార్ధనరెడ్డి దళితులకు తాడిచెట్లెక్కడంలో తర్ఫీదు ఇచ్చి వాళ్ళకు కూడ కల్లు తీసే లైసెన్స్ ఇప్పించాలని ప్రయత్నం చేసాడు. కుల కట్టడిని వ్యతిరేకించే ఈ ప్రయత్నాన్ని నిజానికి కమ్యూనిస్టు లెవరయినా అభినందించాలి. సూత్రప్రాయంగా అభినందించడానికి పీపుల్స్‌వార్‌కు అభ్యంతరం ఉంటుందని నేను అనుకోను. కానీ జనార్ధనరెడ్డి ప్రయత్నంవల్ల కల్లు వ్యాపారం మీద తమకున్న గుత్తాధిపత్యం పోతుందన్న కోపంతో గౌడ కులస్తులు పీపుల్స్‌వార్‌ను ఆశ్రయించగా వారి తరపున పీపుల్స్‌వార్ రంగంలోకి దిగి జనార్ధనరెడ్డిని హతమార్చింది. అదే జిల్లా గోకవరంలో ఇదే విధంగా చెరువులో చేపలుపట్టే హక్కు బెస్తలకే గుత్త కానక్కరలేదనీ తమకు కూడ అందులో వాటా కావాలనీ తెనుగు కులస్థులు గొడవ చేసారు. సిపిఐ (ఎం)కు చెందిన ఆ గ్రామ మాజీ సర్పంచ్ జగన్నాధం బెస్తలకు అండగా నిలవగా పీపుల్స్‌వార్ తెనుగు కులస్తుల పక్షం తీసుకొని సిపిఐ (ఎం) మీద కక్షతో అతన్ని చంపింది. చాలా ఏళ్ళ కింద – పరిస్థితి ఇంతగా దిగజారని రోజులలోనే– నిజామాబాద్ జిల్లాలో ఇటువంటి ఘటన ఒకటి జరిగింది. గడ్కోల్ గ్రామంలో దళితులు ఒకసారి చాకళ్ళకు వ్యతిరేకంగా సమ్మె చేసారు. ఇతర కులస్తుల ఇళ్ళకు చాకళ్ళు పోయి బట్టలు తెచ్చుకుంటారుగానీ దళితులు మాత్రం తమబట్టలు తామే తీసుకుపోయి ఇచ్చి రావాలి. దీనికి నిరసనగా దళితులు ప్రజాపంథా (ఇప్పటి న్యూడెమోక్రసీ) తోడ్పాటుతో సమ్మె చేయగా ఇతర కులాలన్నీ వ్యతిరేకించాయి. పీపుల్స్‌వార్ మిలిటెంట్లు న్యూడెమోక్రసీ మీద ఉన్న వ్యతిరేకతతో సవర్ణుల పక్షం తీసుకొని దళితులపైన దాడి చేసి కొట్టారు.

**1996**లో నిజామాబాద్ జిల్లా మైలారంలో ఇంతకంటె ఘోరమైన ఘటన జరిగింది. ఆ గ్రామానికి చెందిన మాదిగ యువకుడు నూతుపల్లిరాజు సత్తెమ్మ అనే కాపుకులస్తురాలిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయి తల్లిదండ్రులు గొడవ పెట్టుకున్నారు. పీపుల్స్‌వార్ వాళ్ళు జోక్యం చేసుకొని తాము పరిష్కారం చేస్తామన్నారు. కొంతకాలం తరువాత ఒకరోజు వాళ్ళు ఇరుపక్షాలనూ గ్రామ ప్రజలనూ ఊరి బయట గుట్ట దగ్గరకు పంచాయతీకి పిలిచి రాజు రాగానే అతనిని పట్టుకొని విపరీతంగా కొట్టి చంపారు. ముందురోజు రాత్రి అన్నలు సత్తెమ్మ ఇంట్లోనే విశ్రాంతి తీసుకొన్నారనీ అక్కడినుండే బయలుదేరి వచ్చి పంచాయితీ పెడతామని చెప్పి మాటామంతీ లేకుండా రాజును కొట్టి చంపారనీ రాజు తండ్రి అభియోగం.

ఇది పూర్తిగా నిజమైనా కాకున్నా సత్తెమ్మ తలిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెను పెండ్లి చేసుకున్న 'నేరానికి' వాళ్ళు రాజును కొట్టి చంపారనేది వాస్తవం.

ఈ నాలుగు సంఘటనలలో మూడింటిలో పీపుల్స్‌వార్ కులం కట్టుబాట్లను కాపాడే సంస్థగా కనిపిస్తుంది. కానీ అసలు విషయం అది కాదు. కులం గురించి మన ఎం-ఎల్ పార్టీలకు (ఒక్క జనశక్తిని మినహాయించి) అవగాహన ఏమీ లేదుగానీ మరీ కులవ్యవస్థను కాపాడాలనుకునే దుస్థితిలో ఏ పార్టీ లేదు. ఈ పార్టీలు కులాంతర వివాహాలు చేయించి ఉన్నాయి. అంటరానితనానికి వ్యతిరేకంగా దళితులను కదిలించిన ఘటనలూ ఉన్నాయి. ఇక్కడ సమస్య అదికాదు. గ్రామంలోని రాజకీయ కక్షలలోను విభిన్న ప్రజా సమూహాల మధ్య నున్న ఘర్షణలలోనూ న్యాయాన్యాయాల విచక్షణ లేకుండ ముఠాతత్వంతో (తమదగ్గరికి ఎవరు ముందు వస్తే వారిని సమర్థించడం, లేదా తమ రాజకీయ ప్రత్యర్థులు ఒక పక్షం తీసుకుంటే తాము మరో పక్షం తీసుకోవడం, లేదా తమ కార్యకర్తలకు ఆ గ్రామంలో ఉండే సామాజిక సంబంధాలనుసరించి (కులం దీనిలో ఒక విషయం కాగలదు) నిర్ణయం చేయడం వగైరా) వ్యవహరించే అవలక్షణం ఇక్కడ ప్రధాన విషయం.

కార్యకర్తల వ్యక్తిగత కక్షలు లేక ప్రయోజనాలు దళ చర్యలకు దారి తీసిన ఘటనలు కూడ ఉన్నాయి. గాదంపల్లిలో లంబాడా సీతారాం హత్య, గోపాలపురంలో దేవరాజు హత్య ఇప్పటికే ఇచ్చిన రెండు ఉదాహరణలు. కరీంనగర్ జిల్లా మాణిక్యాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ రాంనారాయణను పీపుల్స్‌వార్ హుస్నాబాద్ దళం వేధించిన ఘటన ఇంకొక ఉదాహరణ. రాంనారాయణ నిజాయితీ పరుడు, ప్రజాదరణ గలవాడు. ఒకప్పుడు పౌరహక్కుల సంఘంలో (పీపుల్స్‌వార్ ప్రేరణతోనే) పని చేసాడు. అతనిని ఇన్‌ఫార్మర్ అనీ అవినీతి పరుడనీ పీపుల్స్‌వార్ నిందించిన తరువాత అతని గురించి మీ అభిప్రాయం ఏమిటని మాణిక్యాపూర్ గ్రామ దళితులను అడిగితే 'అన్నలు రామన్నకు ఏమైనా చేస్తే మేము రామన్న ఫోటో కట్టి ఇంట్లో పెట్టుకుంటాం' అని జవాబు చెప్పారు. ఈ ప్రజాదరణ తనకుందన్న విశ్వాసంతోనే రాంనారాయణ చాలా ఏళ్ళకింద అప్పటికి హుస్నాబాద్ దళ సభ్యుడిగా మాత్రం ఉన్న గౌరీశంకర్ ప్రవర్తన గురించి అప్పటి దళ కమాండర్‌కు ఫిర్యాదు చేసాడు. ఆ యువకుడికి మందలింపులు తగిలాయి. గౌరీశంకర్ దళనాయకుడిగా ఎదిగిన తరువాత, మాణిక్యాపూర్‌లో రాంనారాయణ కుండే ప్రజాదరణకు ఓర్వలేని వ్యక్తులకు దగ్గరయి, రాంనారాయణ సర్పంచ్‌గా ఉన్నప్పటి ఖర్చుల అకౌంట్‌లు చూపించలేదనీ, ఇన్‌ఫార్మర్ అనీ నిందవేసి గ్రామంలో ఉండలేని పరిస్థితి కల్పించాడు. ఖర్చుల అకౌంట్ చూపిస్తానంటే అవకాశం ఇవ్వకుండ అతని మీద నింద మాత్రం కొనసాగిస్తున్నారు. ఈ మధ్య దళం ఆ గ్రామంలో మీటింగ్ పెట్టి అదే ఆరోపణ మళ్ళీ వేయగా కొందరు యువకులు స్పందించి 'అతను అకౌంట్‌లు చూపిస్తాడు గానీ ప్రజలకు మీరేం చేసారో చెప్తారా' అని నిలదీసారు. దానికి ప్రతీకారంగా ఆ తరువాత కొన్ని రోజులకు దళం ఊరిలోకి వచ్చి ఆ యువకులను తన్ని పోయింది.

దళాలు లేక దళ సభ్యులు వ్యక్తిగత కక్షల వల్ల చేసే దాడులకు ఇంతకంటె నీచమైన కారణాలు ఉండగలవు. వరంగల్ జిల్లా పెదపెండ్యాలలో రాజయ్య అనే చాకలి కులస్తుడి

భార్యతో ఒక పీపుల్స్‌వార్ కార్యకర్తకు లైంగిక సంబంధం ఉండింది. రాజయ్యకు తెలిసి గొడవ పెట్టుకోగా ఆ కార్యకర్త అతనిని చంపి (ఈ పని ఒంటరిగా చేసి ఉండలేడు), శవానికి బరువులు కట్టి ఊరి చెరువులో దించాడు. ఆరునెలల దాకా అతనేమయ్యాడో ఎవరికీ తెలియదు. ('చంపితే చంపారుగానీ కనీసం శవాలయినా తలిదండ్రులకియ్యరా' అని ఎన్‌కౌంటర్ మృతుల శవాల స్వాధీన కమిటీ కార్యక్రమాలలో చాలామంది ప్రజాతంత్ర మేధావులు ఉపన్యాసాలిచ్చారు. పోలీసుల చట్టవిరుద్ధమైన ప్రవర్తనను విమర్శించడం సబబేగానీ ఇటువంటి మానవీయమైన సెంటిమెంట్లు తీసుకొచ్చి విమర్శించడంలో ఉన్న ఇబ్బందేమిటంటే అన్నలు సహితం వాటిని పెద్దగా ఖాతరు చేయరు, ప్రజాతంత్రవాదులు వారినేమీ అనలేరు.) వేసవి వచ్చిన తరువాత అతని శవం జాలర్లకు దొరికి హత్య సంగతి బయటపడింది. మృతుడి దగ్గరి బంధువులు సహితం పీపుల్స్‌వార్‌తో సంబంధాలున్న వారు కావడంతో వారు ఈ ఘోరాన్ని ఆ పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకుపోయారు. అయితే అప్పటికే ఆ దళ సభ్యుడు ఎన్‌కౌంటర్‌లో చనిపోయి ఉండడంతో కథ ముగిసింది. ఈ హంతకుడికి ఏ విప్లవ కవో ఒక అమరగీతం రాసే ప్రమాదం ఉంది కాబట్టి అతని పేరు మునగాల రవి అని చెప్పాలి.

## 6

ఆధిపత్య రాజకీయాలలో న్యాయాన్యాయాల కంటె తమ సత్తా చూపించడం, తమ మాటంటే భయం ఉండేటట్లు చూసుకోవడం చాలా ముఖ్యం. టెర్రర్ ముఖ్యం. హింస న్యాయంగానే ప్రయోగిస్తే టెర్రర్ ఉండదు. తమ మాట శాసనంగా చలామణి కావడానికి అవసరమైన భీతి ఉండాలంటే 'అవసరమనుకుంటే హింస అన్యాయంగా ప్రయోగించడానికి కూడ వెనుకాడరు' అన్న గుర్తింపు ఉండాలి. కొంతయినా విచ్చలవిడి లక్షణం లేని హింస – పూర్తిగా న్యాయసమ్మతమైన హింస–టెర్రర్ పుట్టించదు. టెర్రర్ లేనిదే ఒకరి మాట శాసనంగా చలామణి కాదు. ఎనిమిది లేక తొమ్మిది ఏళ్ళ కింద, యథేచ్ఛగా నిర్బంధకాండ కొనసాగిస్తున్న ప్రభుత్వానికి షాక్ తినిపించడం కోసమా అన్నట్టు ప్రజలలో మంచిపేరున్న ఒక ప్రజాప్రతినిధిని పీపుల్స్‌వార్ హతమార్చినపుడు (తాడిచర్ల మండలాధ్యక్షుడు మల్హర్‌రావో లేక కేశవపట్నం మండలాధ్యక్షుడు గాజుల శంకరయ్యో జ్ఞాపకం లేదు – మొత్తానికి కరీంనగర్ జిల్లాలో జరిగింది) అతను కాళ్ళావేళ్ళాపడి 'నేనెప్పుడూ ఎవరికీ హాని చేయలేదుకదా, నన్నెందుకు చంపుతారు' అని ప్రాధేయపడగా, 'మంచివాణ్ని చంపితేనే ఈ ప్రభుత్వం కదులుతుంది కాబట్టి నీలాంటివాడినే చంపాలి' అని సమాధానం చెప్పి చంపారు. (మల్హర్‌రావును తాడిచర్ల ప్రాంతవాసులు ఇప్పటికీ అభిమానంగా జ్ఞాపకం చేసుకుంటారు. 'ఈ ప్రాంతానికి మేలు చేసిన నాయకుడెవరైనా ఉంటే అది మల్హర్‌రావే' నంటారు.)

'న్యాయంగా అడిగితే వినకపోయినట్టయితే అన్యాయంచేసి మా సంగతేమిటో చూపిస్తాం' అనే ఈ వైఖరి ఇప్పటికీ సజీవంగానే ఉన్నట్టుంది. ప్రస్తుత తెలుగుదేశం పాలనలో అమలవుతున్న నిర్బంధానికి నిరసనగా పీపుల్స్‌వార్ ఎక్కడికక్కడ గ్రామమండల పంచాయితీ స్థాయి తెలుగుదేశం నాయకులను హతమారుస్తున్నది. ఆ స్థాయి నాయకులు ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలన్నా ఆపలేరు కాబట్టి వారిని బాధ్యులు చేసి చంపడం అన్యాయం అన్న సంగతి అటుంచి,

ఇప్పటికి ఈ క్రమంలో చనిపోయిన వారిలో చాలామంది (నల్గొండలో మోహన్‌రెడ్డి, వరంగల్‌లో పులిగిల్ల అంజయ్య, మెదక్‌లో దుబ్బాక గ్రామ సర్పంచ్ శ్రీరాం వెంకటేశ్వర్లు, చివరికి ఆదిలాబాద్‌లో ఖానాపూర్ సర్పంచ్ విలాసరావు దేశ్పాండే కూడ) ప్రజలలో మంచి పేరున్నవారే తప్ప దుర్మార్గులు కారు. వారు నిజానికి చనిపోయేదాకా అన్నలకూ మిత్రులే. ఈ హత్యలపట్ల స్థానిక ప్రజలలో చాలా నిరసన వచ్చింది. కానీ పీపుల్స్‌వార్ అంటే భయం పెరిగింది. నిన్నటిదాకా ఉపయోగించుకున్న మనిషిని ఈ రోజు చంపగలరు. ప్రజలలో మంచి పేరుంది కదా-లేదా అన్నలు చేయమన్న పనులన్నీ చేసాను కదా-నాకేం భయం అన్న భరోసా ఎవ్వరికీ ఉండనివ్వరు. ప్రజలు తమ నిరసన మరచిపోతారుగానీ ఈ భయం జ్ఞాపకం ఉంటుంది.

మొన్నటి పార్లమెంటు ఎన్నికలరోజు (ఫిబ్రవరి 22న) విశాఖపట్నం జిల్లా చింతపల్లి ఏజెన్సీలో మందుపాతర పేల్చి 8 మంది ఆదివాసీలను చంపిన పీపుల్స్‌వార్ చర్యను ఇక్కడ ఉదహరించ వచ్చును. (వారిలో ఏడుగురు మాత్రమే మందు పాతరలో చనిపోయారనీ, ఎనిమిదవ వ్యక్తిని పోలీసులు పట్టుకొని కొట్టి చంపారని ఒక అభియోగం ఉంది.) పోలింగ్ అయిపోయిన తరువాత వోట్లున్న పెట్టెలు వెనక్కి తీసుకొచ్చేటప్పుడు నక్సలైట్లు తమపైన దాడి చేస్తారేమోనన్న భయంతో పోలీసులు వాహనాలపైన కాక కాలినడకన (మందుపాతరలు తప్పించుకోవడానికి) రావడమే కాక, తమతోపాటు పెద్ద సంఖ్యలో ఆదివాసీలను కూడ తీసుకొనిపోయారు. 'గిరిజనులు కవచంగా ఉంటే అన్నలు దాడి చేయరు' అన్నది వారి ధీమా. ప్రజలను బలవంతంగా కవచంగా వాడుకోవడం దుర్మార్గమైన ఆలోచన. కానీ ఆ ప్రాంతంలో పనిచేసే పీపుల్స్‌వార్ కోరుకొండ దళనాయకుడు అంత సులభంగా వెనక్కి తగ్గదలచుకోలేదు. ఆ ఎత్తుగడను సాగనిస్తే రాజ్యంపైన తాము చేస్తున్న పోరులో ఒక్క అడుగు వెనక్కి తగ్గడం అవుతుందనుకున్నాడేమో. కాబట్టి కళ్ళారా చూస్తూ కూడ మందుపాతర పేల్చి ఎనిమిది మంది ఆదివాసీనులను పొట్టన బెట్టుకున్నాడు. (అప్పటికింకా వెల్తురు బాగానే ఉంది. మందుపాతర పేల్చేవాళ్ళు తాము ఎవరిని చంపుతున్నదీ చూసేంత దూరంలోనే ఉన్నారు.)

ఆ తరువాత ఆ ప్రాంత పీపుల్స్‌వార్ బాధ్యుడు జాంబ్రి ఇచ్చిన మొదటి ప్రకటనలో ఆ గిరిజన కుటుంబాలకు కనీసం 'సారీ' చెప్పలేదు. పైగా, పోలీసులు కవచంగా వాడుకోవడానికి రమ్మంటే ఇక మీదట పోవద్దనీ ప్రతిఘటించమనీ గిరిజనులకు పిలుపునిచ్చాడు. కవచంగా వాడుకోవడం ద్వారా పోలీసులే ఆ గిరిజనుల చావుకు కారణం అయ్యారన్నాడు. పైకి చెప్పకపోయినా దీని భావం ఏమిటంటే 'మీరు కవచంగా ఉపయోగపడితే మేము చంపుతాము జాగ్రత్త' అని హెచ్చరించడం. (నక్సలైట్లకూ పోలీసులకూ మధ్య ప్రజలు నలిగి పోతున్నారు అనడం తప్పు అని ఈ రాష్ట్రంలోని ప్రజాతంత్రవాదులు చాలామంది నమ్ముతారు. మొత్తంగా నక్సలైట్ ఉద్యమప్రాంతాల పరిస్థితిని వర్ణించడానికి అది తగిన ప్రయోగం కాదుగానీ ఇటువంటి ఘటనలకు అది తగిన వివరణే.)

ఆ తరువాత పీపుల్స్‌వార్ నాయకులెవరో జాంబ్రిని తప్పు పట్టినట్టున్నారు. కొన్ని రోజుల తరువాత, తమ చేతిలో చనిపోయిన గిరిజన కుటుంబాల నుండి క్షమాపణ కోరుకుంటూ అతను ప్రకటన జారీ చేసాడు. అయితే అతనిని తప్పుపట్టిన నాయకులు

ఎనిమిది మంది ఆదివాసీల ప్రాణాలు తీసినందుకు కోరుకొండ దళనాయకునిపైన ఏ చర్యయినా తీసుకుంటారా? (అందరమూ ఈ నాటికీ ఎలుగెత్తి ఆందోళన చేస్తున్న చుండూరు మారణకాండలో చనిపోయింది కూడ ఎనిమిది మంది దళితులేనని ఒకసారి జ్ఞాపకం చేసుకుందాం.) కనీసం 'శాఖాపరమైన' చర్యలైనా (రాజ్యం వ్యవహారాలకు వర్తించే భాష ప్రత్యామ్నాయ రాజ్యప్రయత్నాలకు కూడ వర్తిస్తుంది మరి) తీసుకుంటారా? అంటే దళ నాయకుడి స్థాయి నుండి 'డిమోట్' చేస్తారా? ఇది చిన్న చర్యే. కానీ రాజ్యం తనంతట తాను ఇంతకంటే పెద్ద చర్యలు తీసుకోదని మనకు పోలీసు శాఖ వ్యవహారాల నుండి తెలుసు. రేపు రాజ్యం కాగోరేవారు కూడ అంతే. బలప్రయోగ సామర్ధ్యానికి కేంద్రస్థానం ఇచ్చేవారు నిర్విచక్షణగా బలప్రయోగం చేసిన ఉద్యోగులకయినా కార్యకర్తలకయినా కఠిన శిక్షలు వేయలేరు, వేయరు. వేస్తే వ్యూహం దెబ్బతింటుంది. ఎం-ఎల్ పార్టీలు అవినీతి వంటి ఇతర ఆరోపణలున్న కార్యకర్తలను బహిష్కరించడం జరిగిందిగానీ దుందుడుకుతనంతో అతిగా బలప్రయోగానికి పాల్పడిన వారిపైన చర్యలు తీసుకోవడం అరుదు. మహా అయితే కమాండర్ స్థాయి నుండి దళ సభ్యుడి స్థాయికి తగ్గిస్తారు. కానీ ప్రజలకు మొదటిదాని కంటె రెండవదే ఎక్కువ నష్టకరం కావచ్చు. ఈ విషయంలో పోలీసు శాఖతో పోలిక చూడకుండ ఉండలేము. పోలీసు శాఖ కూడ అప్పుడప్పుడు శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ ఉంటుంది. అయితే అవినీతి లేక క్రమశిక్షణా రాహిత్యానికి సంబంధించిన కేసులలోనే తప్ప చిత్రహింసలు, లాకప్ హత్యలు, నిష్కారణంగా కాల్పులు జరిపిన కేసులలో కాదు.

నిజామాబాద్ జిల్లాలో జరిగిన ఒక ఘటనను ఇక్కడ ప్రస్తావించాలి. గత సంవత్సరమో అంతకు ముందు సంవత్సరమో హైదరాబాద్‌లో జరిగిన ఏపిటిఆర్‌ఎఫ్ సభకు జనాన్ని పంపించడానికి వాహనాలు ఏర్పాటు చేయమని పీపుల్స్‌వార్ తెలంగాణ జిల్లాలలో గ్రామీణ నాయకులకు ఆదేశం జారీ చేసింది. (ఈ విధంగా ఆదేశాలు జారీ చేయడం, వాటిని పాటించనివారిని దండించడం పీపుల్స్‌వార్‌కు అలవాటే. జనశక్తివాళ్ళు కూడ ఈ పద్ధతి అలవరచుకున్నట్టున్నారు. ఆ విధంగా జనాన్ని తరలించిన సభలలో-ఆ జనం అయిష్టంగా వస్తారని కాదు-మాబోటి ప్రజాతంత్రవాదులు స్టేజెక్కి ప్రజాతంత్ర విలువల గురించి ఉపన్యాసాలిస్తుంటాము.) రామారెడ్డి గ్రామానికి చెందిన రంగు నారాగౌడ్, ఆదేశించిన ప్రకారం ఆ ఊరి జనం హైదరాబాద్ పోవడానికి బస్సు ఏర్పాటు చేసాడు గానీ హైవే మీద పోలీసులు బస్సును ఆపి వెనక్కి పంపించేసారు. నారాగౌడ్ తప్పేమీ లేకపోయినప్పటికీ జనాన్ని అతనే కావాలని పంపలేదని చెప్పి ఆ ప్రాంత దళం అతనిని కొట్టి చంపింది. ఈ హత్య గురించి చాలా గొడవ అయింది. బహుశా దీనికి శిక్షగానే నేమో ఆ దళ నాయకురాలు సునీతను దళ సభ్యురాలి స్థాయికి డిమోట్ చేసినట్టు ఈ మధ్య వార్తలొచ్చాయి. అయితే ఆమె దుందుడుకు ప్రవర్తన గురించి వేరే ఫిర్యాదులు కూడ ఉన్నాయి కాబట్టి కారణం వేరే కావచ్చు.

ఎవరి మీదనయినా దాడి చేసేటప్పుడు విపరీత బలప్రయోగం చేయడం కూడ ఆధిపత్య పోరుకు అవసరమైన టెర్రర్‌లో భాగమే. కత్తితో ఒక పోటు పొడిచి చంపారనో తుపాకితో ఒక తూటా కాల్చి చంపారనో వింటే ఎక్కువ భయం కలగదు. బండరాళ్ళు ఎత్తి

మీద వేసి ఒళ్ళు విరగ్గొట్టి చంపారని విన్నప్పుడు, నడుముకు గ్రనేడ్ కట్టి పేల్చి మనిషిని తుత్తునియలు చేసారని విన్నప్పుడు, ఇనప రాడ్లతో ఒళ్ళంతా విరగ్గొట్టి - లేదా గొడ్డలితో తెగనరికి - భార్యాపిల్లల సమక్షంలో పడేసి 'పొద్దున్న దాకా ఆస్పత్రికి తీసుకుపోవడానికి వీల్లేదని' శాసించిపోగా ఊళ్ళో జీవు ఉన్నప్పటికీ ఆ సాహసం చేయలేక అయిన వాళ్ళందరూ నిస్సహాయంగా విలపిస్తుండగా తెల్లవారే లోపల విలవిలలాడి చనిపోయాడని విన్నప్పుడు, ఒళ్ళు జలదరించే భయం పుడుతుంది. ఈ పని చేయగల వాళ్ళపైన 'భయభక్తులు' చాలా పెరుగుతాయి. శవాల శకలాలు చెట్టు కొమ్మలకు వేళ్ళాడే మందు పాతర హత్యల దృశ్యం అదే అనుభూతి కలిగిస్తుంది. 'చంపాలని కొట్టలేదు. కొడితే చచ్చిపోయాడు' అని నక్సలైట్లు వివరణ ఇవ్వడం పేపర్లలో చదువుతుంటాం. (ఈ రకమైన వివరణలు ఇచ్చి - ఒకసారికాదు, పదే పదే - తప్పించుకునే ప్రివిలేజ్ ప్రపంచంలో అతి కొద్దిమందికి ఉంటుంది.) వాళ్ళు అంత క్రూరంగా కొడతారు మరి. ఇనపరాడ్లతో కొడతారు, గొడ్డళ్ళతో నరుకుతారు. ఒకప్పుడు చేతులు కాళ్ళు తెగనరికేవారు. కానీ పోలీసులు ఈ వికలాంగులను ఇక్కడా అక్కడా ప్రదర్శించి నక్సలైట్లకు చెడ్డపేరు తేవడం మొదలుపెట్టాక అది మానుకున్నారు. కానీ కర్రలతో బండరాళ్ళతో లేక ఇనపరాడ్లతో పక్కటెముకలు, కాలి ఎముకలు విరిగేలాగ చావ బాదడం వారికి అతి ప్రియమైన శిక్షగా ఉండిపోయింది.

పోలీసుల హింసలోని చట్టవిరుద్ధమైన అంశాలను విమర్శించడం సబబేగానీ సున్నితమైన మానవీయ విలువలను ప్రస్తావించడం, 'శవాన్నయినా చూసుకోనివ్వరా?' 'ఆప్యాయంగా కన్నీళ్ళు పెట్టనివ్వరా?'అని అడగడం - కొంచెం ఇబ్బందికరం అని పైన అన్నాను. ఉదాహరణకు తాము చంపదలచుకున్నవారి ఆత్మీయుల మానసిక అనుభూతుల పట్ల ఏ కొంచెం గౌరవం ఉన్నా ముఖం పగిలిపోయి మనిషిని గుర్తుపట్టలేని పద్ధతిలో చంపరు. కానీ గొడ్డలితోనో బండరాళ్ళతోనో తలపగల గొట్టి, ముఖం నుజ్జు నుజ్జు చేసి చంపడమే కాక తుపాకితో కాల్చి చంపేటప్పుడు కూడ ఛాతిలో కాల్చకుండ గడ్డం కింద కాల్చి ముఖం మొత్తం పేల్చేయడం నక్సలైట్లు చేసే హత్యలలో తరచుగా కనిపించే వికృత దృశ్యం. ఈ మధ్య మెదక్ జిల్లాలో పీపుల్స్‌వార్ చంపిన రవీందర్‌రెడ్డి ముక్కు పుటలలో తపంచా పెట్టి తల ఎగిరి పోయేలాగ కాల్చడమే కాక కాలిపోయి ఎగిరిపోయిన పుర్రెలో అతనిని ఎందుకు చంపారో చెప్పే చిట్టీ పెట్టి పోయారు. ఎంత వికృతమైన మానసిక స్థితి ఉన్నవాళ్ళు కాకపోతే ఈ పని చేయగలరు?

ఈ అతి క్రూరత్వాన్ని ప్రశ్నిస్తే అది 'వర్గకసి' అనీ 'మీ బోటి మధ్యతరగతి మేధావులకు అర్థం కాదు' అనీ జవాబు చెప్తారు. చనిపోయినవాడు చంపినవాడిని ఒక జీవితకాలం వేధించి ఉంటే ఈ క్రూరత్వాన్ని అర్థం చేసుకోగలము. సమర్థించినా సమర్థించకపోయినా సానుభూతి చూపించగలము. చనిపోయేవాళ్ళంతా దోపిడీదార్లయితే కూడ, నక్సలైట్ కార్యకర్తలు ఎక్కువగా కింది కులాలకూ వర్గాలకూ చెందినవారు కాబట్టి ఈ కసిని అర్థం చేసుకోగలము. కానీ నక్సలైట్లు చేసే హత్యలలో (ఎప్పుడో అరుదుగా తప్ప) చంపేవారికీ చంపబడేవారికీ వ్యక్తిగత సంబంధమేమీ ఉండదు. అవన్నీ ఒక రాజకీయ నిర్ణయం ఫలితంగా చేసే హత్యలే. పోనీ మృతులందరూ దోపిడీ వర్గాలకూ కులాలకూ చెందినవారా అంటే ఒక మైనారిటీ

మాత్రమే ఆ కోవకు చెందినవారు. మెజారిటీ ఎస్‌సి ఎస్‌టి బిసి కులాలకు లేక పేద, మధ్య తరగతి వర్గాలకు చెందినవారే. నక్సలైట్లు చేసే హత్యలలో చంపేవారూ చచ్చేవారూ మొత్తం మీద (కొన్ని మినహాయింపులతో) ఒకే సామాజిక శ్రేణులకు చెందినవారే. (ఒక్క నక్సలైట్లేకాదు అన్ని సాయుధ పోరాట ఉద్యమాలూ తమ సామాజిక పునాదినే ఎక్కువగా కబళిస్తాయనేది ఒక ఇబ్బందికరమైన వాస్తవం.) అయినప్పటికీ హత్యలు చేసేటప్పుడు,'దేహశుద్ధి' చేసేటప్పుడు, ఇంత క్రూరంగా వ్యవహరించడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? తమ పట్ల సమాజంలో 'భయభక్తులు' పెంచే ఉద్దేశ్యం దానికి కారణం కాదనుకుంటే క్రూరత్వాన్ని ఎంజాయ్ చేసే బాపతు మనుషులు ఈ పార్టీలలో చేరుతున్నారనుకోవాలి. రెండూ కొంత నిజమే ననుకుంటాను. హింసను అదే పనిగా ప్రయోగించే ఉద్యమాలు బలప్రయోగాన్నీ బలప్రయోగ అధికారాన్నీ ఆరాధించే స్వభావం గల మనుషులను ఆకర్షించే ప్రమాదం ఉంది. తమ కార్యకర్తలలో ఆ గుణాన్ని పెంపొందించే ప్రమాదమూ ఉంది. ఇది మిలిటెంట్లకే కాదు, మేధావులకూ వర్తిస్తుంది. (మిలిటెంట్లకు మాత్రమే చెడ్డపేరు వచ్చినప్పటికీ) మన రాష్ట్రంలో సాయుధ కమ్యూనిస్టు రాజకీయాల ఫలితంగా బలప్రయోగాన్ని ఆరాధించే (ఎంజాయ్ చేసే) మిలిటెంట్లే కాక ప్రజాతంత్రవాదులు కూడ చాలామంది తయారయ్యారు. వాళ్ళకు వేరే రాజకీయాలుగానీ ఆదర్శాలుగానీ ఉండవనలేము. కానీ ఆదర్శాలు ఎక్కడ అంతమవుతాయో బలప్రయోగంతో ఆధిక్యతను నిలబెట్టుకునే సత్తాను అభిమానించే గుణం ఎక్కడ మొదలవు తుందో చెప్పడం కష్టం. ('నేను మందుపాతరనయి పేలుతాను', 'నేను తుపాకీ తూటానవుతాను' అంటూ విరసం కవులు రాస్తున్న కవిత్వం చదివినప్పుడల్లా ఇందులో విప్లవం ఎంత, సాడిజం ఎంత అన్న సందేహం కలుగుతుంది.)

మనం ఉపయోగించే సాధనాలు మన లక్ష్యానికి ఉపకరణాలు మాత్రమే కాదు. అవి తిరిగి మనమీద ప్రభావం వేస్తాయి. మన సమాజం మీద ప్రభావం వేస్తాయి. ఎవరెవరు ఈ 'మనం' అనేదానిలో భాగమవుతారో నిర్ణయిస్తాయి. 'మనం' రేపు ఏమవుతామో నిర్ణయిస్తాయి. (సున్నితమైన మనసున్న అమాయకులుగా ఎం-ఎల్ పార్టీలలోనూ వాటి ప్రజాసంఘాలలోనూ వాటి మేధావి సంఘాలలోనూ చేరి కొన్నాళ్ళకు కఠినంగా, వికృతంగా, క్రూరంగా, కపటంగా తయారయిన వాళ్ళను ఎంత మందిని చూడడం లేదు?.) కాన్షీరాం, లల్లూప్రసాద్ యాదవ్‌లనుండి నక్సలైట్లదాకా ఈ దేశాన్ని విప్లవీకరిస్తామని ముందుకొస్తున్న వారెవ్వరిలోనూ ఈ స్పృహ లేకపోవడం ఈ దేశంలో అభ్యుదయ రాజకీయాలకు పట్టిన దుర్గతి. కాన్షీరాం అవకాశవాద చాతుర్యాన్నీ వీరి బలప్రయోగ సామర్థ్యాన్నీ అభిమానించగల మేధావులు చాలామంది తయారయ్యారంటే ఆలోచనాపరులు ఎంత అనాలోచితంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది.

ఈ మధ్య విశాఖపట్నం ఏజెన్సీలో పీపుల్స్‌వార్ తాండవ దళం ఇద్దరు ఆదివాసీలను కిడ్నాప్ చేసి తీసుకుపోయి పత్రికా విలేకరులను పిలిచి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టింది. ఆ యిద్దరి చేతా తాము పోలీస్ ఇన్‌ఫార్మర్లని చెప్పించింది. వారి ఒప్పుకోలు ముగిసిన తరువాత, వారిలో ఒకరిని చంపదలచుకున్నాం అని దళం విలేకరులకు చెప్పి (అతను వింటుండగానే) 'ఫలానా రోజు చంపుతాం' అని ముహూర్తం ప్రకటించింది. తరువాతి రోజు ఆ విషయం పేపర్లలో

వచ్చింది. ఆ తరువాత-ముందుగా ప్రకటించిన తేదీన-ఆ గిరిజనుడిని దళం కాల్చిచంపింది. అతనిని చంపడానికి ఈ డ్రామా అంతా అక్కరలేదు. అమాయకులపైన ఇన్‌ఫార్మర్ అన్న ముద్రవేసి చంపుతున్నారన్న ఆరోపణను ఎదుర్కొనడానికి అతని చేతనే చెప్పించారని అనుకోలేం. ఎందుకంటే దళం అతన్ని కిడ్నాప్ చేసి తీసుకుపోయి తన కస్టడీలోనే ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టిస్తే అతను ఇచ్చే ఒప్పుకోలుకు పెద్దగా విశ్వసనీయత ఉండదు. మరి ఎందుకు చేసినట్టు?

పిల్లి ఎలకతో చెలగాటమాడినట్టు బంధించిన వ్యక్తి చేతనే పత్రికా ముఖంగా నేరం ఒప్పించి అతనిని ఫలానరోజు ఫలాన వేళకు చంపుతామని ప్రకటించి సరిగ్గా అదే రోజు అదే టైంకు చంపడంలో భీతిగొలిపే దక్షత, ఎఫిషియెన్సీ ఉంది. ఆ ప్రయోజనం కోసం అయి ఉండాలి. అంతేకాక ఈ ప్రదర్శనాత్మక హింసలో ఒక వికృతమైన ఆనందం కూడ ఉండి ఉండాలి. ఆ పీపుల్స్‌వార్ దళ నాయకుడిలో అటువంటి వికృతమైన గుణం లేకుంటే బందీ మనోభావాలు గ్రహించగలిగేవాడు కాడా? నిజానికి గ్రహించకుండ ఉంటాడనుకోను. గ్రహించి కూడ ఆ పని చేయడంలో సాడిజం లేదా? పోనీ అతనేమయినా దశాబ్దాలుగా ఆదివాసీలను పీడించిన పరాయి మనిషా అంటే కాదు. ఇన్‌ఫార్మర్ అయి ఉండవచ్చునేమో గానీ పేద గిరిజనుడే. (నాకు తెలిసి విశాఖపట్నం ఏజెన్సీలో ఇప్పటిదాకా పీపుల్స్‌వార్ చేతిలో చనిపోయిన వారంతా గిరిజనులే. మినహాయింపులేవయినా ఉంటే ఎవరయినా చెప్తే సంతోషిస్తాను.) అందువల్ల ఈ సాడిస్టు ప్రవర్తనను 'వర్గకసి' అనుకోలేము.

పోలీసులు ప్రజలను కొట్టినప్పుడు 'స్త్రీలు పిల్లలు అని చూడకుండ కొట్టారు' అంటూంటాం. అంటే అర్థం ఎదిగిన మగవాళ్ళను కొడితే ఫరవాలేదని కాదు. తమను తాము రక్షించుకోలేని వారిని, ఎదురు తిరిగి దాడి చేయలేనివారిని కొట్టడం మరీ అన్యాయమని. అందుకే పీపుల్స్‌వార్ నిజామాబాద్ జిల్లా నాయకులు సరళను చంపినప్పుడు ఎప్పుడూ లేనంత విమర్శ వచ్చింది. ఆ అమ్మాయి విప్లవం గురించి రొమాంటిక్‌గా ఊహించుకొని పీపుల్స్‌వార్‌లో చేరుదామనిపోతే అనవసరంగా అనుమానించి చంపారనేది చాలామంది అభిప్రాయం. ఒకవేళ ఆమె పోలీస్ ఏజెంట్ అని వారు నిజంగానే అనుమానించినా, అప్పటికామె తెలుసుకున్న విషయాలూ ఛేదించిన రహస్యాలూ ఏమీ లేవు కాబట్టి 'నీసంగతి మాకు తెలిసింది' అని చెప్పి పంపించేసి ఉండవచ్చు కదా? చంపడం ఎందుకు? తమ సత్తా ఏమిటో చూపించాలన్న దర్పం కాకపోతే.

'స్త్రీలను సహితం కొట్టారు' అనిపించుకోవడానికి నక్సలైట్ దళాలకు ఇప్పుడు అభ్యంతరం లేదనిపిస్తుంది. ఇన్‌ఫార్మర్లుగా అనుమానించిన స్త్రీలను చంపడమే కాదు (నిజామాబాద్ సరళ హత్యే కాక ఆదిలాబాద్‌లో ఒకటి, వరంగల్‌లో ఒకటి జరిగాయి) తమకు రాజకీయంగా అడ్డం వచ్చిన మగవాళ్ళపైన దాడిచేసినట్టు స్త్రీలపైన కూడ దాడి చేసి కొట్టిన ఘటన నిజామాబాద్‌లో పడ్కల్ గ్రామంలో జరిగింది. కరీంనగర్ జిల్లాలోనూ ఈ మధ్య ఒక ఘటన జరిగింది. చెగ్గాం అనే ఊరిలో ప్రజలు చాలామంది కలిసి 'మా ఊరికి అన్నలూ రావద్దు, పోలీసులూ రావద్దు' అని తీర్మానం చేసినందుకు, ఒక వ్యక్తిపైన ఇన్‌ఫార్మర్ అంటూ పోస్టర్లు వేయబోయిన కార్యకర్తలను తరిమేసినందుకు, ఊరి జనంపైన కోపగించి

పెద్దసంఖ్యలో గ్రామంపైన దాడిచేసిన పెద్దపల్లి దళం, చాలామందిలో భాగంగా ఆ గ్రామం ఎంపిటిసి అయిన నాగమ్మను కూడ కొట్టి రాజీనామా చేయమన్నారు. ఎదిగిన పిల్లలున్న నాగమ్మ (ఇది ఆమె ఇచ్చిన వివరణే) దెబ్బల కంటే కూడ అవమానానికి రాజీనామా చేసింది.

బూతులు స్త్రీలను కించపరుస్తాయి కాబట్టి ఉద్యమకారులు శత్రువును తిట్టేటప్పుడు కూడ బూతు తిట్లు తిట్టకూడదన్న అవగాహన కనీసం ఒక దశాబ్దకాలంగా మనకు పరిచయం ఉంది. నక్సలైట్ కార్యకర్తలు బూతు తిట్లు ప్రయోగించరన్న అభిప్రాయం కూడ ఒకప్పుడు ఉండింది. ఇప్పుడది లేదు. కోపం వచ్చినప్పుడు (అది ఒక భూస్వామి మీద కోపమే కానక్కరలేదు) బజార్లో తిట్టినట్టు భార్యనూ తల్లినీ కించపరిచే పద్ధతిలో తిట్టే దళ నాయకుల గురించి ఈ మధ్య వింటున్నాం. (ఒక 'మాజీ'ని ఆ విధంగా తిట్టినప్పుడు 'మా అమ్మ చేతిలో నువ్వు ఎన్ని సార్లు అన్నం తిన్నావో మరచి పోవద్దన్నా' అని అతను బాధగా జ్ఞాపకం చేయవలసివచ్చింది.)

లైంగిక నేరాల పట్ల ఉదాసీన వైఖరి కూడ కనిపిస్తుంది. రేప్ చేసాడన్న అభియోగం ఉన్న రాజునాయక్ పీపుల్స్‌వార్ కార్యకర్తగా కొనసాగడాన్ని గురించి పైన చెప్పాను. కరీంనగర్‌లోనే ఒక గ్రామంలో జనశక్తి కార్యకర్త తమ్ముడి మీద ఒక అమ్మాయి పైన అత్యాచారం చేసాడన్న అభియోగం వచ్చింది. అతను ఒక 'అన్న'కు తమ్ముడు కాకపోతే బాధితురాలి తరపువారు, లేక ఇతర ప్రజలు అతనిపైన ఏదో ఒక చర్య తీసుకుందురు. (పోలీసు కంప్లైయింట్ ఇవ్వడమే కావచ్చు) కానీ స్వతంత్రించడానికి వెరచి అన్నలకే చెప్పారు. మేము వాడి సంగతి చూసుకుంటాం. మీరేమీ కలగజేసుకోవద్దని వారంటారు. కానీ ఏమీ చేయరు. అదే జిల్లాలోని నిమ్మపల్లి 'జనశక్తి' పోరాటాల ఆవిర్భావానికి పేరుపడ్డ గ్రామం. తరువాత జనశక్తి-పీపుల్స్‌వార్ ఘర్షణలలో ఇరుక్కుంది. ఆ ఊరిలో రేపిస్టులుగా పేరుపడిన వ్యక్తులున్నారు. వారు రేప్ చేసిన అమ్మాయిలు నిర్భయంగా వారిపేర్లు చెప్తున్నారు. అయితే నేరస్తులకు పీపుల్స్‌వార్ తో సంబంధాలున్నాయన్న భయంతో ఎవరూ ఏమీ చేయరు. పీపుల్స్‌వార్ దళం ఊరిలోకి వచ్చినప్పుడు వారి గురించి ప్రజలడిగితే 'వాళ్ళు మావాళ్ళుకారు' అని ప్రకటిస్తారు. కానీ వాళ్ళనేమీ చేయరు. అంతేకాక కనీసం ఒక దళ సభ్యుడితో వారికి దగ్గర సంబంధాలున్నాయని గ్రామస్తులకు కచ్చితంగా తెలుసు. కాబట్టి స్వతంత్రించి ఏమైనా చేయాలంటే ఇప్పటికీ భయమే.

కరీంనగర్ జిల్లాలోనే గోదావరి సమీపాన దొంతాపూర్ అనే గ్రామం ఉంది. ఆ ఊరికి చెందిన బుర్రకాయల పద్మ అనే దళిత యువతికి గత సంవత్సరం రాడికల్ మిలిటెంట్ల చేతిలో చాలా చేదు అనుభవం ఎదురయింది. ఆమె తన తలితండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా తనకంటే బాగా పెద్దవాడయిన వివాహితుడిని పెండ్లి చేసుకుంది. ఆ పెండ్లి అతని కుటుంబానికి కూడ ఇష్టంలేదు. అతను పని వెతుక్కోవడానికి గల్ఫ్ దేశాలకు పోయేసరికి పద్మ రెండు ఇళ్ళలోనూ పరాయిదానిగా బతకసాగింది. ఆమె భర్త ఇల్లు ఒకనాడు ప్రమాదవశాత్తు తగలబడిపోగా యింటివారు ఆమెనే నిందించారు. తలిదండ్రుల దగ్గరకు పోతే 'ఆ పెళ్ళి ఎవరు చేసుకొమ్మన్నారు?' అని వారు నిందించారు. చివరికామె అన్నల దగ్గరికి పోదలచుకుంది. అందుకోసం స్థానిక మిలిటెంట్ల సహాయం కోరింది. వాళ్ళు ఆమె స్థితిని ఆసరా చేసుకొని ఆమెను లైంగికంగా లోబరుచుకున్నారు. ఒక నెల తరువాత దళం దగ్గరకు తీసుకుపోయారు.

దళనాయకుడు జరిగిన విషయం గ్రహించినట్టున్నాడు. ఆమెకు ఇంటికి తిరిగి పొమ్మని నచ్చజెప్పి తండ్రికి అప్పగించాడు. ఆ మిలిటెంట్లను బహిష్కరించడంగానీ వారిపైన వేరే చర్యతీసుకోవడం గానీ జరగలేదు. ఆమె ఇంటికొచ్చిన కొన్నాళ్ళకు విషయం మొత్తం తెలుసుకున్న పోలీసులు ఆమెను తీసుకుపోయి వారం రోజులు నిర్బంధించి ఆమెకు జరిగిన అన్యాయానికి ఇంకొంచెం చేర్చి (దళ నాయకుడు కూడ ఆమెను రేప్ చేసాడని) పత్రికా విలేకరులకు చెప్పవలసిందిగా ఒత్తిడిపెట్టి ఆమెచేత చెప్పించారు. అప్పుడయినా పీపుల్స్‌వార్ ఆ మిలిటెంట్లు చేసిన నేరాన్ని ఒప్పుకొని పోలీసులు అదనంగా కల్పించిన అబద్ధాన్ని విమర్శించి ఉండవచ్చును. కానీ ఆ మాత్రం తప్పు ఒప్పుకుంటే 'పార్టీ ప్రతిష్ట' పోతుందనుకున్నారేమో అంతా అబద్ధమని బుకాయించారు. ప్రైవేట్‌గా మాత్రం దళిత సంఘాల వారిని పిలిచి ఆందోళన చేయవద్దని, జరిగిన పొరపాటేదో జరిగిపోయిందని ఆందోళన చేస్తే అది పోలీసులకే ఉపయోగ పడుతుందని నచ్చజెప్పారు. అటు పోలీసుల పంతం, ఇటు పీపుల్స్‌వార్ 'ప్రతిష్ట', వీటి మధ్య పద్మ ఏ పాటిది? ఆమె బతుకు ఏ పాటిది? ('ఇద్దరి మధ్య ప్రజలు నలిగి పోతున్నారు' అనే వ్యాఖ్య అన్ని సందర్భాలకూ తగినది కాకపోయినా యిటువంటి ఉదంతాలకు కూడ వర్తిస్తుంది.)

పార్టీ బయటేకాక పార్టీ లోపల స్త్రీలపైన అమలయ్యే అణచివేత గురించి కూడ మాట్లాడుకోవాలి. దీని గురించి ఎం-ఎల్ పార్టీలు ఎప్పుడూ పెదవి విప్పవు. వేరే విషయాలలో తప్పులు అప్పుడప్పుడయినా ఒప్పుకుంటారు కాని ఈ విషయాలలో అసలే ఒప్పుకోరు. తమతోటి కామ్రేడ్లయిన స్త్రీలను పెళ్ళి చేసుకొని వారిని భౌతికంగా మానసికంగా హింసించిన దళ సభ్యుల గురించి, పార్టీ కార్యకర్తల గురించి నిర్దిష్టంగా పేర్లతో సహా తెలిసిన కథలున్నాయి. బయటి ప్రపంచంలో లాగ ఆమె 'శీలాన్ని' శంకించేవారూ, పరాయి మగవాళ్ళతో (తోటి కామ్రేడ్లయినప్పటికీ) చనువుగా ఉంటే సహించలేక కొట్టేవాళ్ళూ ఉన్నారు. ఈ హింసకు వారిపైన పార్టీలు ఏ చర్యలు తీసుకుంటున్నాయో కానీ వాళ్ళు దళ సభ్యులుగాను, నాయకులు గాను కొనసాగుతూనే ఉన్నారు.

పార్టీ లోపల స్త్రీలపైన లైంగిక హింస గురించి వచ్చిన ఫిర్యాదులన్నీ పోలీసులు కల్పించిన దుష్ప్రచారమనీ, సరెండరయినపుడు పోలీసులు బలవంతంగా చెప్పించే కథలనీ కొట్టిపారేయడం ఎం-ఎల్ పార్టీలకు మామూలయిపోయింది. దుష్ప్రచారం చేయడంలో పోలీసులకు ప్రయోజనం ఉన్నమాట వాస్తవమే కానీ అంతా కేవలం దుష్ప్రచారం కాదు. ఈ పార్టీలలో పనిచేసి బయటకొచ్చిన స్త్రీలు ఎవ్వరి ప్రోద్బలం లేకుండ చెప్పే కథలున్నాయి.

ఈమధ్య కాలంలో అన్ని సాయుధ పోరాట పార్టీల దళాలలోను స్త్రీల సంఖ్య పెరిగింది. దళ నాయకులైన స్త్రీలు కూడ ఉన్నారు. అయితే అండర్ గ్రౌండ్ మగ కార్యకర్తలకు పెళ్ళి చేయడం కోసం అమ్మాయిలను వెతికి పార్టీలోకి తీసుకొచ్చే ప్రక్రియ (తొలినుండీ ఉన్నది) ఇంకా సాగుతూనే ఉన్నది. పనిలో పనిగా వాళ్ళు డెన్‌లు నిర్వహించడానికి కూడ పనికొస్తారు. రాజకీయ విశ్వాసంతో పార్టీలో చేరిన స్త్రీలను కూడ ఎవరో ఒక మగ కార్యకర్త 'పెళ్ళి' అవసరం (లైంగిక అవసరం అంటే ఎబ్బెట్టుగా అనిపిస్తుందేమో) తీర్చడం

కోసం తొందరపెట్టడం జరుగుతుంది. ఈ క్రమంలో మైనారిటీ తీరని అమ్మాయిలకు పెళ్ళి చేసిన ఘటనలు, ఇష్టమున్నా లేకపోయినా ఒత్తిడిపెట్టి పెళ్ళి చేసిన ఘటనలు ఉన్నాయి. ఉద్యమ ప్రయోజనాలు, ఉద్యమ అవసరాలు వ్యక్తుల ఇష్టాయిష్టాల కన్నా, స్వేచ్ఛా స్వతంత్రాలకన్నా గొప్పవి అనే దృక్పథం ఆ స్త్రీలు కూడ అంతర్లీనం చేసుకుని ఉంటారు కాబట్టి, తాము చేసుకోబోయే మగవాడు అప్పటికే ఒక కార్యకర్త లేక నాయకుడు అయి ఉంటాడు కాబట్టి, ఈ క్రమంలో మగవాళ్ళ అవసరాలకు తమ అవసరాలే కాక తమ వ్యక్తిత్వం, స్వతంత్రం కూడ బలి అవుతున్నాయని వారు సులభంగా గుర్తించలేకపోవచ్చు. గుర్తించినా ఏమీ చేయలేకపోవచ్చు.

ఇక లైంగిక హింస మాటకొస్తే తమ కింద పనిచేసే పార్టీ కార్యకర్తలయిన స్త్రీలను, తాము షెల్టర్ తీసుకున్న ఇళ్ళలోని స్త్రీలను నక్సలైట్ కార్యకర్తలు లేదా నాయకులు లైంగికంగా లోబరచుకునే ప్రయత్నం చేసిన ఘటనల గురించి, అటువంటి చరిత్రగల నాయకుల గురించి కూడ కథలున్నాయి. ఎవరో చెప్పినవి కావు, బాధితురాళ్ళు చెప్పినవే ఉన్నాయి. ఆ స్త్రీల పైన వారికుండే ఆధిపత్య సంబంధం (నాయకుడు, 'అన్న' అనే సంబంధం) దీనికి ఉపయోగపడుతుంది. పార్టీ నిర్మాణంలోను, డెన్‌ల నిర్వహణలోను ఉన్న రహస్యం కారణంగా అతని ప్రవర్తనపైన ఫిర్యాదు చేసే అవకాశంగాని, మార్గంగాని లేకపోవడం వల్ల ఆ స్త్రీలు ఆ ప్రవర్తనను మౌనంగా భరించవలసి వస్తుంది. చివరికి విప్లవ రాజకీయాలంటేనే అసహ్యం పుట్టి పార్టీ నుండే బయటికొచ్చేసిన స్త్రీలున్నారు.

## 7

విలువలకు ప్రాధాన్యం ఇచ్చే రాజకీయాలలో పారదర్శకత (ట్రాన్స్‌పరెన్సీ) ఉండగలదు. ఆధిపత్య రాజకీయాలకు అబద్ధాలు, బుకాయింపు, చెప్పేదానికీ చేసేదానికీ మధ్య పొంతన లేని హిపోక్రిసీ అవసరం. ఎం-ఎల్ పార్టీల రాజకీయాలలో ఒకనాడు పారదర్శకత ఉండేది. (ఆరోజులలో కూడ వాళ్ళు పోరాటాలు చేసారు కానీ అవి ప్రధానంగా ఆర్థిక సాంఘిక అసమానతకూ దోపిడీకీ వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు. ప్రజారాజ్యాధికారం పేరిట తమ సాయుధ ఆధిపత్యాన్ని సమాజం పైన నెలకొల్పే 'పోరాటం' అప్పటికింకా పెద్దఎత్తున మొదలు కాలేదు.) వాళ్ళు చెప్పింది చేస్తారు, చెప్పి చేస్తారు, చేసిందే చెప్తారు అన్న నమ్మకం ఉండేది. నక్సలైట్ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించేవారు సహితం 1980లలో వారిని ఈ విషయంలో మెచ్చుకునేవారు. ఈ రోజు వారి ప్రత్యర్థుల సంగతి పోనీయండి (వాళ్ళు నోరు విప్పి విమర్శించే స్థితిలో లేరు) వాళ్ళ మద్దతుదార్లకు సహితం ఆ నమ్మకం లేదు. (లేకపోగా, విప్లవోద్యమాలు ఎక్కడయినా ఎప్పుడయినా అన్యాయం చేయకుండ, అబద్ధాలు చెప్పకుండ నడిచాయా గెలిచాయా అని తర్కించే స్థితిని చేరుకున్నారు.) ఎప్పుడు ఏం చేస్తారో తెలియదు, చేసే పని ఏకారణంగా చేస్తారో స్పష్టంగా తెలియదు. ఏ పరిస్థితికి ఏరకంగా స్పందిస్తారో కచ్చితంగా చెప్పలేము అనే అనిశ్చితి ఆధిపత్యానికి చాలా ఉపయోగపడుతుంది. పూర్తిగా పారదర్శకంగా, నియమబద్ధంగా ఉండే ఆధిపత్యం ఆధిపత్యమే కాదు. 'నిత్యనిర్బంధంలో సాయుధ పోరాటం చేస్తున్న రహస్య పార్టీలకు పూర్తి పారదర్శకత సాధ్యమా?' అని అడుగుతారేమో. పరిస్థితులతో సంబంధం లేని పూర్తి పారదర్శకత గురించి నేను మాట్లాడడం లేదు. కానీ 'పరిస్థితులు' అనే సాకును

అడ్డం పెట్టుకొని, నిత్య అనిశ్చితి వల్ల, సంశయం వల్ల కలిగే భీతి నుండి ప్రయోజనం పొందాలని చూసే వైఖరిని క్షమించనవసరం లేదు.

మాట్లాడి పంపిస్తాం అని ఎవరినైనా 'అన్నలు' తీసుకొనిపోతే మాట్లాడి పంపిస్తారు తప్ప కొట్టరు, చంపరు అన్న విశ్వాసం 1980లలో ఉండింది. ఈ రోజు వాళ్ళు చంపదలచుకున్న వారినందరినీ 'మాట్లాడి పంపిస్తాం' అనే ఇంటినుండి తీసుకుపోతున్నారు. నిజానికిది-ఎప్పుడో అరుదుగా తప్ప - వాళ్ల కవసరమేం కాదు. మీవాడు ఫలాన తప్పు చేసాడు కాబట్టి మేము 'కొట్టదలచుకున్నాం, లేక చంపదలచుకున్నాం' అని చెప్పి తీసుకుపోతే వాళ్ళ సాయుధ బలానికి ఎదురయ్యే ప్రతిఘటన వారు ఎదుర్కోలేనిదేమీ కాదు. (*ఎదుటివాడు చాలామంది బలం గల రాజకీయ నాయకుడయితే తప్ప. అటువంటి వాళ్ళను 'అన్నలు' చంపేది తక్కువే.*) కానీ ఒకటి చెప్పి ఒకటి చేస్తే ప్రజలేమనుకుంటారో అన్న పట్టింపు ఉండడం అవసరం అనుకుంటే కదా ఆ మాత్రం అదనపు శ్రమ అయినా తీసుకోవడానికి? పట్టింపు లేకపోగా దానిలో ఉన్న ప్రయోజనం ఈ పార్టీలకు బాగానే తెలుసుననుకుంటాను. పోలీసులు కూడ 'ఎస్.ఐ సాబ్ మాట్లాడి పంపిస్తాడు-ఏం చేయములే' అని చెప్పి తీసుకుపోయి చంపి శవాన్ని ఇంటికి పంపిస్తుంటారు. విశ్వసనీయత కన్నా భయం ముఖ్యం అని వాళ్ళనుకున్నట్టే 'అన్నలూ' అనుకుంటున్నారు. ఉన్న విషయం చెప్పేస్తే ప్రతిఘటనను ఎదుర్కొనడానికి మరింత హింస చేయవలసి వస్తుందేమో కదా, దాని బదులు అబద్ధం చెప్పయినా ఒక్కడిని మాత్రం చంపడం మేలుకదా అంటారేమో. అట్లాగయితే ప్రజల సమక్షంలోనే తప్పు నిరూపించి శిక్షించడం తమ సిద్ధాంతం అని చెప్పుకోవడం ఎందుకు? ప్రజల సమక్షంలో నిరూపించేటప్పుడు ప్రతిఘటన రాదా? పారదర్శకత ఉన్నప్పుడే న్యాయం జరుగుతుందని కదా ఆ సిద్ధాంతం పెట్టుకున్నది? 'మాట్లాడి పంపిస్తాం' అనే బదులు అతడి తప్పేమిటో చెప్పి ఏం చేయబోతారో చెప్తే, వివరణ లేక సమాధానం ఇచ్చుకునే అవకాశం అతడి బంధుమిత్రులకు ఉంటుంది.

పారదర్శకత పాటిస్తారన్న పురాణం ఒకటి ప్రచారంలోనయితే ఉంది. అన్నలు మొదట ఆ వ్యక్తి నేరాలు ఎండగడతారనీ, ప్రజలలో పెట్టి రుజువు చేస్తారనీ, ఆ తరువాత అతనికి తన నడవడిక సరిదిద్దుకునే అవకాశం ఒకటికి రెండుసార్లు ఇస్తారనీ, అప్పటికీ సరిదిద్దుకోకపోతేనే శిక్షిస్తారనీ ఈ కథ చెప్తుంది. ఈ ప్రొసీజర్ నిజంగానే పాటించినా, ఆరోపణ వేసేది వారే, రుజువు చేసేది వారే, శిక్షవేసేదీ వారే కాబట్టి న్యాయం జరిగినట్లేనని అనలేము. (*ఈమాట ఎందుకంటున్నానంటే, నక్సలైట్లు ఎవరిని చంపినా 'అంతకుముందే అతనిని హెచ్చరిస్తూ పోస్టర్ వేసారంట' అని-అక్కడికి న్యాయం జరిగిపోయినట్టు-సమర్థించడం పరిపాటి అయిపోయింది కాబట్టి.*) అయితే నక్సలైట్ల చేతిలో చనిపోయిన వారిలో 25 శాతమైనా ఈ అవకాశమంతా పొందారా? లేదనుకుంటాను. ఒకసారి ఇన్‌ఫార్మర్ లేక ప్రజాద్రోహి అన్న ఆరోపణ వేసి ఏమీ చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా చంపినవారు, జవాబు చెప్పుకున్నాక కూడ అది ఎందుకు ఆమోదనీయం కాదో వివరించకుండా దానిని తిరస్కరించి చంపినవారు, సమాధానం చెప్పుకోవడానికి ఆస్కారంలేని అస్పష్టమైన నిందలువేసి చంపినవారు, ఒక్కసారికూడ ఏ నిందలూ వేయకుండ చంపినవారు, చాలామందే ఉన్నారు.

వేసే ఆరోపణలలో కూడ పారదర్శకత లోపం స్పష్టంగా కనిపిస్తుంది. ఆరోపణలు సాధారణంగా స్పష్టంగా ఉండవు. 'ప్రజలలో గందరగోళం సృష్టిస్తున్నాడు' 'పార్టీపైన దుష్ప్రచారం చేస్తున్నాడు' 'అరాచక శక్తులను చేరదీస్తున్నాడు', 'పంచాయతులు చేసి గ్రామాలలో అరాచకత్వం సృష్టిస్తున్నాడు' 'పోలీసుల కొమ్ముకాస్తున్నాడు' మొదలయిన ఆరోపణలు తరచుగా వేస్తుంటారు. వీటికి నిర్దిష్టమైన అర్థం లేదు. ఇటువంటి ఆరోపణలు వేసి ఒక వ్యక్తి పైన దాడి చేస్తే ఆ చర్య ఎంతవరకు సమర్థనీయమో వివేచించే మార్గం లేదు. ఒక్కొక్కసారి ఒక వ్యక్తిమీద వేసిన ఆరోపణల దండకాన్ని చదివి వాటిలోని అసలు విషయం ఏమయి ఉంటుందా అని ఊహించుకోవలసి వస్తుంది. వడబోసుకోవడం తెలంగాణ ప్రజలకు అలవాటయిపోయింది. నల్గొండజిల్లాలో పీపుల్స్‌వార్ చంపిన విలేఖరి శ్రీధర్‌రెడ్డిని 'వ్యభిచారి, తాగుబోతు, లంచగొండి, ఇన్‌ఫార్మర్' అన్నారు. అతను ఇన్‌ఫార్మర్ అనడానికి తమ దగ్గరేవో ఆధారాలున్నాయని అంటున్నారుగానీ వాటి విశ్వసనీయత సంగతి పక్కన పెట్టినా అతను లంచగొండి కాడు, తాగుబోతు కాడు, వ్యభిచారి కాడు. ఒక వ్యక్తిమీద ఒక ఆరోపణ ఉంటే అతనిని భ్రష్టు పట్టియ్యడానికి దానితో పది ఆరోపణలు ఎందుకు చేరుస్తారని వారినెవరూ అడగరు. అది బలమున్నవాడి ప్రివిలేజ్. ఆరోపణలను జల్లెడ పట్టి అసలు సంగతి ఏమయి ఉంటుందా అని సామాన్యులు ఊహించుకోవాలి. ఈ తర్కాన్ని తెలంగాణ ప్రజలు ఎంత సులభంగా దిగమింగారో చూస్తే మనుషుల మీద ఆధిపత్యం నెలకొల్పడం ఎంత సులభమో అర్థమవుతుంది, భయం వేస్తుంది కూడ. అన్నల మీద గౌరవం కొద్దీ ఈ 'చిన్న' పొరబాట్లను ప్రజలు సహిస్తున్నారనుకుంటే పొరబాటే. నిస్సహాయతకొద్దీ భరిస్తున్నారు. మనుషులను ఎంత సులభంగా ఆస్తిటికి తీసుకురావచ్చుననేదే ఆశ్చర్యమూ ఆందోళనా కలిగించే విషయం.

'వ్యభిచారి' అంటే (లక్ష్మణచాందాలో చంపిన చిన్నారెడ్డి లాగ) తనభార్యకాని ఒక స్త్రీతో ఇష్టపూర్వకంగా సంబంధం పెట్టుకున్న వ్యక్తి కావచ్చు, లేదా మామూలు అర్థంలో వ్యభిచరించే వ్యక్తి కావచ్చు (అదయినా ఏపాటి శిక్షవేయగల నేరమన్నది వేరే సంగతి) 'పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడం' అంటే పార్టీ కార్యకర్తలు చేసిన తప్పులను ఎత్తి చూపి ప్రజలలో చర్చకు పెట్టడం కావచ్చు, రాజకీయంగా ఎం-ఎల్ పార్టీల పద్ధతులతో విభేదించి ఆ విభేదాన్ని బహిరంగంగా వ్యక్తం చేయడం కావచ్చు, పనిగట్టుకొని తప్పుడు అభియోగాలు సృష్టించి ప్రచారం చేయడం కావచ్చు. 'పంచాయతులు చేసి గ్రామంలో అరాచకం సృష్టించడం' అంటే పంచాయతులపైన అన్నలకుండే గుత్తాధిపత్యాన్ని ఆమోదించకుండ నేను కూడ చేస్తాననడం కావచ్చు, పంచాయతులలో ఆశ్రిత పక్షపాతం ప్రదర్శించి అన్యాయం చేయడం కావచ్చు. ఇన్ని అర్థాలలోనూ ఈ మాటలను ఉపయోగించిన ఉదంతాలున్నాయి. ఉపయోగించి తమ దాడులనూ హింసనూ సమర్థించుకున్న ఉదంతాలూ ఉన్నాయి.

'హుస్నాబాద్ ప్రాంతంలో జరిగే పోలీసు దాడులన్నిటికీ సిపిఐ వారే బాధ్యులు' అని పీపుల్స్‌వార్ అంటుంది. లేదా 'బాధ్యత వహించవలసి ఉంటుంది' అంటుంది. దీని అర్థం సిపిఐ వారే పోలీసులకు చెప్పి దాడులు చేయిస్తున్నారనా? లేకపోతే పోలీసు దాడులకు ప్రతీకారం సిపిఐ వారిపైన తీర్చుకోవడం జరుగుతుందనా? మొదటిది ఒక అభియోగం.

దాని సత్యాసత్యాలు తెలుసుకునే అవకాశం ఉంది. రెండవది బెదిరింపు. ఒక ఆరోపణ వేస్తున్న గొంతుతో బెదిరింపు జారీ చేస్తారు. సిపిఐ వారు దానిని స్వీకరించి ఆ ప్రాంతంలో ఎప్పుడు ఎన్‌కౌంటర్ జరిగినా దానికి తాము బాధ్యులము కామని తామే ఋజువు చేసుకుంటూ కనిపించిన వారికందరికీ చెప్పుకుంటుంటారు. అయినప్పటికీ-ఎంత ఋజువు చేసుకున్నప్పటికీ-వారే బాధ్యులని పీపుల్స్‌వార్ అంటుంటుంది. ఆ 'బాధ్యత' కూ ఈ 'బాధ్యత'కూ అర్థం ఒకటి కాదు. మాటలకు అర్థం చేతిలో తుపాకి ఉన్నవారు నిర్ణయిస్తారు. ఉదాహరణకు ఉల్లంపల్లి ఎన్‌కౌంటర్‌కు సమాచారం ఇచ్చినవాడు ఒక సస్పెండ్ అయివున్న పోలీసు కానిస్టేబుల్ అని అందరూ భావిస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేయాలంటే ఒక దళాన్ని పట్టియ్యాలని ఎస్‌పి అన్నాడనీ తాను కాపుగాసి దళం ఆచూకీ తెలుసుకొని పోలీసులకు చెప్పాననీ అతనే చెప్పుకున్నాడు. దానికి గుర్తింపుగా ఎస్‌పి అతని సస్పెన్షన్ ఎత్తివేసి పనిలోకి తీసుకున్నాడు కూడ. అయినప్పటికీ సిపిఐ నాయకులే ఉల్లంపల్లి ఎన్‌కౌంటర్‌కు బాధ్యులని పీపుల్స్‌వార్ అంటూ ఉంటుంది. సి.పి.ఐ నాయకులను ఎడతెగని అనిశ్చిత స్థితిలో ఉంచి 'కంట్రోల్' లో పెట్టుకోవడానికిది ఒక మంచి అస్త్రం. అంటే మాటలకుండే అర్థాలు ఆధిపత్య రాజకీయాలలో భాగం అయిపోయాయి.

నిజానికి ఎక్కువ శాతం ఆరోపణలు 'ఇన్‌ఫార్మర్' అన్న దానితో ముగుస్తాయి. పది ఆరోపణలున్నా పదకొండవ స్థానంలో 'ఇన్‌ఫార్మర్' అనేది ఉంటుంది. నక్సలైట్ల ఆరోపణలలో పారదర్శకత లేమికి ఈ ఇన్‌ఫార్మర్ అనేది చక్కటి నిదర్శనం. ఇన్‌ఫార్మర్ అంటే నక్సలైట్ దళాల గురించి సమాచారం సేకరించి పోలీసులకు ఇచ్చి వాళ్ళను పట్టిచ్చేవాడని చాలామంది అనుకుంటారు. కానీ అదొక్కటే దాని అర్థం కాదు. అటువంటి వాళ్ళు లేరని కాదు. చాలామందే ఉన్నారు. పోలీసులకు చాలా పటిష్టమైన ఇన్‌ఫర్మేషన్ వ్యవస్థ ఉంది. అయితే అంత మాత్రం చేత నక్సలైట్లు ఎవరిని ఇన్‌ఫార్మర్ అన్నా వాళ్ళు ఇన్‌ఫార్మరే అయి ఉంటారని భావించ నవసరం లేదు. అన్నల భాషలో - వాళ్ళు మెడలు వంచి తమ తుపాకీకి దాసోహం చేసుకున్న భాషలో - 'ఇన్‌ఫార్మర్' అనే మాటకు చాలా అర్థాలున్నాయి.

మిలిటెంట్లు తనపైన దాడి చేసి కొడితే వారు కొట్టారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చిన వాడూ ఇన్‌ఫార్మరే. నక్సలైట్లు తనను బెదిరిస్తే వారి వల్ల ప్రాణభయం ఉందని పోలీసులకు చెప్పుకొని రక్షణ కోరినవాడూ ఇన్‌ఫార్మరే. అన్నలు గ్రామంలో ఒక పంచాయతీ చేసారని తెలిసి పోలీసులు ఊరిలోకొచ్చి వి.ఎ.ఓ.నుగానీ సుంకరినిగానీ ఏం జరిగిందని అడిగితే వాళ్ళు ఉద్యోగం రీత్యా తప్పనిసరయి చెప్పినా వారిని అన్నలు ఇన్‌ఫార్మర్ అనరన్న నమ్మకం లేదు. లేదా పోలీసు లెవరినయినా పట్టుకొని కొట్టి చెప్పించినా వాడు కూడ ఇన్‌ఫార్మర్ అన్న ముద్ర తప్పించుకోలేక పోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలలోనూ పోలీస్ స్టేషన్లలోనూ పైరవీలు చేసుకొని బ్రతికే ఛోటా నాయకులు అన్ని గ్రామాలలోనూ ఉంటారు. తమ సానుభూతిపరులు అరెస్టయినప్పుడు విడిపించుకోవడానికి వీరిని అన్నలు వాడుకుంటూ ఉంటారు. కానీ వారిపైన నింద వేయదలచుకున్నప్పుడు వారి పైరవీలను కారణంగా చూపించి 'ఇన్‌ఫార్మర్' అంటారు.

అంతేకాదు. ఒక గ్రామంలో ఎన్‌కౌంటర్ లేక పోలీసు దౌర్జన్యం జరిగిందనుకోండి. నక్సలైట్లు దానికి చాలా సందర్భాలలో ప్రతీకారం తీర్చుకుంటుంటారు. ఈ ప్రతీకారానికి గురయినవారిని అనివార్యంగా 'ఇన్‌ఫార్మర్' అంటారు. కానీ నిజానికి ఈ ప్రతీకార దాడులకు గురయ్యే వాళ్ళు ఎవరు? ఫలాన ఘటనలో పోలీసులకు సమాచారం ఇచ్చి దాడి చేయించిన వారిపైననే ప్రతీకారం తీర్చుకుంటారన్న నమ్మకమేమీ లేదు. ప్రతీకారం జరగాలి, అది ముఖ్యం. దానికి గురయ్యేవారు ఎప్పుడో ఏదో విషయంలో నక్సలైట్లతో గొడవ పెట్టుకున్న వారు కావచ్చు. రాజకీయంగా నక్సలైట్లకు వ్యతిరేకులు కావచ్చు. అప్పటి పాలక పార్టీకి (తెలుగుదేశం లేక కాంగ్రెస్) చెందిన స్థానిక నాయకులు కావచ్చు. స్థానిక ప్రజాప్రతినిధులకు లేక ఎం.ఎల్.ఏ కి సన్నిహితులు కావచ్చు. వేరే ఏ కారణంగానయినా (ఇందులో స్థానిక మిలిటెంట్ల, దళ సభ్యుల వ్యక్తిగత కక్షలను కూడ లెక్క బెట్టుకోవాలి) నక్సలైట్లకు శత్రువులయి ఉండి కక్ష తీర్చుకోవడానికి తగిన అదనుకోసం అన్నలు ఎదురుచూస్తున్న వారెవరైనా కావచ్చు.

దీని ఫలితం ఏమిటంటే పోలీసు దాడులు లేక ఎన్‌కౌంటర్లు జరిగిన గ్రామాలలో నక్సలైట్లతో ఏ కారణంగానయినా (అది సహేతుకమా లేక అహేతుకమా, ఆ దాడితో సంబంధం ఉన్నదా లేనిదా అన్న ప్రశ్నలతో నిమిత్తం లేకుండ) ఘర్షణ పెట్టుకున్న వారందరూ ప్రతీకారానికి భయపడుతూ బతుకుతుంటారు. 'నాకు అన్నలతో విభేదాలు ఉంటే ఉండవచ్చును కానీ పోలీసులు గ్రామంలోకి రావడానికి నేను బాధ్యుడిని కాను కదా, నాకేం భయం' అన్న భరోసా ఎవ్వరిలోనూ ఉండదు. 'శత్రువర్గం' గా నక్సలైట్లు భావించే వారెవరయినా ప్రతీకారానికి గురికావచ్చు. 'శత్రువర్గం' లో భయం పెంచడమే ఈ ప్రతీకార దాడుల ప్రధాన లక్ష్యం. నిజమైన ఇన్‌ఫార్మర్‌ను వెతికి పట్టుకుని శిక్షించడం కాదు. దాడికి గురయిన తరువాత మాత్రం వారిని 'ఇన్‌ఫార్మర్' అనే అంటారు. ఆ సంగతి అందరికీ తెలుసును. కానీ ఆ మాటను ఇంతటి అబద్ధపు అర్థంలో ప్రయోగించడాన్ని మాత్రం ఎవరూ ప్రశ్నించరు. హతుడి భార్య, రక్తబంధువులు ధైర్యం చేసి శవం ముందు కూర్చొని ప్రశ్నించడం అప్పుడప్పుడు జరుగుతూ ఉంటుంది. అంతవరకైతే అన్నలు సహిస్తారు కానీ గ్రామస్తులలో వేరే ఎవరైనా వారి చర్యపట్ల నిరసన సమీకరించే ప్రయత్నం చేస్తే మాత్రం చాలా ప్రమాదం. ఆ తరువాత ఆ దళం అటువైపు వచ్చినప్పుడు ఆ వ్యక్తిని టార్గెట్ చేస్తారు.

జనశక్తి నాయకుడు భూపతిరెడ్డిని పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకొని తీసుకొచ్చి సిరిసిల్ల ప్రాంతంలో చంపి పడేసారు. హైదరాబాద్‌లో మెకానిక్ షాపు పెట్టుకున్న ఒక సిరిసిల్ల నివాసి అయిన వెలమ కులస్థుడు అతనిని పట్టిచ్చాడని ఆ పార్టీ భావించింది. కానీ ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా అతనిని కాక సిరిసిల్లలో నివసించే అతని బంధువు నొకడిని కాల్చిచంపింది. వీళ్ళిద్దరూ మరి కొందరూ కలిసి పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనీ పోలీసులకు సమాచారం చేరవేస్తున్నారనీ ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్నవాడు (భూపతిరెడ్డిని పట్టిచ్చినవాడు) దళాలకు దొరకడం కష్టం కాబట్టి సిరిసిల్లలో ఉన్నవాడిని కాల్చి చంపారు. ఎవరు పట్టిచ్చారనేది ఇక్కడ ముఖ్యం కాదు. శత్రువర్గానికి దడ పుట్టించడం ముఖ్యం. ఆ మాటే ప్రకటించుకుంటే దాని మంచి చెడులు ఆలోచించుకోవచ్చు. నిజానికిది ఫాషన్

రాజకీయాలలో ఎప్పుడూ ఉన్న సూత్రమే. కానీ ఎం-ఎల్ పార్టీలు ప్రకటించుకోవు. మృతుడు భూపతిరెడ్డి ఎన్‌కౌంటర్‌కు బాధ్యుడనే జనశక్తి ప్రకటిస్తుంది.

వరంగల్‌లో పీపుల్స్‌వార్ పాలకుర్తి ప్రాంత దళ నాయకుడిగా ఉన్న నాగన్న ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. అతను తీగరాజుపల్లి దగ్గర నడిచిపోతూంటే కాకతాళీయంగా ఎదురొచ్చిన పోలీసులతో ఉన్న హోంగార్డు అతనిని గుర్తుపట్టాడు. అక్కడికక్కడే వాళ్ళు అతనిని పట్టుకొని కాల్చిచంపారు. ఆ పోలీసులు నాగన్న కోసం రాలేదు. వేరే ఏదో కేసులో ఎంక్వైరీకి వస్తూ నాగన్నను పసిగట్టి పట్టుకొని చంపారు. ఆ ఘటన పూర్తిగా కాకతాళీయంగా జరిగింది. అయినప్పటికీ దానికొక 'ఇన్‌ఫార్మర్'ను గుర్తించి (సృష్టించి అనాలేమో) చంపడం జరిగింది. (పైగా అతనిని చంపడానికి పోయి అతను ఇంట్లో లేడని అతని తమ్ముడిని తీసుకుపోయి చంపారు.) దీనిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? 'పొరబాటు' అనుకోవాలా? ఎన్‌కౌంటర్ కాకతాళీయంగా జరిగినా ఇంకొకరకంగా జరిగినా దానివల్ల 'శత్రువర్గం' (కనీసం మానసికంగా) బలం పుంజుకుంటుంది. కాబట్టి ఏదో ఒకటి చేసి ఆ అసమతుల్యాన్ని సవరించాలి. శత్రువర్గంలో ఎవరో ఒకరిని చంపడం దీనికొక మార్గం. హతుడు నిజంగా అన్నలకు శత్రువా అన్నది కూడ అంత ముఖ్యం కాదు. ఆ పేరు పెట్టగలవారి నొకరిని చంపితే చాలు. శత్రువర్గంలో తిరిగి మళ్ళీ పాత భీతి నెలకొంటుంది. ఫాక్షన్ రాజకీయాలతో పరిచయం ఉన్న రాయలసీమ వాసులకు ఈ తర్కం సులభంగానే అర్థం అవుతుంది. అయితే అది కమ్యూనిస్టు రాజకీయాలలోకి ఎప్పుడు ప్రవేశించిందనేదే ప్రశ్న. అధికారికంగా ప్రవేశించలేదు కాబట్టే ఫాక్షన్ పద్ధతిలో జరిగిన హత్యలో కూడ హతుడిని ఫలాన ఎన్‌కౌంటర్‌కు ఇన్‌ఫార్మర్ అనే అంటారు.

కరీంనగర్‌లో కల్వచర్ల చాలా ఎన్‌కౌంటర్లు చూసిన గ్రామం. పోలీసులు ఆ ఊరి కల్లు దుకాణం దగ్గరకు వచ్చిపోతుంటారు కాబట్టి వాళ్ళ ఇన్‌ఫార్మర్లు ఎవరో చెప్పే బాధ్యత ఆ కల్లు దుకాణం నడిపే గౌడ కుటుంబానిదేనని పెద్దపల్లి ప్రాంత పీపుల్స్‌వార్ దళ నాయకుడు నాగరాజు హుకుం జారీ చేసాడు. 'చెప్పలేకపోతే మీరే బాధ్యత వహించ వలసి ఉంటుంది' అన్నాడు. 'చెప్తే పోలీసులు చెప్పకపోతే అన్నలు' అన్న సందిగ్ధంలో పడ్డారో లేక వారికి నిజంగానే తెలీదో గానీ వారేమీ చెప్పలేకపోయారు. ఆ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములను పెద్దపల్లి దళం ఒళ్ళు విరగ్గొట్టి చంపింది. 'ఇన్‌ఫార్మర్లు' అనింది.

భాష కేవలం మానవ సంబంధాలను వ్యక్తం చేసే సాధనం కాదనీ అది మానవ సంబంధాలను రూపకల్పన చేస్తుందనీ పోస్ట్-స్ట్రక్చరలిస్టులు అంటుంటారు. బలవంతుల చేతిలో భాష ఒక ఆధిపత్య సాధనంగా పని చేస్తుందంటారు. భాష చేసే రూపకల్పన వెనుక వాస్తవికత ఏదీ లేదనుకోకుండా ఉన్నంత కాలం ఇది విశ్లేషణకు ఉపయోగకరమైన ఆలోచనే. ఇన్‌ఫార్మర్ అనేమాట, దానికి పైకి ఉండే అర్థం, లోలోపల ఉండే పలు అర్థాలను కలిపి ఎం-ఎల్ పార్టీలకు సమాజంపైన ఉండే ఆధిపత్య సంబంధాన్ని రూపకల్పన చేసే శబ్దాల సమాహారంగా అర్థం చేసుకోవచ్చు. ఆ మాట కలిగించే భయాన్ని చూస్తే భాష ఒక ఆధిపత్య సాధనం కాగలదని సులభంగా నమ్మవచ్చు.

ఆ మాటకున్న అర్థాలు అనంతం. నక్సలైట్లు ఏ కారణంగానయినా ఎవరి మీదనయినా దాడి చేయదలచుకుంటే అతనిని ఇన్‌ఫార్మర్ అంటారు. అసలు కారణం కూడ చెప్తే చెప్తారు. అది చెప్పుకోగల కారణమైతే చెప్తారు. చెప్పుకోలేని కారణమైతే ఇన్‌ఫార్మర్ అని మాత్రమే అంటారు. చెప్పుకోగల కారణమైనా కూడ దానితోపాటు ఇన్‌ఫార్మర్ అనేది చేరుస్తారు. ఎందుకంటే అసలు కారణం *'చంపదగ్గ కారణంగా'* కనిపిస్తుందో కనిపించదో. ఇది చేరిస్తే ఏ ఇబ్బందీ ఉండదు.

శ్రీకాకుళం జిల్లాలో పాపయ్య మాస్టారు అనే దళిత నాయకుడున్నాడు. ఆయన విప్లవ అభిమాని. ఒక దశలో పీపుల్స్‌వార్ తరపున ప్రజాకోర్టులు కూడ పెట్టాడు. వాళ్ళకు తన ఊరిలో తన ఇంటిలో ఆశ్రయం ఇచ్చాడు. కానీ రెండేళ్ళ క్రితం అకస్మాత్తుగా పీపుల్స్‌వార్ అతనిని ఇన్‌ఫార్మర్ అనసాగింది. ఒకనాడు అతని గ్రామంలో ఇద్దరు రాడికల్ కార్యకర్తలు ఆశ్రయం తీసుకొని ఉండగా (అతనప్పుడు గ్రామంలో లేడు) పోలీసులు దాడి చేసిన సంగతి ఉదహరించారు. పోలీసులు చేసిన దాడికి తానెట్లా బాధ్యుడినవుతానని అతను ఎదురుప్రశ్న వేసాడు. పైగా ఆ రోజు తన కూతురే వాళ్ళను వారించి తప్పించిందని వివరించాడు. నువ్వు చేసిన పని నీ కూతురికి తెలియకపోవచ్చుగదా అని వారన్నారు. అక్కడితో ఆగకుండా *'నువ్వు ఈ రోజే కాదు **1969** నుండి ఇన్‌ఫార్మరే'* అన్నారు! ఇంతగా తనమీద వాళ్ళు ఎందుకు కక్షగట్టారో అర్థం కాని పాపయ్య మాస్టారు 'అన్నల' తో సంబంధమున్న వాళ్ళందరికీ అర్జీలు పెట్టుకున్నాడు. తాను దళిత మహాసభలో ఉంటూ పీపుల్స్‌వార్ సానుభూతి పరుడిగా వ్యవహరించినప్పుడు ఇబ్బందేమీ రాలేదనీ, దళిత ఉద్యమంలో తాను కె.జి.సత్యమూర్తికి దగ్గరయినప్పటి నుండి ఈ దాడి మొదలయిందనీ ఆయన వ్యాఖ్యానం. ఆయన గురించి తెలిసిన వాళ్ళకు అంతకంటే వేరే కారణమేదీ కనిపించడం లేదు.

*'చెప్పుకోలేని కారణాల'*లో ఇటువంటి రాజకీయ కక్షలు ముఖ్యమైనవి. ఫలాన వ్యక్తిమీద (లేదా ఆ వ్యక్తి ఆస్తి మీద) దాడి చేయకపోతే ఇంక ప్రజా ఉద్యమాలకు మనుగడ లేదనో ప్రజల న్యాయమైన ఆగ్రహం చల్లారదనో మాత్రమే నక్సలైట్లు దాడి చేయరు. అదొక్కటే కారణమైతే *'చెప్పుకోలేని కారణాలు'* ఏవీ ఉండవు. (పోరబాట్లు జరిగినప్పుడు తప్ప) కానీ నక్సలైట్ పార్టీలు రాజ్యాంగ యంత్రంతోనూ పాలక పార్టీలతోనూ నిత్యం ఒక ఆధిపత్య పోరులో ఉంటాయి. దానికి అనేక రకాల హింసాకాండ అవసరం అవుతుంది. అదికాక కార్యకర్తల, మిలిటెంట్ల, వ్యక్తిగత రాగద్వేషాల నుండి, ఇతరుల ఆధిపత్యపోరులో ఒక పక్షం వహించే అవకాశవాదం నుండి పుట్టిన హింసాకాండ కూడ ఉంటుంది. ఇదంతా చెప్పుకోవడం కష్టం. ఎందుకంటే కమ్యూనిస్టు పార్టీలు అనుసరించే రాజకీయాల స్వభావం ఏదయినా దానిని వ్యక్తం చేసే పరిభాష మాత్రం మానవత, న్యాయం, సమత, మొదలైన విలువల రూపంలో ఉండక తప్పదు కాబట్టి. ఒక్క ఇన్‌ఫార్మర్ల విషయంలో మాత్రమే ఏ మానవతకూ సున్నితత్వానికీ తావు ఉండజాలదని ఇతరత్రా సున్నితమనస్కులయిన విప్లవ కమ్యూనిస్టు సానుభూతిపరులు కూడ ఒప్పుకోవడానికి సిద్ధపడతారు. కాబట్టే ఇన్‌ఫార్మర్ అనేది ఎప్పుడూ చెప్పుకునే కారణం అయింది.

# 8

మాటలకు అర్థాలే మారిపోవడం అనేది కరువు దాడులు, భూమి పోరాటాలు, ప్రజాకోర్టులు మొదలయిన విషయాలలో కూడ జరుగుతున్నది. 1980లలో పీపుల్స్‌వార్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లాలో కరువు దాడులు జరిగాయి. నిజంగా కరువు వాత పడిన ఆదిలాబాద్ జిల్లా మధ్యప్రాంత గిరిజనులు దండేపల్లి మండల కేంద్రంపైన, ఇతర పెద్ద గ్రామాలపైన దాడి చేసి వర్తకుల దగ్గరి నుండి తిండి గింజలు ఎత్తుకుపోయారు. ఆ ఘటన పట్ల అందరూ సానుభూతి చూపించారు. ఆ తరువాత జరిగిన కొన్ని కరువు దాడులలో తిండిగింజలతో పాటు డబ్బు, బంగారం కూడ తీసుకుపోవడం జరిగింది. (బహుశా దండేపల్లి దాడిలో కూడ జరిగిందేమో) పార్టీ ఫండ్‌గా దానిని వాడుకుంటే తప్పేముంది లెమ్మనుకున్నాము. కానీ పోను పోను కరువు దాడికీ దారిదోపిడీకీ తేడా లేని పరిస్థితి వచ్చింది. గత సంవత్సరం కరీంనగర్ జిల్లా మంథని అడవి ప్రాంతంలో కరువు దాడులు జరిగాయి. వర్తకుల పైన కాక గ్రామంలో ఉన్న రైతుల (భూస్వాములు కాదు) ఇళ్ళపైన దాడులు జరిగాయి. 4 ఎకరాల రైతునుండి 15 ఎకరాల రైతుకూడ ఈ దాడులకు గురి అయ్యారు. వాళ్ళ ఇళ్ళలోని ధాన్యం బస్తాలే కాకుండ బట్టలు, బిందెలు, నగదు, బంగారం, రేడియోలు, టీవీలు – ఏదీ వదిలి పెట్టకుండ దోచుకుపోయారు. 'కూలి వాళ్ళకింకా గింజలు ఇయ్యలేదు. రెండు బస్తాలు పెట్టిపోండి' అన్నా కూడ వినలేదు. మామూలుగా నక్సలైట్ ఉద్యమాన్ని గురించి సానుభూతిగా రాసే మండల విలేకర్లు సహితం 'కరీంనగర్‌లో కరువొచ్చింది తిండికా టీవీలకా' అంటూ వార్తలు రాసారు. ఈ కరువు దాడులలో ఏ ఊరి ప్రజలు ఆ ఊరి దాడులలో పాల్గొన లేదు. వాళ్ళను నక్సలైట్లు రమ్మంటే, 'మీరు కరువు దాడికి రమ్మంటారు. పొద్దున్న పోలీసులొచ్చి మేము తెచ్చుకున్నదే కాక మా యింట్లో ఉన్నది కూడ ఎత్తుకుపోతారు' అని రామన్నారు. స్థానిక ప్రజలకు ఆసక్తి లేదు కదా అని అన్నలు ఊరుకోలేదు. ఇరుగు పొరుగు గ్రామాలనుండి ప్రజలను తీసుకొచ్చారు. కేవలం తిండి గింజల కోసమంటే వారు కూడ రారేమోననేనా, ఇంట్లో ఉన్నదంతా దోచుకోవచ్చుననే 'ఇన్సెంటివ్' కల్పించారు. ఒక ఊరిలోనంటే అది పొరబాటుగా జరిగిందనో మిలిటెంట్ల అవగాహనా రాహిత్యం వల్ల జరిగిందనో అనుకోవచ్చు. కానీ ఒకటి తరువాత ఒకటి వరుసగా అయిదూళ్ళలో జరిగింది. పత్రికలలో విమర్శలు వస్తుండగా జరిగింది. కొన్ని ఊర్లలో కరువుదాడికి గురయిన సామాన్య రైతుకుటుంబాలు తమ నిరసనను బాహాటంగా వ్యక్తం చేసిన తరువాత కూడ మళ్ళీ వేరే గ్రామాలలో అదే రకమైన కరువు దాడులు జరిగాయి.

భూమి పోరాటాలు అంటే భూస్వాముల మిగులు భూములను, ప్రభుత్వ భూములను విముక్తం చేసే పోరాటాలు మాత్రమేనని చాలామంది అనుకుంటున్నారు. కానీ వాటి అర్థం అంత మాత్రమే కాదు. తొలినాడు ఈ పోరాటాలు గ్రామాలలోని దొరలు లేక పెద్ద భూస్వాముల మీదనే చేపట్టారు. వారి సాంఘిక ఆర్థిక ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో భాగంగా వారి భూములలో పనులు బంద్ పెట్టించడం, భూములలో జెండాలు పెట్టి స్వాధీనం చేసుకోవడం జరిగింది. పోలీసులు రంగంలోకి దిగి కూలివాళ్ళను కొట్టి అరెస్టు చేయడంతో వారు (అధిక శాతం కేసులలో) ఆ భూమిని అనుభవించలేక పోయారు.

అటు భూస్వాములు కూడ నక్సలైట్ల భయం వల్ల ఆ భూమిని తిరిగి దున్నించడానికి ప్రయత్నం చేయలేదు. నక్సలైట్లు దున్నించిన భూమిలో దాదాపు 80 శాతం బీడున్నాయి.

ఇంతవరకే అయితే ప్రభుత్వాన్నీ పోలీసులనూ తప్పు పట్టవచ్చును. ఆ భూములు పేదలు దున్నుకోనివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవచ్చును. కానీ నక్సలైట్ల (ముఖ్యంగా పీపుల్స్‌వార్) భూమి పోరాటాలు అక్కడితో ఆగిపోలేదు. పెద్ద భూస్వాములు, దొరల దగ్గరి నుండి కిందికి దిగి మధ్యతరగతి రైతుల వద్దకు వచ్చాయి. వారి భూములను అమ్ముకోవడానికి వీలులేదని (అంటే ఎప్పటికైనా వాటిని పేదలు స్వాధీనం చేసుకుంటారని) నిషేధం పెట్టడం, లేదా పేదలకోసం వదిలి పెట్టాలని (పేదలు పోలీసుల భయం వల్ల వాటిని స్వాధీనం చేసుకోలేరు కాబట్టి ఈ ఆదేశం ఫలితంగా ఆ భూములు బీడు పడక తప్పదు) ఆదేశించడం జరుగుతున్నది. ఇది ఎంతవరకు సబబు అని చర్చ చేసినవారు లేరు. ప్రభుత్వ సీలింగ్ చట్టంలో లాగ తాము కేవలం భూమిని మాత్రమే కాక ఆ కుటుంబానికి ఉన్న ఇతర ఆస్తులను కూడ లెక్కలోకి తీసుకుంటున్నామని పీపుల్స్‌వార్ అంటుంది. కానీ దీనికి కూడ ఖచ్చితమైన ప్రమాణమేమీ ఉన్నట్టు కనిపించదు. కొన్ని చోట్ల 15 ఎకరాల రైతులమీద, కొన్ని చోట్ల 10 ఎకరాల రైతుల మీద ఆంక్షలు ప్రకటించబడ్డాయి. వారందరికీ ఇతర ఆదాయాలు ఉండకపోవచ్చును. సాగునీటి విషయంలో వెనుకబడి ఉన్న తెలంగాణలో 10-15 ఎకరాల రైతులందరూ 'మధ్యతరగతి' అనికూడ అనిపించుకోరు.

అయితే భూమి పోరాటాలు అక్కడ కూడ ఆగిపోలేదు. ఒక భూస్వామి మీద అన్నలు పోరాటం మొదలు పెట్టినట్టయితే అతను గతంలో అమ్ముకున్న భూములను కొనుక్కున్న వాళ్ళను కూడ (వాళ్ళు చిన్నరైతులే అయినప్పటికీ) ఖాళీచేసి పొమ్మని ఆదేశాలు జారీ చేసిన ఘటనలున్నాయి. మాజీ కాంగ్రెస్ మంత్రి మాదాడి నరసింహారెడ్డి భూములను (అన్నల ఆంక్షలేవీ లేని రోజులలో) కొనుక్కున్న వరంగల్ జిల్లా చిట్యాల ప్రాంత రైతులకు ఈ గతే పట్టింది. వాళ్ళంతా చిన్న రైతులే. ఎక్కువ భాగం బిసి కులాలకు చెందినవారే. వాళ్ళు కొన్నప్పుడు చెల్లించిన ధర వెనక్కి ఇప్పించే బాధ్యత అన్నలు తీసుకోరు. అది వెనక్కి ఇప్పించినా ఆ తరువాత పెట్టిన పెట్టుబడిని నష్టపోవలసిందే. అయినా వారిని ఖాళీ చేసి పొమ్మనే వరకే నక్సలైట్ల పని. పీపుల్స్‌వార్‌తో బద్ధ శత్రుత్వం పెట్టుకొని చాలా నష్టపోయిన వ్యక్తులలో నరసింహారెడ్డి ఒకడు. కాబట్టి ఈ రైతులు ఏడ్చి మొత్తుకున్నా అతను వారికి ఒక్క పైసకూడ తిరిగి ఇవ్వడు.

అయితే కొనుక్కున్న భూములు ఖాళీ చేయించడానికి అమ్మిన భూస్వామి పైన నక్సలైట్లకు ప్రత్యేకమైన శత్రుత్వం ఉండనవసరం లేదు. అది 'భూమి పోరాటం'లో భాగమైన కార్యక్రమం. ఒకప్పటి భూస్వామ్య కుటుంబాలు తమ భూములు అమ్ముకోవటం ద్వారా, కొడుకులకూ మనుమలకూ పంచుకోవడం ద్వారా భూమిపోరాటాన్ని తప్పించుకున్నారని అన్నలనుకుంటే ఇప్పుడు వాటిని అనుభవిస్తున్న వారిని ఖాళీ చేయించి ఆ భూములు బీడు పెట్టించడం పోరాటంలో భాగమే. ఇప్పుడు దానిని అనుభవిస్తున్న వ్యక్తి (కొనుక్కున్న వాడయినా పంపకంద్వారా పొందిన వాడయినా) సాధారణ రైతే కావచ్చు. అయినప్పటికీ ఈ భూమి పోరాటానికి బలికావలసిందే.

కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో కొండూరి శేషలింగం అనే వైశ్యుడి భూమిలో ప్లాట్లు కొనుక్కుని దుకాణాలు కట్టుకున్న 11 మంది చిన్న వ్యాపారస్తులకు ఇదే గతి పట్టింది. మేము ప్లాట్లు కొనుక్కున్నప్పుడు, దుకాణాలు కట్టుకున్నప్పుడు, మీరేమీ ఆంక్షలు పెట్టలేదు కదా ఏడేళ్ళ తరువాత ఖాళీ చేయమంటే ఎట్లాగని వాళ్ళు అడిగితే 'మేం అప్పుడే చెప్పాం' అని పీపుల్స్‌వార్ బుకాయిస్తుంది. ఖాళీ చేయకపోతే దుకాణాలు పేల్చేస్తామని బెదిరించి ఖాళీ చేయిస్తుంది.

ఒకప్పుడు భూస్వామ్య కుటుంబంగా ఉన్నవారు ఆ తరువాత అమ్ముకోగా పంచుకోగా ప్రస్తుత తరంలో తలా 10 ఎకరాలు కూడ లేని స్థితిలో ఉన్నప్పటికీ (వారికి వేరే ఆదాయమేమయినా ఉన్నా లేకున్నా) వారికి ఒక్క ఎకరం కూడ మిగిలించకుండా మొత్తం బీడు పెట్టించిన ఘటనలున్నాయి.('భూములలో జెండాలు పాతడం' అనేదిపోయి 'భూములు బీడు పెట్టించడం' అనే ప్రయోగం వచ్చింది. మొదటిది కూలివాళ్ళు కదిలిపోయి - స్వంత చైతన్యంతో కావచ్చు, అన్నల ప్రోద్బలంతో కావచ్చు - భూములు ఆక్రమించుకునే క్రియ. రెండవది కూలివాళ్ళ కదలికలతో ఏమీ సంబంధం లేకుండ అన్నల బెదిరింపుతో జరిగేది.) ఆస్తికిగానీ ఆదాయానికి గానీ ఒక కచ్చితమైన పరిమితి నిర్ణయించి (అది ప్రభుత్వ సీలింగే కానవసరం లేదు) దానిని ఒక్కొక్క కేసులోనూ లెక్కించి నిర్ణయించే మార్గం కల్పించి, ఒక సాధారణ మధ్యతరగతి జీవితానికి అవసరమైన పరిమాణం వారికి మిగిలించి (ఎం-ఎల్ పార్టీల సిద్ధాంతం ప్రకారం మధ్యతరగతి ప్రస్తుత దశలో శత్రువర్గం కాదు కాబట్టి) మిగిలినది స్వాధీనం చేసుకునే పారదర్శకమైన విధానమేమయినా ఉంటే (అయినప్పటికీ పోలీసులు పేదలు అనుభవించకుండ అడ్డంపడేటప్పుడు ఈ భూమి పోరాటాల వల్ల వనరులు వృథా కావడం తప్ప ఒరిగేదేమిటని ప్రశ్నించవచ్చు) బాగుండేది. అటువంటిదేమీ లేకుండ స్థానిక కార్యకర్తల అవగాహన ప్రకారం భూములపైన ఆంక్షలు పెట్టిస్తున్నారు. (అమ్మకంపైన కావచ్చు, దున్నడంపైన కావచ్చు) మధ్యతరగతి రైతాంగాన్ని చాలా ఇబ్బంది పెడుతున్నారు. ఇదంతా కూడ బయటి వాళ్ళు చాలా భావుకతతో ఊహించుకునే 'భూమిపోరాటం'లో భాగమే.

బీడుపెట్టిన భూముల ఆసాముల ఇబ్బందేకాక వనరుల వృథా కూడ ఒక సమస్యే. 'అభివృద్ధికి' నక్సలైట్లు అడ్డం వస్తున్నారన్న ప్రభుత్వ దూషణకు జవాబుగా నక్సలైట్ ఉద్యమ మద్దతుదార్లేకాక వారిని మంచి చేసుకోవడం కోసం లౌక్యం పాటిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు కూడ 'నక్సలైట్లు ఏ ప్రాజెక్టుకు అడ్డం వచ్చారు? ఏ ఫ్యాక్టరీ కడతామంటే వద్దన్నారు?' అని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. నక్సలైట్ ఉద్యమాన్ని మొత్తంగా అభివృద్ధికి ఆటంకంగా చూడాలనడం తప్పు. సామాజిక సంబంధాలలోనూ పేదల ఆర్థిక స్థితిగతులలోనూ అది చాలా అభివృద్ధికి తోడ్పడింది. అయితే నియమరహితమైన ఈ భూమిపోరాటాల వల్ల వేలాది ఎకరాలు బీడుపడడమే కాక రైతులలో 'ఎప్పుడు ఖాళీ చేసి పొమ్మంటారో' అన్న అనిశ్చితి నెలకొని ఉండడం అభివృద్ధికి కచ్చితంగా ఆటంకమే. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధికి గల మూలాలలో ఒకటి గ్రామీణ రైతాంగం పోగుచేసుకునే మిగులు. అది నక్సలైట్ల ప్రాబల్యం బాగా ఉన్న ప్రాంతాలలో నిరంతర సందిగ్ధంలో చిక్కుకొని ఉందనేది సత్యమే.

ఈ మేరకు నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో అభివృద్ధిని ఆటంకపరుస్తూ ఉందనేది నిజమైన వివుర్శే. (ఇతర విషయాలలో చాలా నిశితమైన విమర్శ చేసే తెలంగాణ ఉద్యమకారులు ఈ విషయం మాట్లాడడానికి సిద్ధంగా లేకపోవడం అన్నలు తెలంగాణకు నేర్పించిన అవకాశవాదానికి మరొక తార్కాణం. వాళ్ళను మంచి చేసుకుంటే ఉపయోగకరం. వాళ్ళకు చెడ్డ కావడం ఎంత మాత్రం ఒంటికి మంచిది కాదు. ఈ పరిధిలో ఆలోచించి కృత్రిమ లౌక్యం పాటించడం ఎం-ఎల్ పార్టీలు తెలంగాణ రాజకీయాలకు నేర్పించాయి.)

అయితే భూమి పోరాటాలు అక్కడితో కూడ ఆగిపోలేదు. పేదల భూమిపోరాటాలతో ఏమీ సంబంధం లేని వివాదాలలోకూడ భూమి అమ్మవద్దని నిషేధం పెట్టడం, భూమి బీడు పెట్టించడం నక్సలైట్లు విధించే ఒక శిక్ష. ఇన్‌ఫార్మర్లకు, రాజకీయ శత్రువులకు కూడ తరచుగా ఈ శిక్ష వేస్తుంటారు. ఇది ఆ ప్రత్యర్థినీ అతని కుటుంబాన్నీ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుంది. ఆ వ్యక్తి భూస్వామి కానక్కరలేదు. సాధారణ రైతు కావచ్చు. అతను తన తప్పొప్పులతో నిమిత్తం లేకుండా అన్నలతో రాజీ పడి వారు చెప్పినట్టు నడుచుకొని తన భూమి అనుభవించే హక్కయినా అమ్ముకునే హక్కయినా తిరిగి పొందాలి.

ఒకటిరెండు ఉదాహరణలు చెప్పుకుంటే 'భూమిపోరాటాల'లో ఎన్నిరకాలున్నాయో అర్థం అవుతుంది. నిజమైన భూస్వాములమీద నిజమైన పోరాటాలు చేయలేదని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. చేసారు, ఇంకా అక్కడక్కడ చేస్తున్నారు. కానీ వేరే రకం భూమి పోరాటాలు కూడ చాలా జరిగాయి. జరుగుతున్నాయి. కరీంనగర్ జిల్లా మంథని సమీపంలోని ఖమ్మంపల్లిలో సాంబయ్య అనే వయసు మళ్ళిన టీచర్ ఉన్నాడు. కోమటి కులస్తుడు, ఎనిమిది ఎకరాల రైతు. కొన్ని ఏళ్ళ కింద ఒక రోజు గ్రామ మిలిటెంట్లు అతని కల్లంలోని వడ్లను పంచుతుంటే చూసి, వారంతా తన దగ్గర చదువుకున్న విద్యార్థులే కదా అన్న ధైర్యంతో వాళ్ళతో గొడవ పెట్టుకున్నాడు. ఎనిమిది ఎకరాల రైతు పంట పంచడం న్యాయమా అన్నాడు. పంచుతున్న మిలిటెంట్ల నాయకుడికి 6 ఎకరాలు ఉన్నప్పుడు అతనికీ తనకూ తేడా ఏముందన్నాడు. అక్కడితో ఆగక (పర్యవసానాలు ఆలోచించకుండా) ఆ మిలిటెంట్‌ను కర్రతో కొట్టాడు. వాళ్ళందరూ తిరగబడి అతనిని విపరీతంగా కొట్టారు. ధాన్యమంతా పంచేసారు. దెబ్బలతో మంచం పట్టిన సాంబయ్య వారిపైన పోలీసులకు రిపోర్టు ఇచ్చి 'ఇన్‌ఫార్మర్' అయ్యాడు. (ఇన్‌ఫార్మర్ అన్న మాటకు ఇది కూడ ఒక అర్థం అని పైన చెప్పానుకదా) పోలీసులు వాళ్ళను పట్టుకొని కేసు పెట్టారు. దానితో సాంబయ్య కష్టాలు ప్రారంభం అయ్యాయి. ఇన్‌ఫార్మర్ కాబట్టి భూమి దున్నుకోవడానికి వీలులేదని ఆ ప్రాంత పీపుల్స్‌వార్ దళం ఆదేశించింది. సాంబయ్య అన్నలను కలిసి రాజీపడ్డాడు. మిలిటెంట్ల పైన పెట్టిన కేసు రుజువు కాకుండా చూస్తానన్నాడు. మిలిటెంట్లకయిన ఖర్చులు కట్టిస్తానన్నాడు. (వాళ్ళు కొట్టిన దెబ్బలకు వైద్యం చేయించుకోవడానికి అతనికి అంత కంటె ఎక్కువ ఖర్చే అయినప్పటికీ) అందుకోసం రెండెకరాల భూమి అమ్మి డబ్బులు చెల్లించాడు. అయితే అతని దగ్గర ఆ రెండెకరాలు కొనుక్కున్న వ్యక్తిని అన్నలు పిలిచి, సాంబయ్య దగ్గరికి పోయి ఆ రెండెకరాలకు గాను తాను ఇచ్చిన మొత్తం వెనక్కి తెచ్చుకొమ్మన్నారు. (భూమి అమ్మకూడదన్న ఆంక్షను

అతి(క్రమించినందుకు కాబోలు. మరయితే వాళ్ళు విధించిన జుర్మానా ఎట్లా చెల్లిస్తాడు?) సాంబయ్య నోరుమూసుకొని (అప్పు చేసి) ఆ మొత్తం వెనక్కి ఇచ్చాడు. కోర్టులో సాక్ష్యం చెప్పకుండ ఉండి మిలిటెంట్లను విడుదల చేయించాడు. అయినప్పటికీ అన్నలు ఈనాటికీ అతన్ని భూమి సాగు చేసుకోనివ్వడం లేదు. ప్రజలు కరీంనగర్ జిల్లాలో పోరాడి స్వాధీనం చేసుకున్న వేలాది ఎకరాల భూమిలో ఈ దౌర్భాగ్యుడికి మిగిలి ఉన్న 6 ఎకరాలూ ఉన్నాయి. అదీ చాలక నిరుడు ఒకరోజు మిలిటెంట్లు సాంబయ్యను పట్టుకొని ఊరినుండి అడవి వైపు తీసుకొనిపోతూ 'ముసిలోడ్ని ఈ రోజు చంపేస్తాం' అని ఎదురయిన వారికి చెప్పారు. చంపేసే వారేనేమోగానీ అకస్మాత్తుగా రోడ్డు మీద పోలీసు జీపు ఎదురు కావడంతో మిలిటెంట్లు సాంబయ్యను విడిచిపెట్టి పారిపోయారు.

ఇదేదో చాలా అరుదయిన కథ అనుకోనక్కరలేదు. పీపుల్స్‌వార్ బీడు పెట్టించిన భూముల కథలన్నీ ఇటువంటివి కావుగానీ ఇటువంటివి చాలానే ఉన్నాయి.

ఇంకొక కథ చెప్తే భూమి పోరాటాలకు సంబంధించిన మరొక పార్శ్వం అర్థమవుతుంది. వరంగల్ జిల్లా రాంపురం గ్రామంలో వెంకన్న అనే రాడికల్ యువకుడిని **1980**లలో గ్రామ పెత్తందార్లు హత్య చేసారు. వాళ్ళలో ఒకరి భూమిపైన పీపుల్స్‌వార్ నిషేధం పెట్టింది. అదే కుటుంబానికి చెందిన ఇతరుల భూమిలో ఒకటి రెండెకరాలు కొనుక్కుందామని అప్పట్లో ప్రయత్నించిన బుచ్చయ్య అనే భూమి లేని గొల్లకులస్తుడిని అన్నలు కొననివ్వలేదు. అయితే అప్పట్లో పనిచేసిన ఒక పీపుల్స్‌వార్ కార్యకర్త **1990**లో సరండర్ అయి బయటికి వచ్చి ఆంక్ష ఉన్నది ఆ కుటుంబంలో ఒకరి భూమి మీదనే అనీ, మిగిలిన వాళ్ళ భూమి కొనవచ్చుననీ బుచ్చయ్యను ప్రోత్సహించాడు. తనే బేరం కుదిర్చాడు. బుచ్చయ్య తనవద్దనున్న గొర్రెలు, బంగారం అంతా అమ్మి కొంత భూమి కొన్నాడు. అయితే కొనడం ఆలస్యం అయినందుకు ఆ మాజీనక్సలైటు ధర పెంచి (బహుశా తాను కమీషన్ పొంది) కొనిపించాడు. బుచ్చయ్య ఆపైన **50** వేలు ఖర్చు పెట్టుకొని ఆ భూమిని బాగుచేసుకున్నాడు. అంతా అయిన తరువాత దళం వచ్చి ఆ భూమి కొన్నందుకు బుచ్చయ్యను ఆక్షేపించి ఖాళీ చేయమనింది. మీవాడే చెప్పాడు కదా అంటే ప్రయోజనం లేకపోయింది. మీరు ఆంక్ష పెట్టింది ఆ కుటుంబంలో ఒకరి భూమిపైననేకదా అని బుచ్చయ్య పట్టుబట్టేసరికి అన్నలతనిని విపరీతంగా కొట్టి పడేసి, భూమి ఖాళీ చేయమని మరోసారి హెచ్చరించి పోయారు.

'భూమి పోరాటాల'లో ఈ దెబ్బలు మామూలే. కొనవద్దన్న భూములు కొన్నా, కౌలుకు చేయవద్దంటే చేసినా, అతను ఎంత పేదవాడనేది చూడకుండ విపరీతంగా దండించడం, ఒక్కొక్కసారి చంపడం జరుగుతుంటుంది. అదే వరంగల్ జిల్లా కాకొండలో పాత బ్రాహ్మణ దొరల భూముల కొనుగోలు మీద గత సంవత్సరం పీపుల్స్‌వార్ ఆంక్షలు పెట్టింది. అప్పటికి కొనుక్కున్నవి కూడ ఖాళీచేసి బీడు పెట్టాలనింది. ఆ దొరల కుటుంబానికి చెందిన ఒక దొరసాని వాటాగా **12** ఎకరాలు మాత్రం వచ్చాయి. ఆమె అందులో నాలుగెకరాలు బిసి

కులాలకు చెందిన కొందరు పేద రైతులకు అమ్మి ఉండింది. ఆంక్షలు పెట్టిన తరువాత పీపుల్స్‌వార్ వాళ్ళు ఆ భూమి ఖాళీ చేయవలసిందిగా ఆ రైతులను ఆదేశించారు. వారు దొరసాని దగ్గరకుపోయి తాము చెల్లించిన డబ్బులు వెనక్కి ఇమ్మన్నారు. ఆమెకూడ ఏమంత ఉన్నది కాదు కాబట్టి తన దగ్గర పైసలు లేవని చెప్పింది. అందువల్ల వేరే ఆధారం లేని ఆ రైతులు తాముకొన్న భూమి సాగుచేయడం కొనసాగించారు. ఇది తెలిసిన పీపుల్స్‌వార్ దళం వారిలో ఒక చాకలి కులస్తుడిని పట్టుకొని ఒళ్ళు విరగగొట్టి మళ్ళీ హెచ్చరించి పోయింది.

చందాల వసూలులో కూడ ఎం-ఎల్ పార్టీల అభిమానులు బయట ఉండి ఊహించుకునే దానికీ వారి పోరాటప్రాంతాలలో జరిగే దానికీ కాలక్రమంలో చాలా తేడా వచ్చింది. ఒకప్పుడు ఎం-ఎల్ పార్టీలు తమ పునాది ప్రజాశ్రేణులమీద, మధ్యతరగతి సానుభూతిపరుల మీద ఫండ్స్ కోసం ఆధారపడేవి. ఆయుధాల వాడకం పెరిగే కొద్దీ అది పోయింది. ధనవంతులు ఏ కమ్యూనిస్టు పార్టీకీ ఇష్టపూర్వకంగా ఇవ్వరు కాబట్టి ఏదో ఒక విధంగా నష్టం చేస్తామన్న బెదిరింపు లేకపోతే ఫండ్స్ వారినుండి రావు. కానీ దానికైనా ఒక పద్ధతి, ఒక ప్రమాణం ఉండాలి. కేవలం బాగా ధనవంతులయిన వారినుండే తాము పెద్దమొత్తంలో వసూలు చేసుకుంటామనీ అంతకంటే తక్కువస్థాయి వాళ్ళను ఇబ్బంది పెట్టమనీ ఇవ్వలేని మొత్తాలు బెదిరించి వసూలు చేసుకోమనీ ఈ పార్టీలు అంటుంటాయి. కానీ వాస్తవం దానికి విరుద్ధంగా ఉంది. వ్యాపారస్థులనూ కాంట్రాక్టర్లనూ ఒంటరి ప్రదేశానికి తీసుకుపోయి ('కిడ్నాప్ చేసి' అంటే ఇబ్బంది అనిపిస్తుందేమో) కోటాపెట్టి వసూలు చేసుకోవడం, 'చెన్నారెడ్డి పీరియడ్'లో పీపుల్స్‌వార్ పెద్దెత్తున చేసింది. ప్రస్తుతం మాత్రం ఈ విషయంలో 'జనశక్తి' కి ఉన్నంత చెడ్డపేరు వేరే ఏ పార్టీకీ లేదు. (విప్లవ కమ్యూనిస్టు పార్టీగా గుర్తించాలో లేదో అర్థం కాని జనరక్షణ సమితికి తప్ప) వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతంలో జనశక్తి దళం ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి తీసుకుపోయి పీపుల్స్‌వార్‌కు ఇచ్చినంత తమపార్టీకి ఇవ్వలేనన్నాడని అతని చేతులు వెనక్కి కట్టి చొక్కాలో ఎర్రచీమలు వేసి వసూలు చేసుకుంది. మెదక్ జిల్లా ధర్మాజీపేటలో జనశక్తి వారు అడిగినంత డబ్బు ఇవ్వలేని కాంట్రాక్టరు తరపున ఆ పార్టీకి అంతకుముందు సహాయపడిన అతని తమ్ముడు శ్రీనివాసరెడ్డి మాట్లాడడానికి పోగా దళం అతనిని కొట్టి, కాల్చి చంపింది. (తరువాత అలవాటు ప్రకారం ఇన్‌ఫార్మర్ అన్నారు) ఈ పని చేసింది జనశక్తిలోని 'వీరయ్య వర్గం' అనుకుంటాను. ఈ మధ్య జనశక్తిలో అంతర్గత పోరాటం పెరిగి రెండు గ్రూపులుగా పని చేస్తున్న క్రమంలో పోటాపోటీగా చందాలు వసూలు చేస్తున్నట్టున్నారు. దానివల్ల అరాచకంగా వసూలు చేసుకునే దురలవాటు పెరిగింది. ఎక్కువగా మధ్యతరగతి మీద పడడం వల్ల విమర్శ కూడ చాలా ఎక్కువయింది. రెండు మూడు విప్లవపార్టీలు పనిచేస్తున్న ప్రాంతాలలో రోడ్డు కాంట్రాక్టయినా వేరే ఏ కాంట్రాక్టయినా తీసుకుంటే అందరికీ ఫండ్ ఇయ్యగా మిగిలేదేమీ ఉండదన్న భయంతో ఎవరూ కాంట్రాక్ట్ తీసుకోని పరిస్థితి కూడ కొన్ని చోట్ల ఉంది. కరీంనగర్ జిల్లా కోనరావుపేట మండలంలో రోడ్లు అధ్వాన్నంగా ఉండడానికి ఇదే కారణమని గ్రామస్తులు బహిరంగంగానే పీపుల్స్‌వార్‌నూ జనశక్తినీ విమర్శిస్తున్నారు.

ఈ పార్టీల రాష్ట్ర కమిటీలు చేపట్టే ఫండ్ వసూలు కేవలం కోటీశ్వరుల దగ్గరినుండే కావచ్చునుగానీ వారి దళాలు, మిలిటెంట్లు ఏ కొంచెం ఉన్నవారినీ విడిచిపెట్టడం లేదు. నిజామాబాద్ జిల్లాలోని వెనుకబడిన ప్రాంతంలో ఉన్న గాంధారి వంటి చిన్నమండల కేంద్రంలో ఏ ఒక్కవ్యాపారినీ ఏ ఒక్కరైతునూ వదిలి పెట్టకుండ పీపుల్స్‌వార్ కార్యకర్తలు వసూలు చేసుకున్నారంటే ఆశ్చర్యం అనిపించక మానదు. అవినీతికీ, స్వంత అవసరాలకోసం పార్టీ చందాలు ఇంటికి తరలించే బలహీనతకూ ఇది తావు ఇస్తుంది. నక్సలైట్ కార్యకర్తలందరూ అవినీతిపరులు కారు. చాలా ఏళ్ళు పార్టీలో పనిచేసి కూడ కుటుంబానికి ఏమీ చేసుకోనివారు చాలామంది ఉన్నారు. అటువంటివారే మెజారిటీ అయి ఉండవచ్చు. కానీ అవినీతిపరుల సంఖ్య సుమారుగా ఉంది. 'ఆర్థిక అరాచకత్వానికి పాల్పడుతున్నాడు' అన్న నెపంతో జరిగే బహిష్కరణలు, భౌతిక దండనలు దీనికొక తార్కాణం.

ఆధిపత్య రాజకీయాలకు అనిశ్చితి ఒక ముఖ్యసాధనం అని పైన చెప్పాను. ఎప్పుడు ఏం చేస్తారో, ఎందుకు చేస్తారో, చెప్పిన మాట మీద నిలబడతారో లేదో, ప్రకటించిన నియమాలకు నిబద్ధులయి ఉంటారో లేదో తెలియని పరిస్థితి వారి ప్రశాసనాన్ని నెలకొల్పడానికీ నెలబెట్టడానికీ చాలా ఉపయోగపడుతుంది. తెలిసీ ఈ సదుపాయాన్ని తిరస్కరించడానికి చాలా ముందుచూపుగల నాయకత్వం అవసరం. మన రాష్ట్రంలోని ఎం-ఎల్ పార్టీల నాయకత్వానికి అటువంటి ముందుచూపు ఉన్న దాఖలాలు లేవు. ఒక దళ నాయకుడితో చర్చించి ఒప్పించిన విషయాన్ని అతను మారిపోయి కొత్త దళనాయకుడు వచ్చిన తరువాత తిరగదోడడం జరగదన్న భరోసా ప్రజలకు లేదు. ప్రత్యర్థులు ఆ అదను కోసం ఎదురు చూసి కొత్తవాడు రాగానే పాత పితూరీలన్నీ మళ్ళీ లేవదీస్తారు. అందువల్ల ఒకసారి అన్నలతో సమస్య లొచ్చినవారు ఎల్లప్పుడూ గాభరాగానే బ్రతుకుతుంటారు. (బయటి ప్రపంచంలో ఎస్.ఐలూ ఎం.ఆర్.వోలూ బదిలీ అయినప్పుడు ఇటువంటి ఇబ్బందులే వస్తుంటాయి.) సమాజం మీద అన్నల ఆధిపత్యం నెలకొల్పడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. భూమి దున్నుకోవద్దనో అమ్ముకోవద్దనో ఎన్నికలలో పోటీ చేయొద్దనో ఆదేశం జారీ చేస్తారు. దానికి కారణంగా ఒక ఆరోపణ వేస్తారు. బాధితుడు ఆ ఆరోపణ నిజంకాదని అంటాడు. వివరించుకునే అవకాశం ఇవ్వాలంటాడు. లేదా వివరణ ఇచ్చి నిర్ణయాన్ని పున:పరిశీలించమంటాడు. సరే చూస్తాం అంటారు. ఎంతకాలమైనా ఆ అవకాశం ఇవ్వరు. ఒకసారి ఒకప్రాంతంలోకి వచ్చిన దళం మళ్ళీ ఆరునెలలదాకా రాకపోవచ్చు. వచ్చినప్పుడు పాత సంగతి ప్రస్తావించకపోవచ్చు. మిలిటెంట్లను అడిగితే 'అన్న రావలసిందే'నంటారు. ఈ విధంగా నెలల తరబడి (ఒక్కోసారి-జమ్మికుంట ఇళ్ళ సమస్యలాగ, జనగాం మాజీ ఎం.ఎల్.ఏ. వరదారెడ్డి భూమి సమస్యలాగ -ఏళ్ళ తరబడి) విషయాలు పరిష్కారం కాకుండా ఉండిపోతాయి. పున:పరిశీలన జరిగినా దానిని బహిరంగంగా ప్రకటించరు. 'అట' అనే వార్తగానే అది బాధితుడిని చేరుతుంది. తనకు స్వేచ్ఛ లభించినట్టా లేదా అని అర్థం కాక అతను సతమత మవుతుంటాడు.

ఉద్యమ సంస్థలలో క్రమశిక్షణ కూడ ఉద్యమానికి ఉండవలసిన పారదర్శకతలో భాగమే. పెట్టుకున్న నియమాలూ తీసుకున్న నిర్ణయాలూ అమలు కావాలి. ఆ నియమాలూ నిర్ణయాలూ స్పష్టంగా ఉండాలి. అవి అమలు కాకపోతే, లేక ఉల్లంఘించబడితే దానిపైన

సమీక్ష ఉండాలి. దానివల్ల నష్టపోయిన ప్రజలకు వివరణ ఇవ్వడం, సంజాయిషీ ఇచ్చుకోవడం జరగాలి. దానికి బాధ్యులయిన కార్యకర్తలకు తగిన శిక్ష వేయాలి. ఆ తరువాత ఆ ఉల్లంఘన నిలిచిపోవాలి. ఇది ప్రజలపట్ల ఉద్యమాల కుండే జవాబుదారీతనంలో ఒక ముఖ్య అంశం. (ప్రజలను సంప్రదించి వారి సమ్మతితో నిర్ణయాలు తీసుకునే సంపూర్ణమైన జవాబుదారీతనాన్ని ప్రజలకు తమను తాము 'అగ్రగామి'గా భావించుకునేవారు ఎల్లాగూ పాటించరు కాబట్టి ఈ మాత్రం జవాబుదారీతనమైనా పాటించాలి.) కానీ దళాల మిలిటరీ వ్యవహారాలలో క్రమశిక్షణ ఉంటుందేమోగానీ, ప్రజలకు సంబంధించిన విషయాలలో ఈ రకమైన జవాబుదారీయుతమైన క్రమశిక్షణ శూన్యం. దానివల్ల ఉత్పన్నమయ్యే అనిశ్చితి, సందిగ్ధాలవల్ల పెరిగే భయం, బలం ఈ పార్టీలకు బాగానే అనుభవంలోకి వచ్చింది. అందువల్లనేనేమో దీనిని సరిదిద్దే ప్రయత్నమేదీ వారు చేయడం లేదు. ఎప్పటికప్పుడు 'ఇది కార్యకర్తల క్రమశిక్షణా రాహిత్యం వల్ల జరిగింది. పార్టీ నిర్ణయం కాదు, పార్టీ విధానం కాదు' అంటుంటారు గానీ ఆ క్రమశిక్షణా రాహిత్యాన్ని సవరించకపోవడమే వాళ్ళకు బాగుంది.

పై స్థాయి కమిటీ తీసుకున్న నిర్ణయం కింది వాళ్ళు అమలు చేస్తారన్న నమ్మకం లేదు. కరీంనగర్ జిల్లాలో పీపుల్స్‌వార్ జిల్లా కమిటీ అధికారికంగా క్షమించిన వారిని పెద్దపల్లి ప్రాంత దళనాయకుడు నాగరాజు శిక్షించిన ఘటనలున్నాయి. ఒక్కొక్కసారి ఇది రివర్స్‌గా జరుగుతుంది. గ్రామ మిలిటెంట్లు న్యాయమని నమ్మిన విషయాన్ని దళం ఒప్పుకోకపోవచ్చు. వీళ్ళ సమ్మతి లేకుండ దళం శిక్షించవచ్చు. అప్పుడు మిలిటెంట్లు నిస్సహాయత వ్యక్తం చేయడం తప్ప ఏమీ చేయలేరు. ఏమైనా చేస్తే తాము కూడ పార్టీకి చెడు కావలసి ఉంటుందని భయపడతారు. అయినప్పటికీ ధైర్యం చేసి అడ్డంపోయిన మిలిటెంట్లను ప్రజలు చాలా గౌరవిస్తారు. కరీంనగర్ కాటారం అడవిలో ఈ మధ్య ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఒక మిలిటెంట్‌ను అక్కడి జనం మెచ్చుకుంటూ, 'దళం ఎవరినయినా అన్యాయంగా కొట్టబోతే అడ్డం పోయి అతన్ని కాపాడేవాడు' అన్నారు. అదేరకంగా మిలిటెంట్లు అన్యాయంగా ప్రవర్తించినపుడు 'మావాళ్ళు' అని వాళ్ళనే వెనకేసుకు రాకుండ (ఈ విధంగా వెనకేసుకొచ్చిన ఉదంతాలు చాలా ఉన్నాయి) వాళ్ళను వారించి, దండించి, న్యాయం నిలబెట్టిన నాయకులను కూడ ప్రజలు గౌరవిస్తారు. నిజానికి 'అన్నలు మంచోళ్ళే. ఈ మిలిటెంట్లతోనే వచ్చింది పీడ' అన్నది తెలంగాణలో తరచుగా వినిపించే మాట. ఇందులో కొంత నిజం ఉంది. కానీ ఈ నమ్మకాన్ని అడ్డంపెట్టుకొని ప్రజల పట్ల జవాబుదారీతనం ఉండాల్సిన ప్రాథమిక బాధ్యతను తప్పించుకొని 'ఇది పార్టీ నిర్ణయం కాదు, స్థానిక కార్యకర్తల పొరబాటు' అని తేలికగా తప్పించుకోవడం అన్నలకు చాలా సులభం అయిపోయింది. ఈ సదుపాయాన్ని వారు నిస్సంకోచంగా వాడుకుంటున్నారని చెప్పాలి.

ఈ పార్టీలు తప్పు ఒప్పుకోవడం కేవలం తప్పించుకునే మార్గం అని నమ్మడానికి ఆధారం కల్పించే సంఘటనలున్నాయి. వరంగల్ జిల్లా భగీరథపేటలో శ్యాంసుందరరెడ్డి హత్యను పైన ప్రస్తావించాను. ఆ చర్య పట్ల తీవ్రంగా నిరసన వచ్చిన తరువాత 'అది మిలిటెంట్ల పొరబాటు' అని పీపుల్స్‌వార్ ప్రకటించింది. ఆ మిలిటెంట్లకు ఏ శిక్ష వేసారని

అడిగేపాటి చొరవ ఎవరికీ లేదు. ఒప్పుకోవడమే పదివేలని అందరూ ఊరుకున్నారు. కానీ ఆశ్చర్యంగా ఆ తరువాత మృతుని కుటుంబంపైన వేధింపు కొనసాగుతూ ఉంది. వాళ్ళ భూమి బీడు పెట్టాలని ఆంక్ష విధించారు. ఇంకేం జరుగుతుందోనన్న భయానికి ఆ కుటుంబం మొత్తంగానే ఊరు విడిచిపెట్టి పోయే పరిస్థితి ఏర్పడింది.

బాధితులకు కొంత మానసిక ఉపశమనం కల్గించడం కోసం తప్పు ఒప్పుకున్నట్టు సందేశం పంపించి, ఆ విషయం బయటి ప్రపంచానికి చెప్పకుండ, తప్పుకు బాధ్యులయిన కార్యకర్తలపైన ఏ చర్య తీసుకోకుండ తప్పించుకునే ఎత్తుగడ ఈ పార్టీలకు బాగా అలవాటయింది. లేదా 'పార్టీనాయకులు కార్యకర్తలను తప్పు పట్టారంట' అన్న సమాచారం ప్రచారం చేసుకోవడమే తప్పుకు వీరిచ్చే పరిహారం కావచ్చు. అంటే ఏదో ఒకరకంగా పార్టీపైన ఉన్న విమర్శను చల్లబరచడమే వారి లక్ష్యం తప్ప జవాబుదారీతనాన్ని సంపూర్ణంగా పాటించడం కాదు.

నిజామాబాద్ జిల్లాలో మాదిగ యువకుడు రాజు హత్య గురించి పైన చెప్పాను. ఆ ఘోరానికి ఇప్పటికీ పీపుల్స్‌వార్ సంజాయిషీ చెప్పుకోలేదు. దానికి ఎవరి మీదా చర్య తీసుకోలేదు. (అయితే ఈ మధ్య ఇద్దరు ముఖ్యులను ఆ జిల్లాలో 'డిమోట్' చేసినట్టు తెలుస్తున్నది. దానికీ ఈ హత్యకూ ఏమైనా సంబంధం ఉందోలేదో తెలీదు.) కానీ హత్య జరిగిన తరువాత దాదాపు రెండు సంవత్సరాలకు ఒక దినపత్రికలో (ఒకే ఒక పత్రికలో) ఊరూపేరూ లేని (అంటే ఎవరు చెప్పారో ఎట్లా తెలిసిందో చెప్పని) వార్త వచ్చింది. పీపుల్స్‌వార్ కేంద్రకమిటీ నాయకుడొకడు నిజామాబాద్‌కు వచ్చినట్లు 'తెలిసింది' అనీ, రాజు హత్య గురించి ఆయన జిల్లాకమిటీని విమర్శించినట్లు 'తెలిసింది' అనీ ఆ వార్త కథనం. తప్పొప్పుకోకుండ, పరిహారం చెల్లించకుండ, క్షమాపణ అడగకుండ, దోషిపైన చర్య తీసుకోకుండ, పార్టీ పరువు కాపాడుకోవడానికి స్నేహంగా ఉండే ఒక విలేకరిని పట్టుకొని ఈ వార్త రాయించుకున్నారా? లేక పీపుల్స్‌వార్ సానుభూతిపరుడయిన విలేకరే పార్టీ ఎప్పటికీ రాజు హత్య విషయంలో పెదవి విప్పక పోవడం చూసి బాధపడి పార్టీ పరువు కాపాడడానికి ఈ వార్త ఊహించి, లేక కల్పించి రాసాడా? ఏదయినా కావచ్చు.

వరంగల్ జిల్లా గోపాలపురంలో పీపుల్స్‌వార్ చంపిన దేవరాజు హత్య గురించి చెప్పాను. అది తప్పని ఆ పార్టీ ఇప్పటికీ ఒప్పుకోలేదు గానీ, మా యింట్లో అన్నం తిని మమ్మల్నే చంపిపోతారా అని గొడవ చేసిన దేవరాజు భార్యకు మాత్రం 'తప్పయిపోయింది' అని ఎవరి ద్వారానో కబురు పంపించారని తెలుస్తూ ఉంది. చాలాకాలం ఆ పార్టీ అనుయాయులుగా ఉన్నవారే కాబట్టి వారిమీద గౌరవం కొద్దీ 'పోనీలే ఒప్పుకుంటున్నారు కదా' అని ఆమె సంతృప్తి చెందవచ్చు. ఆమెకు చెప్పిన సంగతి పదిమందికీ ప్రచారం చేసి 'తప్పొప్పుకున్నట్టే'నని ఆ పార్టీ అనుయాయులు విమర్శను శాంతింపచేయవచ్చు. (ఈ రకమైన ప్రచారం చేయడం ఒక ముఖ్య కర్తవ్యంగా పెట్టుకున్నవారు చాలా మందే ఉన్నారు.) ఆ రకంగా అన్నలు తాము చేసిన ఘోరానికి చేతులు కడిగేసుకోవచ్చు. పైకి మాత్రం ఏమీ ఒప్పుకోరు. ప్రజాముఖంగా దేవరాజు

భార్యనుండి క్షమాపణ కోరుకోరు. అది ఎందుకు జరిగిందో పారదర్శకంగా వివరించరు. దానికి బాధ్యులయిన వారి పైన చర్య తీసుకోరు. కాని వారు ప్రజాకోర్టులు పెట్టేటప్పుడు మాత్రం (ఈ మధ్య కాలంలో ఏ ప్రజాకోర్టు పెట్టకుండానే శిక్షలు వేయడం ఎక్కువయి పోయిందనుకోండి) ప్రజాముఖంగా, బహిరంగంగా తప్పు ఒప్పుకొని తీరాలని పట్టుబడతారు. ప్రజలకొక నియమం, పాలకులకొక నియమం అనే రాజ్యం నీతి జ్ఞాపకం వస్తున్నదా? వస్తుంది మరి. శ్రీకాకుళంలో పీపుల్స్‌వార్ వాళ్ళు ఇన్‌ఫార్మర్ అని (*1969* నుండి ఇన్‌ఫార్మర్ అని) ముద్రవేసిన దళిత నాయకుడు పాపయ్య మాస్టారు విషయంలో కూడ అదే జరిగింది. ఆయన మీద వేసిన నిందలు బహిరంగంగానే వేసారు. ఆయనను అప్రతిష్ఠ పాలు చేసారు. కానీ తరువాత మాత్రం 'పైకమిటీ జిల్లా కమిటీని తప్పుపట్టిందంట' అనే ఒక వాక్యంతో ప్రజాముఖంగా ఏమీ ప్రకటించకుండా ఆయనను సంతృప్తిపరచి ఆ ఉదంతానికి ముగింపు పలికారు.

అయితే చాలాసార్లు ఈ మాత్రం కూడ ఉండదు. ప్రశ్నించిన వాళ్ళను దబాయించి నోరుమూయించే ప్రయత్నం చేస్తారు. లక్ష్మణచాందాలో పీపుల్స్‌వార్ చంపిన టీచర్ చిన్నారెడ్డి ఉదంతం దీనికొక ఉదాహరణ. అతనిని చంపినపుడు అతని మీద తీవ్రమైన అభియోగాలు పెట్టారు. అయితే అతనికి తన భార్య కాని మరొక స్త్రీతో లైంగిక సంబంధం ఉందన్న 'వ్యభిచార' నేరం (దానిని వ్యభిచారం అనదలచుకుంటే) తప్ప వేరే దేనికీ ఆధారం ఇప్పటిదాకా చూపించలేదు. అతని భార్య, గ్రామ ప్రజలు ఆ హత్యకు తీవ్రంగా నిరసన వ్యక్తం చేసిన తరువాత ఒక కొత్త ఆరోపణ చేర్చారు. అతను నిర్మల్‌లో ఉండే మల్లారెడ్డి అనే తన బంధువయిన లాయర్-కమ్-క్రిమినల్‌కు రైట్ హ్యాండ్ అన్నారు. ఆ మల్లారెడ్డిని ఎన్నడూ ఏమీ అనని వారు ఈ 'రైట్‌హ్యాండ్'ను మాత్రం ఎందుకు చంపారనే ప్రశ్నకు జవాబులేదు. ఆ విషయమైనా తొలినాటి అభియోగాలైనా రుజువు చేయడానికి తమ నియమాల ప్రకారమే 'ప్రజాకోర్టు' పెట్టవలసి ఉండిందికదా, ఎందుకు పెట్టలేదనే దానికి కూడ జవాబు లేదు. (నేరాలు ప్రజాకోర్టులో రుజువయిన తరువాతే చర్య తీసుకుంటారన్న నియమాన్ని ఈ పార్టీలు విడిచిపెట్టి చాలా కాలం అయిందనుకోండి.)

ఇందులోని అనైతికతతో పాటు అనిశ్చితిని కూడ అర్థం చేసుకోవాలి. అది కలిగించే భయాన్ని అర్థం చేసుకోవాలి. తప్పు చేయరు. చేస్తే ఒప్పుకుంటారు. ఒకసారి ఒప్పుకుంటే దానికి కట్టుబడి ఉంటారు. తప్పుచేసిన వారిని మళ్ళీ తప్పు చేయకుండ దండిస్తారు. బాధితులకు ఏదో ఒక రూపంలో పరిహారం చెల్లిస్తారు. (బహిరంగంగా క్షమాపణ కోరుకోవడమే కావచ్చు.) తప్పు ఒప్పుకోనప్పుడు ఒప్పుకున్నట్లు నటించరు. నిజమైన సంజాయిషీ చెప్తారు తప్ప బూటకపు సంతృప్తి ఇచ్చి సంతోషపెట్టరు - ఒక్కమాటలో చెప్పాలంటే తమ తప్పుల విషయంలో న్యాయంగా, పారదర్శకంగా ఉంటారు అనే నమ్మకం ఉన్నచోట భయం ఉండదు. అది లేనిచోట అనిశ్చితి నుండి పుట్టే భయం ఉంటుంది. ఆ భయం విప్లవపార్టీల ఆధిపత్యాన్ని పెంచుతుంది. కానీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. మొదటి దానికంటే రెండవదే తమకు ముఖ్యమని ఈ పార్టీలు అంటాయి. కానీ రెండవదాని కంటే మొదటిదానికే ప్రిఫరెన్స్ ఇస్తారని వారి ఆచరణ తెలుపుతుంది.

కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను దహనం చేసి 40కి పైగా ప్రాణాలు తీసింది తమ కార్యకర్తలేనని తెలిసి కూడ ఆ కార్యకర్తలే లొంగిపోయి బయట పెట్టేదాకా పీపుల్స్‌వార్ ఒప్పుకోలేదని అందరికీ జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఇది పాత విషయం అనీ దానిని పదేపదే తవ్వి తీయడం అన్యాయమనీ అంటారు. కానీ ఈ మధ్యనే వరంగల్‌లో చంపిన విప్లవరచయిత, జనశక్తి సానుభూతిపరుడు అయిన పెండ్యాల కిషన్‌రావు సంగతి? అతన్ని చంపినవాళ్ళను పీపుల్స్‌వార్ కార్యకర్తలుగా చెన్నూరు గ్రామస్తులు గుర్తించారు. కానీ కొన్నిరోజుల తరువాత 'మేముకాదు' అని పీపుల్స్‌వార్ అనింది. ఇది నిజమా? లేక ఇబ్బందికరమైన వాస్తవాన్ని ఒప్పుకోవడానికి ముఖం చెల్లక చెప్తున్న అబద్ధమా?

నేనిచ్చిన ఉదాహరణలన్నీ పీపుల్స్‌వార్‌కు సంబంధించినవేగానీ ఈ అవలక్షణం కేవలం ఆ పార్టీది కాదు. కార్యకర్తలు సమస్యలతో ముఠా పద్ధతిలో వ్యవహరించడం, ఏకపక్షంగా నడచుకొని అన్యాయం చేయడం, నాయకత్వం వారిని కంట్రోల్ చేయకపోవడం, నాయకులు మాత్రం మంచివాళ్ళే అవగాహన ఉన్నవాళ్లేనన్న అభిప్రాయాన్ని నిలబెట్టుకునే మేరకు విమర్శకులను మెప్పించి ఊరుకోవడం, మొదలయిన అవలక్షణాలు అన్ని ఎం-ఎల్ పార్టీలలోనూ ఉన్నాయి. మెదక్ జిల్లా గోపులాపురం గ్రామంలో ఒక తోవ వివాదంలో గ్రామస్తుల ముఠాతత్వాన్ని జనశక్తి కార్యకర్తలు పెంచిపోషిస్తూ సమస్య పరిష్కారం కాకుండా చేస్తున్న వైనం దీనికొక ఉదాహరణ. గోపులాపురం పక్కన ఉన్న మాటిల్ల అనే గ్రామానికి మెయిన్ రోడ్డుతో (సిద్దిపేట నుండి సిరిసిల్లకు పోయే రోడ్డుతో) లింక్ కావాలంటే, గోపులాపురానికి చెందిన మైసయ్య అనే రైతు భూమిలోనుండి తోవ తీయాలి. దానికి వేరే మార్గం లేదు. అతనికి ఎక్కువ నష్టం జరగకుండ ఉండే పద్ధతిలో తోవ తీయవలసి ఉంటుంది. ప్రజలకు తమ సమస్యలు తామే పరిష్కరించుకోవడం (బూర్జువా కోర్టులకు పోకుండ) నేర్పుతున్నామని ఎం-ఎల్ పార్టీలు చెప్పేది అక్కడ అమలయి ఉంటే దాదాపు ఒక దశాబ్ద కాలంగా జనశక్తికీ పీపుల్స్‌వార్‌కూ బలం ఉన్న ఆ గ్రామాలలో ఆ సమస్య ఎన్నడో పరిష్కారం అయ్యేది. కానీ పరిష్కారం కాకపోగా ఒక పుండయి కూర్చుంది. మైసయ్య భూమిని మధ్యగా చీలుస్తూ తమకు బాట కావాలని మాటిల్ల గ్రామస్థుల పట్టుదల. బాట ఇస్తానుగానీ మధ్యనుండి ఇచ్చి వ్యవసాయం పాడు చేసుకోలేనని మైసయ్య అంటాడు. ముఠాతత్వం లేని గ్రామంలో ఇటువంటి సమస్యలు ఎవరో పెద్దమనుషులు పరిష్కారం చేస్తుంటారు. కానీ గోపులాపురం-మాటిల్లల మధ్య అది సాధ్యం కాక సమస్య కోర్టు కెక్కింది. సిద్దిపేట ఎం.ఎల్.ఏ చొరవతో కోర్టులో రాజీ అయింది. మైసయ్య భూమిలో నుండే-కానీ మధ్యనుండి కాకుండా - తోవ తీసేటట్టు రాజీ అయింది. అయితే తోవ మధ్య నుండే కావాలని మాటిల్ల గ్రామస్తులు పట్టుబట్టసాగారు. తమ మొండిపట్టుకు ఏ పార్టీ మద్దతు ఇస్తే ఆ పార్టీ వెంట పోతున్నారు. కొన్నాళ్ళు సిపిఐ కార్యకర్తలు మద్దతిచ్చారు, కొన్నాళ్ళు రాడికల్స్ ఇచ్చారు. అయితే మైసయ్య ప్రతీసారీ ఆ పార్టీల నాయకత్వాలతో మాట్లాడి, తనదే న్యాయం అని నచ్చజెప్పి, వారి కార్యకర్తల సపోర్టు మాటిల్లకు లేకుండ చేసాడు. అయితే ప్రస్తుతం జనశక్తి కార్యకర్తలు మాటిల్ల రైతుల పక్షాన రంగంలోకి దిగారు. మైసయ్య ఆ పార్టీ నాయకత్వానికి మొరపెట్టుకొని ప్రయోజనం లేక

పోయింది. ఆ పార్టీనాయకులు తమ కార్యకర్తలదే తప్పని చూచాయగా ఒప్పుకున్నారు. అయితే ఈ లోపల మైసయ్య పక్షాన పీపుల్స్‌వార్ రంగప్రవేశం చేయడం వల్లనో లేక జనశక్తి నాయకత్వం తన కార్యకర్తలను కంట్రోల్ చేయలేక పోవడం వల్లనో గాని వారు కంట్రోల్ కావడం లేదు. సమస్య కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు మైసయ్య భూమిలో రెండు తోవలున్నాయి. ఒకటి తానిచ్చింది, ఒకటి మాటిల్లవాళ్ళు తీసింది. ఒకటి పీపుల్స్‌వార్ తోవ, ఒకటి జనశక్తి తోవ.

'మేమేమయినా తప్పులు చేస్తే ప్రజలే మమ్మల్ని నిలదీస్తారు' అని ఈ పార్టీలు అంటుంటాయి.(మేధావుల నోరు మూయించడానికి) సంఘటితంగా, రాజకీయంగా, వీరిని నిలదీయడానికి ప్రయత్నం చేసినవారు చావు దెబ్బలు తిన్న సంఘటనలు చాలానే ఉన్నయి గానీ అసంఘటితంగా, స్పాంటేనియస్‌గా, ఏ నాయకత్వం లేకుండ, ఏ రాజకీయం లేకుండ ప్రజలు వీరిని నిలదీసిన ఘటనలూ, వీరు తప్పొప్పుకున్న ఘటనలూ లేకపోలేదని మొదట్లో అన్నాను. కానీ పీపుల్స్‌వార్ జనశక్తి పార్టీల ముఠా కొట్లాటలు ఆపడానికి ప్రయత్నం చేస్తున్న గోపులాపురం స్త్రీలకు మాత్రం ఇప్పటిదాకా నిస్పృహే ఎదురయింది.

దాదాపు ఎనిమిది సంవత్సరాలుగా పీపుల్స్‌వార్ జనశక్తి పార్టీల మధ్య ఘర్షణకు గోపులాపురం, జక్కాపూర్, వాటి పరిసర గ్రామాలు కేంద్రంగా ఉన్నాయి. వాళ్ళొచ్చి వీళ్ళ సానుభూతిపరులను కొట్టి పోతారు. వీళ్ళొచ్చి వాళ్ళ సానుభూతిపరులను కొట్టి పోతారు. సమస్యలలో చెరి ఒక పక్షం తీసుకొని పెంచుతారు. దీనితో విసిగిపోయిన గోపులాపురం స్త్రీలు కొందరు ఈ మధ్య ఒక నిర్ణయానికొచ్చి రెండు పార్టీలనూ గ్రామంలోకి ఒకేసారి వచ్చి బహిరంగంగా ప్రజలముందు నిలబడమని కోరారు. ఉభయపార్టీల అండర్‌గ్రౌండ్ నాయకులనూ వెంటబడి పట్టుకొని కష్టపడి ఒప్పించారు. ఇచ్చినతేదీకి రాకపోతే మళ్ళీ వెతికి పట్టుకొని ఒప్పించి ఇంకొక డేట్ పెట్టారు. ఎట్లాగైనా ఇద్దరినీ గ్రామం రచ్చబండ దగ్గర నిలబెట్టి ప్రజాముఖంగా సంజాయిషీ అడగాలని ఆ స్త్రీల కోరిక. వారు అడిగినప్పుడు, 'మీరు రమ్మంటే రామా, తప్పక వస్తాం' అనీ 'ప్రజలకు మమ్మల్ని నిలదీసే హక్కుంది' అనీ రెండు పార్టీల నాయకులూ అన్నారు. కానీ ఇచ్చిన డేట్‌కు ఒకరు వస్తే ఒకరు రారు. చివరికి ఈ మధ్య జక్కాపూర్‌లోని ఒక జనశక్తి సానుభూతిపరుడిని పీపుల్స్‌వార్ హత్యచేసి గోపులాపురం స్త్రీల ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పెట్టింది. వెంటనే దానికి ప్రతీకారంగా జనశక్తి వాళ్ళు గోపులాపురంకు చెందిన ఓ పీపుల్స్‌వార్ మిలిటెంట్‌నూ మరొక గ్రామానికి చెందిన పీపుల్స్‌వార్ సానుభూతిపరుడయిన ఒక ఆర్.ఎం.పి డ్యాక్టర్‌నూ చంపారు. ప్రజలంటే గౌరవం, ప్రజలపట్ల తమ జవాబుదారీతనాన్ని గుర్తించే సంస్కృతి మాటలలోనే తప్ప చేతలలో లేవని ఇద్దరూ రుజువు చేసారు.

## 9

ఎం-ఎల్ పార్టీలకు చెప్పుకోదగ్గ ప్రజాదరణ ఉందని మొదట్లో అన్నాను. దాని స్వభావమేమిటో కూడ కొంచెం చూద్దాం. ఏయే వర్గాలు వీరిని ఆదరిస్తున్నాయన్నది దీనికి పూర్తి జవాబు కాదు. ప్రధానంగా పేదలు, అణగారిన కులాలకు చెందినవారు, కొంతమేరకు

మధ్యతరగతికి చెందినవారు వీరిని ఆదరిస్తారు. ఆ కుల-వర్గాల లోనూ ఎం-ఎల్ పార్టీల అనుయాయులు కానివారు, వ్యతిరేకించేవారు ఉంటారు. కానీ మద్దతు ప్రధానంగా ఆ కుల-వర్గాలలోనే ఉంది. అయితే ఈ విధంగా చెప్పుకుంటే సరిపోదు. మద్దతు ఇచ్చేవారు తాము ఆ కుల-వర్గాలకు చెందినవారయినందువల్లనే, అంటే ఎం-ఎల్ రాజకీయాలు వారి జీవనస్థితిగతులకు తగిన రాజకీయాలు కావడం వల్లనే ఆదరిస్తారన్న అభిప్రాయం కలుగుతుంది. అందువల్ల ఏయే కారణాలచేత వారికి మద్దతు లభిస్తుందో విడగొట్టి చెప్పుకోవడం అవసరం. అప్పుడే ఈ ప్రజాదరణను చూసి మొత్తంగా సంతోషించాలా లేక దానిని ఏవిధంగా అర్థం చేసుకోవాలి అనేది తెలుస్తుంది.

విప్లవ కమ్యూనిస్టు రాజకీయాల అంతిమ ఆదర్శాలకు ఆకర్షితులయి మద్దతునిచ్చే వారుంటారు. వీరు బహుశా అతికొద్దిమంది. తమ బోటి పేదలు, దళితులు అనుభవిస్తున్న లేమినుండి, అణచివేతనుండి విముక్తి పొందడానికి ఈ ఉద్యమాల నుండి చేయూత లభించిందని (పెరిగిన కూలిరేట్లవల్ల, అక్కడక్కడ దొరికిన భూముల వల్ల, దెబ్బతిన్న దొరతనపు పీడనవల్ల) ఆదరించే వారుంటారు. సామాజికంగా బలం లేని ఈ ప్రజలకు బలం అందిచ్చారని ఆదరించే వారుంటారు. వీరిలో మళ్ళీ ఆ బలాన్ని రాజకీయాలలో చూసేవారు కొందరు కాగా పేదయువకుల చేతిలో పెట్టిన బాంబులు, గ్రెనేడ్లు, 'అన్నల మనుషులం' అన్న దబాయింపులో చూసేవారు ఎక్కువ మంది. దైనందిన జీవిత వివాదాలకు కచ్చితమైన పరిష్కారం ఇచ్చే శక్తిగా కూడ వీరికి ఆదరణ ఉంది. వివాదాల పరిష్కార వ్యవస్థ ఒకటి ప్రజలకు చాలా అవసరం. సంప్రదాయ వ్యవస్థలు బాగా దెబ్బతిని ఉన్నాయి. రాజ్యవ్యవస్థ అసమర్థంగా ఉంది. 'అన్నలు' అన్ని విషయాలలోనూ న్యాయం చేసినా చేయకున్నా (న్యాయం చేసిన ఘటనలూ ఉన్నాయి, తొందరపాటుతోనూ అవగాహనాలోపంతోనూ ఆశ్రితపక్షపాతంతోనూ అన్యాయం చేసినవీ ఉన్నాయి) వారి పరిష్కారాలను అమలు చేసే సత్తా వారికి ఉంది. దానినుండి వచ్చే ఆదరణ ఉంది. ఆ సత్తావల్లనే, గ్రామ రాజకీయాలలోనూ వ్యక్తిగత వివాదాలలోనూ వివిధ ప్రజాశ్రేణుల మధ్య జరిగే ఘర్షణలలోనూ వారిని ఆశ్రయిస్తే ప్రయోజనం ఉండగలదని గుర్తించి వారిని ఆదరించే వారుంటారు. అన్నల మనుషులుగా చలామణి అయితే వచ్చే వ్యక్తిగత ప్రయోజనాలకోసం (అది అన్నలు తెలిసీ రాజీ ధోరణిలో తమ అవసరాల కోసం అనుమతించే ప్రయోజనం కావచ్చు, వారికి తెలియక అమలు చేసుకునేది కావచ్చు) వారి వెంటపోయే వారుంటారు. రాష్ట్రంలో ఒక పార్టీ అధికారంలో ఉన్నప్పుడు (లేదా ఒక నియోజకవర్గంలో ఒక పార్టీకి చెందిన వ్యక్తి ఎంఎల్ ఏ గా ఉన్నప్పుడు) వైరి వర్గం వారు అన్నలతో మంచిగా ఉంటే ప్రయోజనాలుంటాయని గుర్తించి వారిని ఆదరిస్తారు. అటువంటి ఆదరణా ఉంటుంది. ఎం-ఎల్ పార్టీలు బాగా బలంగా ఉన్న గ్రామాలలో వేరే రాజకీయాలతో ఉండడం వల్ల ప్రయోజనం ఉండదు కాబట్టి (ప్రయోజనం లేకపోగా అన్నల దాదాగిరీకి బలిఅయ్యే ప్రమాదమూ ఉంటుంది కాబట్టి) వారినే ఆదరించే వారుంటారు. అప్పుడు ఆ గ్రామంలోని సకల రాజకీయ శక్తులు వారిని ఆకర్షించాలనే చూస్తుంటారు. రెండు ఎం-ఎల్ పార్టీలు సంఘర్షించుకుంటున్న ప్రాంతాలలో ఇటువైపో అటువైపో ఉండి వారి ముఠాతత్వాన్ని తమ ప్రయోజనాల కోసం వాడుకునే అవకాశం

ఉంటుంది కాబట్టి అందుకోసం చేరువయ్యేవాళ్ళు ఉంటారు. తమ ఆధిపత్య వ్యూహంలో భాగంగా అన్నలే ప్రోత్సహించదలచుకున్న వ్యక్తులు తమకు ఉన్న సామాజిక సంబంధాలనూ మంది బలాన్నీ అన్నల పక్షాన ఉంచడం ద్వారా అన్నలకు లభించే మద్దతు ఉంటుంది. చివరగా బలం ఉన్నవాళ్ళ వెంటపడిపోయే జనం ఎల్లప్పుడూ ఉంటారు.

వీటిలో కొన్ని ఒకసామాజిక వర్గానికీ మరికొన్ని మరొక సామాజిక వర్గానికీ చెంది ఉండాలన్న నియమమేమీ లేదు. పైన పేర్కొన్న వాటిలోని మంచి కారణాలతో పాటు అవకాశవాద కారణాలు కూడ పేదలకూ దళితకులాలకూ సహితం వర్తించగలవు. నిజాంకాలేజి గ్రౌండ్‌లో అన్నల మీటింగ్‌కు వచ్చే లక్షల జనంలో ఈ అన్నిరకాలూ ఉన్నారని గుర్తిస్తే తప్ప వీరి ప్రజాదరణ గురించి అతిశయోక్తులు లేని సరయిన అంచనా సాధ్యం కాదు. (మీటింగ్ జనంలో ఈ శ్రేణులేకాక, అన్నలు ఏ ఎం.ఎల్.ఏ నో మండల ప్రెసిడెంట్‌నో బెదిరించి లారీలు పెట్టిస్తారు కాబట్టి ఫ్రీగా హైదరాబాద్‌పోయి గద్దర్ పాటలు వినొద్దామని వచ్చే బాపతు కూడ ఉంటారు. జనసమీకరణ వెనుక ఉన్న ఈ వివిధ కారణాలతో పోల్చి చూసినప్పుడు ఈ మీటింగ్‌లలో వక్తలిచ్చే ఉపన్యాసాలలోని గొప్ప విలువలు కొంత మేర్కైనా అసంగతమని తోచక తప్పదు.)

ఈమధ్య కాలంలో రైతాంగం సమస్యలు చేపట్టే ఉద్యమాలను ప్రోత్సహించే కొత్తప్రయోగం పీపుల్స్‌వార్ చేస్తున్నది. ఇవి తాము రాజకీయంగా నిర్మించే ఉద్యమాలు కావు. తాము వెనక ఉండి ఇతరుల ద్వారా నడిపిస్తున్న ఉద్యమాలు. లేదా ఉద్యమ కార్యనిర్వాహక కమిటీలో తమ అనుయాయులను చొప్పించి వారి నియంత్రణలో నడిపించే ఉద్యమాలు. సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం, గిట్టుబాటు ధరలకోసం, ఇతర రైతాంగ సమస్యల గురించి, ఉద్యమాలు నడపడానికి ఉత్సాహం చూపుతున్న వ్యక్తులను (వారి రాజకీయం ఏదయినప్పటికీ) చేరదీసి (వాళ్ళు అప్పటికే ఒక ఉద్యమం నడుపుతున్నట్టయితే ఆ ఉద్యమాన్ని తమ అదుపులోకి తీసుకొని) తమ ఆదేశాల ప్రకారం నడిపిస్తున్నారు. ఆ వ్యక్తికీ ఆ ఉద్యమానికీ 'అన్నలమనిషి' 'అన్నలు వెనకుండి నడిపిస్తున్న ఉద్యమం' అన్న గుర్తింపు ఉంటుంది కాబట్టి సమాజం 'భయభక్తుల'తో నడుచుకుంటుంది. అదే ఒక బలం కాబట్టి దానివల్ల ప్రయోజనం ఉంటుందని (తమకు కావచ్చు, తాము నడుపుతున్న ఉద్యమానికి కావచ్చు) ఆ వ్యక్తులు భావిస్తారు. (భావించినా భావించకపోయినా పీపుల్స్‌వార్ అజమాయిషీని తిరస్కరించే స్వేచ్ఛ వారికి లేదనుకోండి.) రైతాంగం కూడా ఒక 'బలమైన' శక్తి తమతో ఉందని సంతోషిస్తారు. ఊళ్ళో వచ్చినప్పటినుండి ఎవడి భూమి బీడు పెట్టించాలా, ఎవడి కాళ్ళు విరగ్గొట్టాలా అని చూసే బదులు రైతాంగానికి ఉపయోగకరమైన ఉద్యమాలకు తమ సత్తాను జోడించి ముందుకు నడిపించడం రైతాంగానికి నిజంగానే కొంత సంతోషం కలిగిస్తుంది. (ఎట్లాగూ అన్నల అదుపాజ్ఞలలో బతకక తప్పనప్పుడు అది కొంత తమకు కూడ ఉపయోగపడడం సంతోషకరమైన విషయమే కదా.) ఇప్పటివరకు ఇందులో అపశృతులేవీ లేవు గానీ రిమోట్‌కంట్రోల్ ద్వారా నడిపించే ఈ ఉద్యమాలు తమ దాదాగిరీకే బలికాకుండా చూసుకోవడం అవసరం. ఈ ప్రయోగం నిజానికి పూర్తిగా కొత్తది కాదు. తెలంగాణలోని పారిశ్రామిక ప్రాంతాలలో పీపుల్స్‌వార్ ఇప్పటికే కార్మిక ఉద్యమాన్ని ఈ పద్ధతిలో తన అదుపులోకి తీసుకుంటూ ఉంది. పోటీ పడుతున్న వివిధ సంఘాల

నాయకులలో ఒకడిని చేరదీసి తన సలహాల ప్రకారం నడుచుకొమ్మని చెప్పి రంగంలోకి దింపుతుంది. ఆ తరువాత అతను సాధారణంగా 'ఏకగ్రీవంగా' కార్మిక సంఘానికి ఎన్నిక అవుతాడు. యాజమాన్యం కూడ విషయం గ్రహించి అతనికి తగు గౌరవం ఇస్తుంది. కార్మికులూ సంతోషిస్తారు. అయితే ఈ రకమైన ప్రయోగంలో అవకాశవాదానికి చాలా తావు ఉంటుంది. అన్నలు నియమించిన నాయకుడి అవకాశవాదం కావచ్చు, అతనిని ఎట్లాగయినా పక్కకు తప్పించి తామే అన్నల ఆశీస్సులు పొందుదామని చూసే ప్రత్యర్థుల అవకాశవాదమయినా కావచ్చు, అవసరం తీరేదాకా అతనిని వాడుకొని ఇక చేయిదాటి పోతున్నాడనుకున్నప్పుడు పక్కకు తప్పించే అన్నల అవకాశవాదమైనా కావచ్చు. దీని ఫలితంగా ఆ నాయకులు చివరికి అన్నల చేతిలోనే దెబ్బలు తినే పరిస్థితి రావచ్చు. ఉద్యమాలను రాజకీయంగా, సూత్రబద్ధంగా కాకుండా రిమోట్‌కంట్రోల్‌ద్వారా నడిపించడానికి ప్రయత్నిస్తే అనారోగ్యకరమైన పరిణామా లుండడం సహజం. గోదావరిఖనిలో అన్నల ప్రోత్సాహంతో ఎడ్లబండ్ల సంఘం పెట్టి బాగా చలామణి అయిన వ్యక్తిని (ఇతనిపేరు నర్సయ్య అనుకుంటాను) చివరికి సికాస వారే రెండు కాళ్ళు విరగ్గొట్టి నిమ్స్‌లో పడేసారు. రెండు లక్షలు ఖర్చుపెట్టుకొని రెండుసార్లు ఆపరేషన్ చేయించుకున్నా అతను అవిటివాడిగానే ఉండిపోయేటట్టున్నాడు. బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మిక సంఘానికి ఇదే విధంగా పెద్దపల్లి దళం ఆశీస్సులతో నాయకుడయిన ఐలయ్యను కూడ ఈ మధ్యనే అదే దళం చితకబాదింది - మేనేజ్‌మెంట్ మనిషి అయిపోయాడన్న అభియోగంతో. అతను తెలుగుదేశం పార్టీకి చెందిన రామగుండం మండల జడ్‌పిటిసి ప్రతినిధి. రైతాంగ, కార్మిక సంఘాలకు పీపుల్స్‌వార్ నియమించి నడిపిస్తున్న నాయకులలో నిజాయితీ పరులయిన స్వాతంత్ర్య సమర యోధుల నుండి సాదాసీదా కాంగ్రెస్ తెలుగుదేశం నాయకులేకాక వట్టి దాదాగిరీ చేసి బ్రతికే బాపతు మనుషుల దాకా చాలారకాలు ఉన్నారు. పెరుగుతున్న ఆ పార్టీ ఉద్యమాన్నీ ప్రజాబలాన్నీ ఈ దృష్టితో విమర్శనాత్మకంగా చూడడం అవసరం.

రైతాంగంలోకి 'చొచ్చుకుపోవడమే' కాక ఆ పార్టీ ఇప్పుడు సమిష్టి మానవ సంబంధాల ప్రాతిపదికన 'నూతన వ్యవస్థ' నిర్మాణానికి శ్రీకారం చుట్టేస్తూ ఉన్నదనీ, ఆ పార్టీ పోరాట ప్రాంతాలలో ప్రజలలో సమిష్టి తత్వం ముందుకొచ్చి రాబోయే దినాలకు సంకేతంగా ఉందనీ ఈ మధ్య కొందరు మేధావులు అంటున్నారు. ఇది కొంచెం ఆశ్చర్యం కలిగించే విషయమే. చంపడం, చావడం తప్ప మీ ఉద్యమంలో వేరే ఏమీ లేదా అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేక నీరసించిన వారికి ఏదో కొంచెం దొరకగానే ఉత్సాహం ఆగుతున్నట్టు లేదు.

రైతాంగంలో కొన్నిరకాల సహకార సంఘాల ఏర్పాటుకు పీపుల్స్‌వార్ ఈ మధ్య సహాయపడుతున్న మాట వాస్తవమే. దీనిలో ఎవ్వరూ ఎక్కడా చూసి ఎరుగని కొత్తదనం ఏమిటన్నదే ప్రశ్న. ఎరువులు, మందుల కొనుగోలులో మధ్యదళారుల దోపిడీకి అవకాశం లేకుండ చేయడం కోసం తన బలం ఉన్న గ్రామాలలో కొనుగోలుదార్ల సహకార సంఘాలు పెట్టించి వాటికి మూలధనం కొంత తాను సరఫరా చేస్తున్నది. ఇది మంచి పనేకానీ ఏ కమ్యూనిస్టు పార్టీ ప్రమేయం లేని ఎన్ని గ్రామాలలో ఇటువంటి సహకార సంఘాలు లేవు? ఆదర్శవంతులయిన పెద్ద మనుషులున్న గ్రామాలలో రైతులు ఇటువంటి సహకార సంఘాలు

పెట్టుకొని దళారుల బెడద తప్పించుకుంటున్న ఉదాహరణలు ఎన్ని లేవు? ఇందులో అకస్మాత్తుగా 'నూతన వ్యవస్థ' ఎక్కడినుండి వచ్చేసింది? గుజరాత్, మహారాష్ట్రలలోనయితే గాంధేయవాదులు, సర్వోదయవాదులు, స్వచ్ఛంద సంస్థలు, కాంగ్రెస్ వాదులు రైతాంగ సహకార ఉద్యమాన్ని కొనుగోలుదార్ల సంఘాలను దాటి చాలాదూరం తీసుకుపోయారు. దానిని కమ్యూనిస్టులు నూతన వ్యవస్థ అని ఏనాడూ అనకపోగా సంస్కరణల మీద భ్రమలు కలిగించే పెటీ బూర్జువా రాజకీయం అన్నారు. ఇన్నాళ్ళకు (రైతాంగంలో పునాది సంపాదించడం కోసమే కానీయండి) అటువంటి ప్రయోగాలు తాము సహితం చేపట్టడం హర్షణీయమే గానీ, అంతలోనే నూతన వ్యవస్థ ఛాయలు ఎక్కడ కనిపించేసాయి? ఇతరులు చేస్తే సంస్కరణవాదం (ఎంత ఎక్కువ చేస్తే అంత ఎక్కువ సంస్కరణ వాదం), తాము చేస్తే నూతన వ్యవస్థ (ఎంత తక్కువ చేసినా నూతన వ్యవస్థే) అనేది వితండవాదం తప్ప వేరే ఏమీ కాదు. నిజంగానే ఆ సహకార సంఘాల నిర్మాణంలో గాంధేయవాదుల సంఘాలలో లేని విప్లవాత్మక లక్షణం ఏమయినా ఉంటే (వాటి సలహాదారుడి చేతిలో ఎకె-47 ఉండడం అన్నదొక్కటేకాక) ఒప్పుకోవచ్చు. నిర్ణయాలు మరింత ప్రజాస్వామికంగా తీసుకుంటున్నారా, నాయకత్వాన్ని మరింత ప్రజాస్వామికంగా ఎంపిక చేసుకుంటున్నారా, పెట్టుబడి మరింత నిస్వార్థంగా అందజేస్తున్నారా? ఏవీ లేకపోగా నాయకత్వం ఎంపికలో అసలు ప్రజాస్వామ్యమే ఉండే అవకాశం లేదు. అన్నలు నియమించిన వాడిని ఆమోదించవలసిందే.

నిజామాబాద్ జిల్లాలో నక్సలైట్లు ప్రవేశించక ముందునుండి కొన్నిచోట్ల గ్రామాలలో అభివృద్ధి కమిటీలు ఉండేవి. గ్రామ పంచాయితీతో సంబంధం లేకుండ కులానికొక ప్రతినిధిని ఎంపిక చేసుకొని ఈ కమిటీని ఏర్పాటు చేస్తారు. గ్రామానికి మంజూరయ్యే అభివృద్ధి పనులు ఈ కమిటీల ద్వారా అమలవుతాయి. పీపుల్స్‌వార్ రంగప్రవేశం చేసిన తరువాత ఈ కమిటీలను తన అదుపులోకి తీసుకొని ప్రతినిధులను తాను నామినేట్ చేయడం మొదలుపెట్టింది. వాళ్ళ అదుపు ఉండడం వల్ల మొదట్లో అవినీతి కొంత తగ్గడమే కాక అధికార్లు 'ఒళ్ళు దగ్గర పెట్టుకొని' పనిచేయడం వల్ల పనులు బాగా అవుతున్నాయి. అయితే గ్రామకమిటీ సభ్యుల ఎంపిక ప్రజాస్వామికంగా లేకపోవడం వల్ల, అన్నల ఆశ్రితులకు అది గుత్త కావడం వల్ల, అవినీతి కొత్తరూపంలో ముందుకొచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సొంతపనుల మీద కామారెడ్డికీ నిజామాబాద్‌కూ ట్రిప్పులు కొడుతూ ఇన్నిసార్లెందుకు తిరుగుతున్నావని గ్రామస్తులడిగితే ఫలాన ఇంజనీరు లేక సూపర్‌వైజర్ తిప్పించుకుంటున్నాడని సాకు చెప్తున్నారనీ అది అబద్ధం అనే ధైర్యం లేక ఆ ఉద్యోగి మౌనంగా నింద భరించవలసి వస్తున్నదనీ కథలు వినవస్తున్నాయి.

పీపుల్స్‌వార్ చేస్తున్న సంస్కరణాత్మక చర్యలలో విమర్శ లేకుండ మెచ్చుకోదగ్గది, టీచర్లు లేని స్కూళ్ళలో విరాళాలు సేకరించి టీచర్లను నియమించడం. ఇక్కడ దాదాగిరీకీ ఆశ్రిత పక్షపాతానికీ తావు తక్కువ కాబట్టి వాళ్ళ ఎకె-47 సంస్కృతికి ఈ ప్రయోగం బలి అయ్యే ప్రమాదం లేదు. అయితే వారి అన్ని ప్రయోగాల లాగ ఇదికూడ దళాలు రెగ్యులర్‌గా వచ్చిపోగల మారుమూల ప్రాంతాలకే పరిమితం అయింది.

ప్రజలు పీపుల్స్‌వార్ ఆధ్వర్యంలో సమిష్టి శ్రమతో తమ పనులు చేసుకుంటున్నారనేది 'నూతన వ్యవస్థ' పొడసూపుతున్నదని చెప్పుకోవడానికి చూపిస్తున్న మరొక ఉదాహరణ. దీనికి తార్కాణంగా రెండు చెరువులు తప్ప వేరే ఏమీ దొరకడం లేదు కాబట్టి హుస్నాబాద్ స్థూపాన్ని కూడ వాటితో జత చేసి చెప్తున్నారు. (స్థూపాలు కట్టుకోవడం మన కమ్యూనిస్టులకు కొత్త అయినట్టు.) అన్నలు అనేక చెరువులు, కాలవలు, రోడ్లు కట్టిస్తున్నారని అప్పుడప్పుడు పత్రికలలో వార్తలు వస్తున్నాయి గానీ ఇప్పటికి కట్టినవి రెండు చెరువులు మాత్రమే. ఇవి కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వీర్నపల్లి అవతల ఉన్న అడవులలోని మద్దిమల్ల, రంగంపేట గ్రామాలలో ఉన్నాయి. (నిజామాబాద్ జిల్లాలోనూ రెండున్నాయని వినికిడి.) మొదటిది పీపుల్స్‌వార్ ఆధ్వర్యంలో, రెండవది జనశక్తి ఆధ్వర్యంలో నిర్మించబడ్డాయి. అయితే చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే పీపుల్స్‌వార్ వాళ్ళు చెరువు నిర్మాణం చేపట్టిన మద్దిమల్ల ఆ ప్రాంతంలో (అప్పట్లో) పనిచేసిన మధుదళం కమాండర్ మధు (మోహన్‌రెడ్డి) స్వంత ఊరు. జనశక్తి వాళ్ళు చెరువు కట్టించిన రంగంపేట ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జంపన్న స్వంత ఊరు. ఈ నాయకులకు మంచి పనులు చేయడానికి తమ స్వంత ఊర్లే దొరికాయా? పోనీలే, ఎక్కడయితేనేం మంచి పనే చేసారు కదా అంటే నాకేం అభ్యంతరం లేదు. కానీ ఒక కాంగ్రెస్ లేక తెలుగుదేశం ఎం.ఎల్.ఏ తన నియోజకవర్గంలో తన గ్రామానికే పనులు మంజూరు చేయించుకుంటే నాబోటి వాడెవడయినా 'పోనీలే ఏ ఊరయితేనేం, పనులు మంజూరు చేయించాడు కదా' అంటే ఎం-ఎల్ పార్టీలూ వారి మేధావులూ ఊరుకుంటారా? ఉదార వాదంలో కూరుకుపోయావని దుమ్మెత్తిపోయరా?

పోతే, ప్రభుత్వం మీదనే - మొత్తంగా - ఆధారపడకుండ ప్రజలు తమ శ్రమను సమిష్టిగా వెచ్చించి చెరువులు, రోడ్లు కట్టుకోవడం మన దేశ చరిత్రలో ఇది మొదటిసారికాదు. గాంధేయవాదులు, సర్వోదయవాదులేకాదు, స్వచ్ఛందసంస్థలు, ఆర్.ఎస్.ఎస్ వారు సహితం రెండు చెరువులు, మూడు తూములేం కర్మ, చాలా చేయించారు. చంద్రబాబునాయుడు జన్మభూమి పథకంలో కూడ గ్రామకక్షలు లేని ఊర్లలో ప్రజలు ఉమ్మడిగా శ్రమ చేసి ఉపయోగకరమైన నిర్మాణాలే చేపట్టారు. ఎవరు చేయించినా ఇది మంచిదే. కేవలం నాయకత్వం ఎవరిదన్న దాన్ని బట్టి ఒకటి బూటకం, ఒకటి సంస్కరణవాదం, ఒకటి విప్లవం అయిపోవు. చేసే పద్ధతిలో ఏదైనా నిజమైన తేడా ఉంటే - ఎక్కువ సమష్టితత్వం, ఎక్కువ త్యాగం, ఎక్కువ నిస్వార్థం ఉంటే తేడా ఉందని చెప్పుకోవచ్చు. చంద్రబాబునాయుడు జన్మభూమిలో ప్రభుత్వం సగం (లేక *70* శాతం) పెట్టుబడి పెడితే, స్వచ్ఛంద సంస్థలు తమ ఆధ్వర్యంలో జరిపే కార్యక్రమాలకు తాము నిధులు సమకూరుస్తాయి. అన్నల ప్రయోగాలలో అన్నలు పెట్టుబడి ఇస్తారు. జన్మభూమిలోనూ అవినీతి లేకుండ పనులు జరిగిన గ్రామాలున్నాయి. ఇంకా పెట్టుబడి విషయంలో గాంధేయవాదుల ప్రయోగాలలోనే కొన్ని చోట్ల నూతనత్వం ఉంది. పెట్టుబడికోసం ప్రభుత్వం మీద ఆధారపడకుండ రైతులే తమ ఆదాయం నుండి ఇవ్వాలని వాళ్ళు షరతు పెట్టి పనులు చేయించిన గ్రామాలున్నాయి.

పోనీ నూతన చైతన్యమేమయినా వెల్లివిరిసిందా అంటే, మధు దళం నాయకుడు మోహన్‌రెడ్డి సరండర్ కాగానే మద్దిమల్ల చెరువు నిర్మాణం, కాలవల తవ్వకం జరగకుండ ఆగిపోయింది. నాయకుడు లొంగిపోతే రైతుల సమిష్టి చైతన్యం ఏమయింది? దళానికి కొత్త నాయకుడు రావడంతో ఆ చెరువు పూర్తి చేయాలన్న ఆసక్తి పార్టీకి లేకుండా పోయిందా? వాళ్ళకు ఆసక్తి లేకపోతే రైతులెందుకు చేసుకోలేక పోయారు?

ఇన్నాళ్ళకు చంపడం, చావడం, బీడుపెట్టడం, బొక్కలిరగదన్నడం మాత్రమేకాక చేయగల పనులింకా ఉన్నాయని ఆచరణాత్మకంగా గుర్తించినందుకు అభినందిద్దాం. కానీ అతిశయోక్తులకు పోనక్కర లేదు.

నిజానికి ఎం-ఎల్ పార్టీల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో ప్రజల ఆలోచనల పైన వారు ఏ మాత్రం ప్రభావం వేయగలిగారన్న దానికి మొన్నటి పార్లమెంట్ ఎన్నికలలో బిజెపికి వచ్చిన వోట్లే ఒక పరీక్ష. సిపిఐ, సిపిఐ (ఎం)లు కమ్యూనిస్టు రాజకీయాల నుండి పక్కకుపోయాయని ఎంతగా విమర్శించినప్పటికీ వారికి బలం ఉన్న రాష్ట్రాలలో-కేరళ, పశ్చిమబెంగాల్‌లలో - బిజెపి పురోగమనాన్ని గట్టిగానే అడ్డుకోగలుగుతున్నారు. ఆ ఘనత అంతా వారిదే కాకపోవచ్చు. కానీ వారి కృషిని కాదనలేము. కానీ తెలంగాణలో ఎం-ఎల్ పార్టీల ప్రధానకేంద్రాలలోనే బిజెపి మొన్నటి ఎన్నికలలో పెద్ద మొత్తంలో వోట్లు పొందగలిగింది. పీపుల్స్‌వార్‌కూ జనశక్తికీ ముఖ్యకేంద్రమైన కరీంనగర్‌లో బిజెపి అభ్యర్థి గెలవడమేకాదు, 'అన్నల' ముఖ్యకేంద్రాలయిన అసెంబ్లీ సెగ్మెంట్లలోనే ఎక్కువ వోట్లు పొందాడు. ఒకప్పుడు సిరిసిల్ల అసెంబ్లీని గెలుచుకున్న జనశక్తికి ఈసారి మొత్తం పార్లమెంట్ నియోజక వర్గంలో కేవలం 6000 వోట్లు వచ్చాయి. మెదక్‌లో బిజెపి అభ్యర్థి ఓడిపోయాడుగానీ అతనికి ఎక్కువగా వోట్లు వచ్చింది పీపుల్స్‌వార్, జనశక్తి పార్టీల కేంద్రాలలోనే. గెలిచిన బాగారెడ్డి (కాంగ్రెస్)కు ఎక్కువ వోట్లు వచ్చింది అన్నలకు పట్టులేని నారాయణఖేడ్ వంటిప్రాంతాలలో. పార్లమెంట్‌తో పాటు ఎన్నిక జరిగిన హనుమకొండ అసెంబ్లీ ఉప ఎన్నికలలో సాంకేతిక కారణాల వల్ల చెల్లు కాకుండ పోయిన వోట్లు లెక్కపెట్టుకుంటే బిజెపీయే గెలవవలసింది. మళ్ళీ హనుమకొండ అసెంబ్లీ ప్రాంతంలోనే పీపుల్స్‌వార్‌కు అత్యంత ప్రాబల్యం ఉన్న గ్రామాలున్నాయి. భూమి పోరాటాలవల్ల, రాజకీయ దాదాగిరీ వల్ల ఈ పార్టీలు మధ్యతరగతి రైతాంగాన్ని దూరం చేసుకోవడం దీనికొక కారణం కావచ్చు. ఆ వర్గం తెలుగుదేశం కాంగ్రెస్‌ల కంటె 'గట్టి' ప్రత్యామ్నాయం కోసం వెతుకు తుండవచ్చు. అయితే కేవలం మధ్యతరగతి వోట్లతో ఎవ్వరూ ఎన్నికలు గెలవలేరు. పేదలు కూడ చాలామంది బిజెపికి వేసే ఉండాలి.

దీనినెట్లా అర్థం చేసుకోవాలి? ఇది నిలకడ అయిన మార్పు కాకపోవచ్చు. బిజెపికి కేవలం కుతూహలం కొద్దీ వోట్లు వేసిన వాళ్ళు చాలామంది ఉన్నట్టున్నారు. అయితే కమ్యూనిస్టు రాజకీయాల ప్రభావం బలంగా ఉన్న ప్రాంతాలలో కుతూహలం కొద్దీ కూడ బిజెపివంటి పార్టీకి ప్రజలు పెద్ద ఎత్తున వోట్లు వేసే పరిస్థితి ఉండకూడదు.

'ఎం-ఎల్ పార్టీలు ప్రజలకు రాజకీయాలు నేర్పించడం లేదు' అని ఈ మధ్య ఆ పార్టీల అనుయాయులు సహితం అప్పుడప్పుడు అంటున్నారు. నేర్పించక పోలేదు, నేర్పిస్తున్నారు. కానీ ఒక పరిమితమైన రాజకీయం నేర్పిస్తున్నారు. ఈ ప్రపంచంలో దోపిడీదారులున్నారు, ప్రజలున్నారు. అన్ని పార్టీలు దోపిడీవర్గాల పార్టీలుకాగా అన్నలు మాత్రం ప్రజల మనుషులు. దోపిడీ వర్గాలకు అండగా పోలీసుల తుపాకీ ఉండగా ప్రజలకు అండగా అన్నల తుపాకీ ఉంది. ఈ తుపాకీ ఆ తుపాకీపైన విజయం సాధించినప్పుడు ప్రజారాజ్యం ఏర్పడుతుంది. ఇదీ ఎం-ఎల్ పార్టీలు ప్రధానంగా నేర్పిస్తున్న రాజకీయం. ఇదికూడ ఒక రాజకీయమే, కాదనలేం. ఇది తప్పా ఒప్పా అన్న ప్రశ్న అటుంచి దీనికే పరిమితమైన విశ్లేషణలో చాలా విషయాలకు చోటుండదనేది వాస్తవం. దీనినే తమ రాజకీయాలకు కేంద్ర విషయంగా ఎంచుకున్నా దీనిచుట్టూ ఇంకా అనేక విషయాలను అల్లిక చేసి చెప్పవలసి ఉంటుంది. అప్పుడు (పరిమితంగానయినా) బిజెపి వంటి రాజకీయశక్తిని ప్రత్యేకించి ఎందుకు వ్యతిరేకించాలో చెప్పడం సాధ్యం అవుతుంది. కానీ దోపిడీదార్లు-ప్రజలు, ఆ తుపాకీ - ఈ తుపాకీ అనే ప్రాథమిక విషయాలకు పరిమితమైన విశ్లేషణలో హిందుత్వాన్ని ఎందుకు వ్యతిరేకించాలో మైనారిటీల గురించి ఎందుకు బాధపడాలో లౌకికతను ఎందుకు ఆదరించాలో వివరించి చెప్పడానికి చోటు ఉండదు. ఆ లోపం ప్రభావం మొన్నటి ఎన్నికలలో కొట్టొచ్చినట్టు కనపడింది.

## 10

ముగింపుగా ఒక మాట.

నక్సల్బరీ పంథా గురించి నేనేమనుకుంటున్నానో మొదట్లోనే చెప్పాను. అయితే దానిపైన నమ్మకం ఉన్నవారికి కూడ నేను పైన వివరించిన విషయాలూ అభిప్రాయాలూ ఉపయోగపడతాయనే అనుకుంటున్నాను. 30 సంవత్సరాల నక్సల్బరీ అనుభవాన్ని సమీక్షించుకోవడమంటే విప్లవాన్ని అమూర్తంగా ఊహించుకొని చర్చించుకోవడం కాదు. ఎం-ఎల్ పార్టీలు ఎంచుకున్న పంథా, దానిని అమలు చేస్తున్న పద్ధతి వాస్తవంలో ఎట్లాగున్నాయో తెలుసుకోవడం అవసరం. అది సమాజంలో లేవదీసిన కొత్త ఆలోచనలనూ విలువలనే కాదు, దాని చీకటి కోణాలనూ వాటి సామాజిక పర్యవసానాలనూ కూడ అర్థం చేసుకోవడం అవసరం. నా వ్యాఖ్యలతో అందరూ అంగీకరించకపోవచ్చు. కానీ విషయాలను ఉన్నదున్నట్టుగా చూడడం అవసరం. ఇది కేవలం ఆ పార్టీల అవసరం కాదు. వారి అనుయాయుల అవసరం కాదు. ప్రజల అవసరం కూడ. ఎందుకంటే ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకున్నా నక్సలిజం ఈ రోజు ప్రజాజీవితం పైన బలమైన ప్రభావం ఉన్న రాజకీయ శక్తి కాబట్టి.